C

బ్రహ్మర్షి

# రఘుపతి వేంకటరత్నం

923.254
VEN

C.I

ఓమ్

బ్రహ్మర్షి

# రఘుపతి వేంకటరత్నం

జీవితసంగ్రహం - ఉపదేశాలు - కథలు

AOUA N113125

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11004

V.R. NARLA MEMORIAL LIBRARY
W.R. NARLA
D.P.R.L
Acc. No. 11004

ప్రకాశకులు

డా॥ రఘుపతి వెంకటరత్నంనాయుడు
శతజయంతి ఉత్సవసంఘం

1970

I

మొదటి ప్రచురణ :
500 ప్రతులు

మూల్యము :
రెండు రూపాయలు

T
923.254
NEN

ప్రాప్తిస్థానము :
ఆంధ్ర సాహిత్య అకాడమి,
రవీంద్రభారతి,
హైదరాబాదు.

ముద్రణ :
శ్రీపతి ప్రెస్,
కాకినాడ.



బ్రహ్మర్షి

**కులపతి, డాక్టర్, సర్**

**రఘుపతి వెంకటరత్నం**

మహార్నవమి **1862—26-5-1939**

IV

ఓమ్

బ్రహ్మకృపాహి కేవలమ్

*

కీర్తిశేషులు

శ్రీ

పిఠాపురం మహారాజా

రావు వెంకట కుమార మహీపతి సూర్యరావు బహద్దర్

పిఠాపురం మహారాణీ

రావు చిన్నమాంబాదేవి

పుణ్యదంపతుల దివ్యాత్మలకు

*

ఓమ్ శాంతి, శ్శాంతి, శ్శాంతిః.

V.R. NARLA MEMORIAL LIBRARY *
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

బ్రహ్మర్షి

రఘుపతి వేంకటరత్నంనాయుడు

# శతజయంతి ఉత్సవసంఘము

అధ్యక్షులు : శ్రీ ఎమ్. ఆర్. అప్పారావుగారు, ఎమ్. ఏ., ఎమ్. ఎల్. ఏ.

శ్రీ రావు వెంకటకుమార మహీపతి గంగాధర రామారావుగారు.

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు.

శ్రీ కూర్మా వేణుగోపాలస్వామిగారు.

శ్రీ జి. సింహాద్రిగారు.

శ్రీ పసల సూర్యచంద్రిరావుగారు,
తూర్పుగోదావరిజిల్లా విద్యాశాఖాధికారి- కోశాధిపతి.

శ్రీ తారకంగారు,
కార్యదర్శి.

ఓ మ్ !

# గ్రంథపరిచయం

బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నంగారి శతజయంతి 1962 వ సం॥రంలో జేగీయమానంగా జరిగింది. అప్పుడు ఆంధ్రప్రభుత్వం వారు ఒకకమిటీని నియమించారు. దానికి అధ్యక్షులు శ్రీ ఎమ్. ఆర్ అప్పారావుగారు. నిర్విరామమైన వారి కృషివలన, 'గురుదేవుల' అసాధారణ ఔన్నత్యానికి దేశవ్యాప్తంగా శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది. రఘుపతి ఆంధ్రుల కులపతి. ఆనాడు తలపెట్టిన ప్రచురణ కార్యక్రమంలో ఈపుస్తకం కడపటిది. కాని బ్రహ్మర్షి జీవితాన్ని సమగ్రసుందరంగా చిత్రించి ఆంధ్రులకు ఇంకొక ప్రచురణలో అనతికాలంలోనే ఈసంఘ ప్రచురణలకు సంపాదకులైన మహాకవి శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు అందివ్వడానికి పూనుకున్నారు. ఇది సంతోషదాయకం.

ఈపుస్తకం ఐదు భాగాలుగా అమరింది. జీవితసంగ్రహచరిత్రతో ప్రారంభమై, వెంకటపార్వతీశ్వర మహోదయుల నీరాజనంతో పూర్తిచేయబడింది. ఈ రత్నమాల బ్రహ్మర్షి ఉపదేశసారాంశము. వారు అపూర్వఅధ్యాపకులుగా, సోదాహరణంగా విద్యార్థులకు అప్పుడప్పుడు ఉపదేశించిన కొన్ని గాథలు; వారినిగూర్చి సేకరించిన కథలు- ఈమణిపూసలతో, మచ్చునకు చిన్న అలంకారంగా తయారైనది.

ఈకూర్పులో లోపాలు అనేకం ఉంటాయి. సహృదయులు, విచక్షణాశీలురు మెరుగులను మాత్రమే వీక్షిస్తారని ఆశిస్తున్నాము. వస్తువు నిష్కళంకమైనది. చేతలోసి దోషాలని మన్నించాలి!

'రత్నహారము' ప్రదర్శించి ప్రజలను రంజింపచేయుటకు అనుమతిని అనుగ్రహించిన పెద్దలకు మాకృతజ్ఞతాభివందనాలు. ఈ హారానికి సామగ్రిని సమకూర్చిన సహాయకులందరికిని మా నమోవాకాలు.

'శ్రీపతి'కి మా ప్రత్యేక ధన్యవాదాలు.

తారకం.

VIII

# విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| 1. బ్రహ్మర్షి జీవితసంగ్రహము— | శ్రీ తారకం | 1 |
| 2. బ్రహ్మర్షి ప్రసంగములు—ఉపదేశములు— | శ్రీ ఎమ్. ఆర్. అప్పారావుగారు | 17 |
| 3. బ్రహ్మర్షి కధలు—సంకలనము— | శ్రీ తారకం | |
| తెనుగుసేత— | శ్రీ ఓలేటి శ్రీరామ చంద్రమూర్తిగారు | 61 |
| 4. బ్రహ్మర్షి గాదలు— | శ్రీ తారకం | 72 |
| 5. రత్నహారం — | శ్రీ వేంకటపార్వతీశ్వరకవులు | 85 |

ఓమ్

# బ్రహ్మర్షి
# రఘుపతి వేంకటరత్నంనాయుడుగారు

## 1

## సంగ్రహ జీవితచరిత్ర

ఆధునిక ఆంధ్ర మహాపురుషులలో శ్రీరఘుపతి వేంకటరత్నం నాయుడుగారు అగ్రశ్రేణికి చెందినవారు. "పంతులుగారు—నాయుడుగారు"- నవ్యాంధ్ర నిర్మాతలని యావదాంధ్రావనిలో వినుతికెక్కినవారు. కర్మయోగమువలన వీరేశలింగవీరుడు, భక్తి యోగమువలన వేంకటరత్నఋషి తెలుగువారి తేజమును ఇరువదవ శతాబ్దమున ప్రజ్వలింపజేసిన యుగపురుషులు. నవ్యాంధ్రప్రదేశ నాయకమణు లనేకులు వారిశిష్యులు.

క్రీ. శ. 1862 సం॥ అక్టోబరు 1వ తేదీ (దుందుభినామ సంవత్సర ఆశ్వయుజ శుద్ధ మహర్నవమి బుధవారం) శ్రీనాయుడు గారు జన్మించిన సుదినము. మచిలీపట్టణము వారి జన్మస్థలము. "బందరు ఉప్పెన" అని నేటికిని చెప్పబడు తుఫానులో ఈ రెం డేండ్ల బాలుని ప్రాణము దక్కుట, విశ్వేశ్వరుని విచిత్రవిధానము. వారి తండ్రి సుబేదార్ అప్పయ్యనాయుడుగారు మన్ననల నందిన సైనికోద్యోగి. విష్ణుభక్తురాలు శేషమ్మగారు వారి తల్లి. వీరికొక తమ్ముడు, వెంకయ్యనాయుడుగారు, ఫోటోగ్రఫీలో ప్రఖ్యాతి నొందిరి. నాయుడుగారి బాల్యదశ సైనిక స్థావరములందు విద్యా భ్యాసములో గడచెను. ఉత్తరహిందూస్థాన మందలి "బాందా"లో వంగదేశీయులైన దీనానాథ్ బెనర్జి, గంగాధర ముఖర్జీ అను అధ్యా

పకుల యొద్ద విద్య నభ్యసించిన పిమ్మట వేంకటరత్నం ఆచార్య అఘోరనాథ్ చటోపాధ్యాయుల శిష్యుడై హైద్రాబాద్‌లో మెట్రిక్ పరీక్షయందుత్తీర్ణుడయ్యెను. ''బాందా''లో చదువుకొనునప్పుడే పాఠ్యగ్రంథమునందు రామమోహనుడను వ్యక్తి సహగమన దురాచారమును మాన్పి 'బ్రహ్మసమాజ' మను ఏకేశ్వరుని మానసికముగ ఉపాసించు వారల ధర్మమండలిని స్థాపించిన మహనీయుడని చదివి ఆయన జీవిత విశేషములను ఆసక్తితో తోటిసహాధ్యాయుని నడిగి తెలిసికొన మొదలిడెను. అప్పుడే బ్రాహ్మధర్మ బీజములు ఈ బాలుని హృదయక్షేత్రమందు నాటుకొనెను. పెద్దవాడైనపిదప ఎఫ్. ఏ. తరగతుల్లో విద్యనభ్యసించుచుండగా 1881 లో పండిత శివనాథశాస్త్రిగారివక్తృత్వసమ్మోహనాస్త్రము వారిని బ్రహ్మసమాజమునకు ఆకర్షించెను. 1882 లో శ్రీ మున్నవ బుచ్చయ్యపంతులుగారి పరిచయభాగ్యము కలిగెను. శాస్త్రిమహాశయులు వారికి ధర్మదీక్ష నిచ్చిరి. ఆ యాచార్యోత్తములకు తగినప్రచారకునిగా తయారవవలెనని ఆయన సంకల్పించిరి. 1885 సంవత్సరములో చెన్నపురి క్రైస్తవ కళాశాలనుండి శ్రీ నాయుడుగారు పట్టభద్రులైననాటికి వారి గురుదేవులు డా॥ మిల్లర్. మిల్లర్‌దొరగారి ప్రభావమే నాయుడుగారిలో అడుగడుగు నందును సుస్పష్టముగ గోచరించుచుండెను. 1891 లో ఎం. ఏ., 1897 లో ఎల్. టి. డిగ్రీలను పొంది 'లా' చదువనారంభించి విరమించుకొనిరి.

శ్రీ నాయుడుగారికి చిన్నతనమునందే వివాహమయ్యెను. సహధర్మచారిణి శేషమాంబగారు. వారికొక పుత్రుడు జన్మించిన రెండవమాసమందే మరణించెను. నాయుడుగారి బ్రాహ్మసమాజ మతావలంబనమే ఈ శిక్షకు కారణమని జనకుడు నాయుడుగారిని బాధించెను. కోడలితో తల్లిదండ్రులు బ్రహ్మసమాజమునకు నన్ను

వెళ్ళవలదని చెప్పింప చూచిరి. "నాకు చెప్పుట కిష్టములేదు" అనెను, ధర్మపత్ని శేషమ్మగారు. 'ఐతే ఇంటినుండి నేను వెళ్ళిపోతా" నన్నారు తండ్రిగారు. ఎవరిని ఏమియుననలేక జనని ప్రహ్లాదచరిత్ర ప్రత్యక్షమగుచున్నదే'' యని వగచెను. నిరాహారదీక్షతోనున్న యువకరత్నం ఎట్టకేలకు భోజనముచేసెను.

మహాయిల్లాలు తన ధర్మపత్ని మాత్రము వారికి అండగా నిలుచుటచే దంపతులు ధర్మమును మాత్రము వీడలేము. సోదరుడు వెంకయ్యగారు, ఇరుగుపొరుగువారిని రావించిరి. తల్లిగారు 'నీధర్మమును విడువమని నాకోరికగాదు; నాయనా, కొన్నివారములు మాత్రము సమాజమునకు వెళ్ళకు" అనిరి. మనస్సాక్షి బాధపడినది. తుదకు కుమారు డియ్యకొనెను. తండ్రిగారితో తల్లి 'అబ్బాయి వచ్చే వారమునుండి సమాజానికి వెళ్ళడు. వాడిమీద ఎందుకాగ్రహం ఇంకా" అన్నారు. వెంకటరత్నం "ఈవిధంగా ఇంక మనల్ని క్షోభపెడుతూంటారు. పోనీ, సమాజానికి వెళ్ళడం మానేద్దామా ?'' అన్నారు భార్యతో. "మీరు మానివేస్తారుకాబోలు' నాకు తెలియదు; "నేనుమాత్రం మానను" అన్నారు, ఆమె. "నేనుకూడా నిజంగా అనలేదు'' అన్నారు వేంకటరత్నంగారు. ఇంతబాధకలిగినా తండ్రిగారు పూజించే బొమ్మలవైపు, ఆయన కాళ్ళుంచి ఎన్నడూ పడుకోలేదు. వారి పూజావిధానాన్ని మన్నించేవారు. తరువాత వారికొక కుమార్తె కలిగి సుమారు అరువది సంవత్సరములు జీవించెను. శ్రీ నాయడు గారికి 27వ ఏటనే పత్నీవియోగము సంభవించెను. కాని ధీరోదాత్తులై వారేక పత్నీవ్రత దీక్షలో ఇహలోకయాత్ర సాగించిరి. సెప్టెంబరు 30వ తేదీ, వారి ధర్మపత్ని, వారి ధర్మోపదేశకులు పండిత శివనాథశాస్త్రిగారు స్వర్గధామము నలంకరించిన దినము. ప్రతిసంవత్సరము ఆదినము కన్నీరు మున్నీరుగా ప్రవహింప,

ఏకాంతోపాసనలో గడపెడివారు. ధవళవస్త్రధారి, అజాను బాహువు; నాయుడుగారొక పాదుషావలె గోచరించుచుండెడివారు.

వారు 1886 లో చెన్నపట్టణమందు "ప్రీపుల్సు ఫ్రండ్", "బ్రహ్మప్రకాశిక", "దిఫెలోవర్కర్" అను ఆంగ్లపత్రికల సంపాదకీయవర్గములందు పనిచేసిరి. తన బాల్యదశలో వెంకటరత్నంగారు Imperial fortune teller అనే జ్యోతిష ప్రశ్నలపుస్తకములో నే నేవృత్తిలో చేరవలెను అను ప్రశ్నకు ప్రత్యుత్తరము చూడగా, 'నీవు ఉపాధ్యాయుడ వయ్యెదవు.' అని సమాధానము దొరకెను. చిత్రముగా, అట్లేజరిగెను. 1886 మొదలు 1888 వరకు మొట్టమొదట ఏలూరులోను పిమ్మట రాజమహేంద్రవరము, మచిలీపట్టణములందలి ఉన్నతపాఠశాలలలోను, ఉపాధ్యాయులుగనుండిరి. 1889-92 సికింద్రాబాద్ 92-93 మద్రాసు పచ్చయప్పకళాశాల, 94-95 బందరు నోబులు కళాశాల, మరల 1899-1904 వరకు సికింద్రాబాద్ మహబూబ్ కళాశాలలలో అధ్యాపకులుగ నుండిరి. బందరులో పనిచేసిన కాలమందు పాశ్చాత్య క్రైస్తవప్రచారవ్యామోహమందు పడిపోవుచున్న ఆంధ్రయువకులకు క్రైస్తవమతమును తూలనాడక, ఉగ్గడించుచునే, ఉజ్జ్వలమైన భారతీయసంప్రదాయముల నుద్ఘోషించి వారి జీవనస్రవంతిని మాఋదారి పట్టకుండ నరికట్టిన ఆధ్యాత్మిక ఇంజనీర్ శ్రీ నాయుడుగారు. అప్పటి యువకులపై వారి ప్రభావము దొరలకు క్లిష్టసమస్యగా పరిణమించుటచే ఆత్మస్వాతంత్ర్యముకొరకు వారచ్చటినుండి స్వయముగ తప్పుకొనిరి. కాని, ప్రిన్సిపాల్ క్లార్కుదొరగారు "నేనీదేశమున పనిచేసినంతకాలము, షేక్స్పియర్ చెప్పిన అధ్యాపకులలో ఇంతటిపండితుని కాంచలే'దని ప్రశంసించిరి. అరోజులలో శిష్యులెల్లవేళలందును తమని చుట్టియుండుటచే 'పిల్లలకోడి' యని నాయుడుగారిని పిలుచుచుండెడివారు.

## సంగ్రహ జీవిత చరిత్ర

బందరులో రెండవసారి వారు నోబుల్ కళాశాలలో పనిచేసినపుడు కొన్నిసంవత్సరములపాటు నాయుడుగారు మ్యునిసిపల్ కౌన్సిల్ సభ్యులుగా నుండిరి. ఆదినములలో ఏ యే చిన్న పేచీలు పొడచూపినను సభ్యులందరును, సగౌరవముగ అధ్యక్షులగు మెయిడెన్‌దొరగారితో ఎంతయో ఆనందముగ, భయభక్తులతో, పరస్పర మైత్రీభావముతో కాలక్షేపము చేసెడివారమని నాయుడుగారు చెప్పుచుండిరి. ఇండ్లపై విధింపబడవలసిన పన్నులనిర్ణయమునకు వేంకటరత్నంగారిని నియమించిరి ఒక చిన్నగృహమందు మహమ్మదీయులు నివసించుచుండిరి. ఒకదినమున నాయడుగారు అక్కడకు వెళ్లుసరికి మగవా రింటలేరు. ఒకమగువ "మగవారు లోపలలేరు– లోపలికిరావద్దు" అని వారించెను. "అమ్మా, నేను లోనికివచ్చి తనిఖీచేయకూడదా" అని హిందూస్థానీలో నాయడుగారనిరి. వెంటనే 'బాబా (తండ్రీ) తమరా! అయితే వచ్చి చూడండి' అన్నదామె. ఎవరియెడలచూపని విశ్వాసము మహమ్మదీయఘోషాస్త్రీలు కూడ నాయడుగారియెడ చూపుచుండిరి. వారంత గౌరవము అన్ని కుల, మతములవారిలో నార్జించిరి. ఒకసారి ఇండ్ల పన్నులమీద, అధికారులకు ఫిర్యాదులు (అప్పీళ్ళు) లేవా అని మెయిడెన్ గారికి నాయడుగారు వ్రాయగా అధ్యక్షులు, తమాషాగా "కట్టలుకట్టలున్నాయి. వాటిని పరిశీలించేసభ్యుడు దొరకడం లేదు. మీకు సరదాగా ఉంటే దయచేసి మీరే ఆపని చేయండి" అని వ్రాశారు. తక్షణం నాయడుగారందుల కంగీకరించి, 3 దినములు పట్టణములో మూల మూలలకంతటూ వెళ్ళి స్వయముగాచూచి తన నివేదిక నందచేసిరి.

సభ్యులందరును దానినెంతేని మెచ్చుకొనిరి. వారు వెళ్ళిన ఎన్నియో తావులందు "తమరు దయచేశారా? మాబోంట్లకు

తప్పక న్యాయం జరుగుతుంది. అనేవారట ప్రజలు. అనేకసందర్భ ములలో వారిని మోసము చేసినట్లుకూడ వారికి తెలిసినది. ఆయన దయాస్వభావంయొక్క పరిణామము ఆయన జీవితాంతమువరకును అరీతిగనే ఉండెడిది. మరియొకసారి పాకీవాండ్రందరు సమ్మెకట్ట సంసిద్ధులైరి.

[తక్కువపని ఎక్కువజీతము పొడవైన చీపుళ్లు కొనవలెనని] వారికోర్కెలు అంగీకరింపబడలేదు. నాయుడుగారు అరోజులలో పట్టణములో లేరు; కాని సరిగా సమయమునకు చెన్నపురినుండి వచ్చిరి. వారియింటిని, పాకీవాండ్రు చుట్టుముట్టిరి. ఇంటింటికి వెళ్లి సంతకములు సేకరించి కౌన్సిల్ ప్రత్యేకసమావేశము నేర్పాటు చేయుటకు అధ్యక్షులను అంగీకరింపచేసిరి. ఇదివరలో చేయబడిన తీర్మానమునకు సవరణ జరిగెను. ఆందోళనంతా చల్లబడి అంద రును ఆనందమునొందిరి. అప్పటినుండి న్యాయాన్యాయముల ప్రసక్తిలేకుండగ, నాయడుగారి సహాయము ప్రతివారును కోరు చుండిరి. అనతికాలముననే, నాయడుగారి న్యాయ, దయా స్వభావముతో పాటు, నీతివర్తన అందరికిని విశదమయ్యెను.

ఒకప్పుడు ప్రయాణముఖర్చుల తయారీలో, వారికి నిబంధ నలప్రకారము ఎక్కువరావలసియున్నను తాను ఖర్చుపెట్టినదాని కంటె ఎక్కువ గైకొనరైరి. ఎట్టకేలకు నిబంధనల నందరితోపాటు ననుసరింప తప్పినదికాదు. మెయిడెన్ దొరగారు అప్పుడప్పుడు వారి తెలుగుభాష వాడకముతో, సభ్యులను ఎంతో నవ్వించెడివారు.

[ఉ॥ నీకు భార్య ఉన్నదా ?- లేదండి- ఎందుకుపెట్టుకో లేదు."... "నీకు పిల్లలులేరా ? లేరండి- ఎందుకు చెయ్యలేదు ?]

తాముపనిచేసిన విద్యాలయములందు సాధారణముగ నిలువ బడియే పాఠములను చెప్పుట నాయడుగారికి అలవాటు. అంధ్రా

అర్నాల్డు' అని వారు పేరుగాంచిరి. ఎక్కడ ఉద్యోగముచేసినను వారు వేతనాభివృద్ధికి ప్రాకులాడలేదు. తుదకు 1905 మొదలు 1919 వరకు అసామాన్య ప్రతిభావిశేషముతో కాకినాడ పీఠికాపురాధీశుల కళాశాల ప్రధానాచార్య పదవిని నిర్వహించిరి. శ్రీనివాసశాస్త్రిగారి వంటి వ్యక్తితో పోటీపడినను శ్రీ నాయుడుగారు కాకినాడ ప్రిన్సిపాల్‌గావచ్చుటు ఆనాడు ఒక అపూర్వ సంఘటన. కాకినాడలో నాయుడుగారు మొదట దిగినపుడు తల్లిగారికొరకు పరుగిడుచుండ జారిపడిరట. "సీజర్‌వలె ఇక నేను కాకినాడ చేపట్టితిని; వదల"నని నారట. అల్లే తరువాయి జీవితమును ఆపురమునకే ఆయన అంకితము చేసిరి. వారు కళాశాల విద్యార్థులను నిజమైన జాతీయ పౌరులుగ, నీతివర్తనులుగ, భగవద్భక్తులుగా చేయసంకల్పించుకొనిరి. ఆంధ్రదేశమందు విద్యార్థినులకు, నిమ్నజాతులకు ఉచిత విద్యాదానము ప్రారంభమైనది కాకినాడ కళాశాలయందే. విశ్వవిద్యాలయప్రతినిధుల తనిఖీలో ఖర్చు లెక్కువగుచున్నవని విమర్శింప "శ్రీరాజావారు భరించుటకు సిద్ధముగ నున్నారు; మీకేమి నష్టము వచ్చిన"దని వారి నెదుర్కొనిరి. చరమదశలో వారన్న పవిత్రవాక్యములు హృదయములను పులకరింపజేయును. నాహృదయమునకు దిగువ అరంగుళము చీల్చుడు. అక్కడ 'పిఠాపురంరాజావారి కళాశాల'అని లిఖింపబడియుండును.'అనిరి.

విద్యారంగమందు శ్రీ నాయుడుగా రాక్రమించిన ఉన్నత స్థానములలో మకుటాయమానమైనది. 1926-28 వరకు వారు మద్రాసు విశ్వవిద్యాలయోపాధ్యక్ష పదవి నలంకరించుట. చెన్నపురి విశ్వవిద్యాలయమునకు ఎన్నికవలన ఉపాధ్యక్షపదవికి వచ్చిన ప్రముఖ విద్యావేత్తలలో ప్రప్రథములు శ్రీ నాయుడుగారు. వైస్‌ఛాన్సెలర్‌గా నుండి ఎన్నెన్నో సంస్కరణలు వారందు ప్రవేశపెట్టిరి. ద్రవిడ భాషలకు ఉన్నతస్థానమిచ్చిరి.

## రఘుపతి వేంకటరత్నంనాయుడుగారు

ఈ శతాబ్ద ప్రారంభమున తెనుగుగడ్డ సంఘదురాచారముల కాలవాలమై అంధకారముచే నావరింపబడియుండెను. అప్పుడు దేశమునకు నవచైతన్యము నిచ్చిన విప్లవవీరులు, మార్గదర్శకులు, శ్రీ వీరేశలింగంపంతులుగారు; విద్యావేత్త, తపోధనులు శ్రీనాయడుగారు. శ్రీ నాయడుగారు 1906 లో అఖిలభారత ఆస్తిక సభాధ్యక్షులైరి. కృష్ణా, గోదావరీమండల స్థానికసంస్థల యందేమి, విశ్వవిద్యాలయ అనుబంధసంస్థలయందేమి, పట్టభద్రుల స్నాతకోపన్యాసములందేమి, సంస్కరణ సమావేశములందేమి, మతప్రబోధ వేదికలందేమి, శాసనసభలందేమి- ఇట్లెన్నెన్నో ప్రజాసంస్థల యందు వారు బాధ్యతాయుతమైన పదవులను స్వీకరించిరి. ఒక తరముపాటు నాయుడుగారు ప్రబోధముల గావించిరి. తమ అఖండ పాండిత్యముచే, గంభీర ఉపన్యాసములచే ఆంధ్రదేశమును నాయుడుగారు ఉఱ్ఱూతలూగించిన రోజులవి. రావు బహద్దర్, దివాన్‌బహద్దర్, సర్, కులపతి మున్నగు బిరుదులు, డి. లిట్., ఎల్. ఎల్. డి. విశ్వవిద్యాలయ గౌరవపట్టములు పొందిరి. వారి డెబ్బదవ జన్మదినోత్సవమునాడు యావద్భారత బ్రాహ్మసమాజములచే నాయడుగారికి "బ్రహ్మర్షి" యను బిరుదము శ్రీ సీతానాధ తత్త్వభూషణుల అధ్యక్షత నొసంగబడెను. అనేక విద్యాసంస్థలకు ప్రార్థన సమాజములకు, ఆంధ్రబ్రాహ్మసమాజ ప్రచారమునకు శ్రీ పిఠాపురం మహారాజావారిచే భూరివిరాళము లిప్పించుటయే గాక వారిని ప్రోత్సహించి మహోన్నతములైన అనాధశరణాలయము, విద్యాలయము, బ్రహ్మోపాసనామందిరములను కాకినాడ పురమందు నెలకొల్పించిరి.

ఒకసారి పిఠాపురంరాజావారు ఏసంస్థలకు దానధర్మములు చేయవలెనని ప్రస్తావించగా నాయడుగారు ఏవేవో సూచించుచు

మధ్య "అనాధశరణాలయం" అన్నారు. తక్షణం శ్రీ రాజావారు 'తప్పకుండా! అనాధబాలురంటే ఏమిటో నాకు తెలుసు' అన్నారు, అశ్రుపూరితనయనములతో.

ఇది శరణాలయపుట్టుక వృత్తాంతము. 1909 లో అది స్థాపింపబడెను. అశరణాలయం బిడ్డలను ఆడించి, లాలించుటయేగాక, వారి కొరకు కన్నీటిధారలతో ప్రార్థించి వారలకు పెండ్లిండ్లుచేసి, పురుడు పుణ్యముల బాధ్యతకూడ వారే స్వీకరించెడివారు. వీరేశలింగంపంతులుగారి వితంతు శరణాలయము బాలికలనుగూడ ఆవిధముననే ఆదరించెడివారు. అనాధులకు నాయడుగారే ఏకైక జననీ జనకులు.

శ్రీ కృష్ణశాస్త్రిగారాలపించినట్లు [శరణాలయాన్నిగూర్చి]

ఇది తల్లిహృదయమే యిందు యుగాల
పేరాకలి కొక యమృతాన్న మొదవు;
ఇది తండ్రి ప్రేమాంక మిందు గల్పాలయ
శాంతిలో నొక క్షేమాశయ్య యమరు;
ఇది మిత్రు నాశ్లేష, మిం దంతులేని యా
త్రికు నొక యభయహస్తమ్ము నడుపు;
ఇది రాజునోలగ మ్మిందు దేజములేని
బ్రతుకున కొక కార్యరంగ మొసగు;
ఇది యధార్థ పూజాలయ మ్మిందు, బిలువ
బలుకరించు సజీవదైవతము దొరకు;
భక్తి నమ్రశిరస్కులై, భావివేళ,
తెలుగువా రంజ లెత్తి యాత్రికులు గాక!

పైనచెప్పబడిన అనాధశరణాలయ, విద్యాలయ, బ్రహ్మోపాసనామందిరములను, 'రోజరి', 'నర్సరీ', 'శాంక్ట్యుయరి' అని నాయడుగారు పేర్కొనెడివారు. విద్యాలయము జ్ఞానసాధనకును,

బ్రహ్మోపాసనామందిరము భక్తిసాధనకును, శరణాలయము కార్య సాధనకును వారి తపోనిలయములయ్యెను.

దృష్టి తగ్గి, సుమారు అర్ధ సంవత్సరము బాధపడి, మద్రాసు నగరమందుకూడ చికిత్సనొందె. చరమదశయందు, 1938వ సం॥ రము జన్మదినోత్సవము తరువాత, వారికి ఇహలోకజీవితము భారమయ్యెను.

1939 సంవత్సరం మే నెలలో శ్రీనాయుడుగారు నిర్యాణ మొందిరి. తాము "నాయకునిగా" నెంచుకొనిన శ్రీ వీరేశలింగం పంతులుగారు 1919 సంవత్సరము మే నెలలో 27వ తేదీని దివంగతులుకాగా, 'మరణమందు సహితము నేను మీ వెనువెంటనే ఉన్నా' నన్నరీతిని ఆమాసమునందే 26వ తేదీ శుక్రవారము (గురువారం రాత్రి 1-30 గంటలకు) బ్రహ్మముహూర్తమునందు శ్రీనాయడుగారు బ్రహ్మసాయుజ్యము నందిరి. బంధుమిత్రులు, శిష్యులు అనేకులు చుట్టియుండిరి; దుఃఖసాగరమున మునిగిరి. మరునాడు శ్మశానవాటికలో వేమూరి రామకృష్ణరావుగారు, కోకా వెంకటసుబ్బారావుగారు దహనక్రియలను గావించిరి. నాయుడు గారు తమ జీవితాంతమువరకును చెంతనుంచుకొనిన తమ సతీమణి చిత్రపటమును వారికోరిక ననుసరించి హృదయఫలకముపై నుంచ బడెను. సకల కుల, మతములకు చెందినవారు వేలాదిగ ఊరేగిం పులో శ్మశానవాటికకు చేరిరి.

ఆద్యశ్రాద్ధదివసమున శ్రీయుతులు తారకం, నాభి జగన్నాధ రావు, పెద్దాడ రామస్వామిగారలు ఉద్బోధన, బ్రహ్మోపాసన, ప్రసంగములు గావించిరి. పిదప సర్ కూర్మా వెంకటరెడ్డినాయుడు గారి అధ్యక్షతను, స్మారకసభ ఏర్పాటుచేయబడెను. పలువురు ప్రముఖులు అశ్రుతర్పణము గావించిరి. 1942 వ సంవత్సరములో నాయుడుగారి కడపటి కోరిక మన్నించి పీఠికాపురాధీశ్వరులు, వారి

అస్తికలను ఆంధ్రబ్రహ్మోపాసనామందిర అవరణలో వెనుక, తమ కన్నీటితో తడిపి నిక్షిప్తము గావించిరి. ఇవి వారి జీవిత ముఖ్య ఘట్టములు.

వేంకటరత్నం నాయడుగారి నామ ముచ్చరించినంతనే ఇరువదవ శతాబ్ద ప్రారంభదశలో ఆంధ్రదేశమున అఖండజ్యోతిగా వెలిగిన ఒక ప్రముఖ ఆంగ్ల విద్వాంసుడు, ఆచార్యసత్తముడు. దీన బాంధవుడు, మహాతపస్వి అని తెలుగువారు భక్తితో కేలు మోడ్చుదురు. నాయడుగారనే పేరునకు 'ప్రేమ, మానవత్వము, కరుణ, భక్తి పర్యాయపదములైపోయినవి. ఎవరు వారిని దర్శించినను వారి మూర్తి, వాక్సుధ సమ్మోహితులను చేసెడివి. 'గురువు లనేకులుందురు; గురుదేవు డెన్న డెన్నడో యవతరించును. మానవుడు గురువర్యుడు కాగలడు. ఋషియే గురుదేవుడు కాగలడు. ఏబది సంవత్సరము లభినవాంధ్ర యువకులను సత్యసాన్నిధ్యమున నిలువబెట్టిన సోక్రటీసు నాయడుగారు. అధ్యాపకపీఠము, ఆచార్య వేదికయు నాయడుగారి సాన్నిధ్యమున ఏకమయ్యెడివి.

పురాణేతిహాసములో, పారశీక భక్తుల ప్రవచనములో, షేక్‌స్పియర్, వర్డ్స్‌వర్త్, గెటి, కార్లైల్; మిల్టన్, టెన్నిసన్, ఫ్రూడ్ మున్నగు పాశ్చాత్య ప్రవక్తల విజ్ఞానమో తన్మయులై వినుపించు తరి, ఎదురుగా తేజస్స్తంభమువలె కన్పట్టెడివారు నాయడుగారు.

వారి కళాశాల గురుకులము. ఆ గురుదేవులే ప్రతిశిష్యునకు అనురాగస్థానమిచ్చి పెంచుకొనిన తల్లి-తండ్రి.

నాయడుగారి నీతి చండశాసనము కాదు; వారినీతి వీలో నిదురించుచున్న యార్జవ పటిమను ఎగసన ద్రోసి 'నీవెంతో సచ్ఛీలుడవు కాగలవు' అనిపించును. "శ్రీకృష్ణశాస్త్రిగారు చిత్రించిన ఈ సుందర చిత్తరుపు గురుదేవులుగా నాయడుగారి సత్యస్వరూపము,

శ్రీనాయుడుగారివలె ఆంగ్లమున ఉపన్యసింపగల వక్తలుగాని, వారి వలె షేక్స్పియర్ నాటకములను బోధింపగల సమర్థులుగాని, ఆంగ్లేయులలోసహితము లేరని ఆదినములలో శ్రీనాయుడుగారు సర్వత్రా ప్రశంసింపబడిరి. ఛలోక్తులతో,హాస్యవచనములతో,చిన్నపిట్టకథలతో వారిపాఠములు, ప్రసంగములు, సంభాషణలు, ఉత్తేజము కలిగించుచుండెడివి. విద్యావేత్త, ఉత్తమ ఉపాధ్యాయులు అయిన నాయుడుగారు, తమశిష్యులకు మాత్రమే గురువుకాదు. లెక్కకుకానరాని బహిరంగసమావేశములందును, ప్రార్థనకూటములందును, ఆయన అందరకూ గురుదేవులుగా,ఆచార్యోత్తములుగా వినుతికెక్కినవారు. ప్రజాబాహుళ్యమును నీతివర్తనులుగా భక్తిపరులుగా, న్యాయశీలురుగా, అదర్శపౌరులుగా తయారుచేయుటయే వారి ప్రబోధముల ప్రధానాశయము.

నాయుడుగారి దాతృత్వము విశిష్టమైనది. వారిచేతి కెముక లేదు. "కుడిచేయి యిచ్చినది ఎడమచేయి ఎరుగ"దనుట వారి అసంఖ్యాకములైన గుప్తదానములకు చెల్లును. నాయడుగారు 'పాత్రమెరిగి దానముచేయుము' అనెడు సూత్రమును పాటించిన వారుకారు- 'పెరటిలో చెట్టు, నీడ, పండ్లు అందరికీ పంచడం లేదా ? ఏదో భిక్షాటనంచేస్తే, అభిక్షుగాని మనస్సుచీల్చి చూడడానికి మనకేమి హక్కు ?' ఇది ఆయన దానముల ధోరణి.

ఎవరి కుపకారము చేసినను వారిమనస్సు నొప్పింపకుండుటయే నాయుడుగారి ఆశయము. కళాశాలాధ్యక్షులుగా నున్నపుడు వారు విద్యార్థులకు చేసిన యుపకృతుల నద్భుతగాథలుగా జెప్పుకొనుచుందురు. పరీక్షలకు రుసుము, భోజనవసతికి ఖర్చులు, పేద విద్యార్థులకు జీతములు కట్టుచుండిరి. అన్నదాన సమాజ సంస్థాపకులలో వారొకరుగా నుండిరి. ఏపండుగలకైనను; "టీపార్టీలు మానివేసి బీదల కన్నదానముచేయు"డనెడివారు. చెన్నపురి విశ్వవిద్యాలయోపాధ్యక్షులుగా ౩ సంవత్సరముల స్వార్జిత ము దెబ్బది వేల రూప్యము

లలో సొంతఖర్చునకు 5 వేల రూకలుమాత్ర ముపయోగించుకొనిరి. తమ ప్రధానాచార్యులు డాక్టరు మిల్లర్ పేరట చెన్నపురి విశ్వవిద్యాలయమందు ఏఏటట విజ్ఞాన ప్రబోధము గావించుటకు 10 వేల రూప్యముల నిధి నేర్పాటుచేసిరి. వేమనయోగినిగూర్చి ఉపన్యాసము లిప్పించుటకు ఒక ప్రత్యేకనిధి నేర్పాటుచేసిరి. తమ షష్టిపూర్తి ఉత్సవపు కానుకగా శిష్యకోటి సమర్పించిన సుమారు 6 వేల రూప్యములను ఏఏటట జరుగు పట్టభద్రుల సదస్సునందు కళాశాల విద్యార్థులకు బహుమానముల నొసంగుటకు ఆంధ్ర విశ్వవిద్యాలయమున కొసంగిరి. లక్షలాది సొమ్ము నార్జించిన నాయుడుగారికి మిగిలిన ఆస్తి 'వేలాది మని ఆర్డరు రశీదులు' అని మిత్రులన్నమాట యదార్థము. వారికి మిగిలినది వారి కరుణను చూరగొన్న అసంఖ్యాకుల భక్తి విశ్వాసములు. నాయుడుగారి హృదయము నవనీతము, నిరంతరము తోటి మానవుల ఆర్తిని చల్లార్చుటయే వారి దైనిక జీవితము. బాలబాలికలన్న వారి ప్రేమ అపారము. ఎన్నోగంటలు వారితో ఫలాహారములతో, పరిహాసములతో, కథలతో, నవ్వులతో గడుపుచుండెడివారు. మహాత్ము లందరకు నిది సహజలక్షణముకాబోలు.

నాయుడుగారు నైతిక ధీరులు. 1894 వ సంవత్సరములో జరిగిన చెన్నపురి కాంగ్రెస్ సభావేదికనుండి శీలము కొరతవడిన 'నార్టన్' అను ప్రముఖ న్యాయవాది ఉపన్యాసవేదికపై నుండతగడని 32 ఏండ్ల యువకుడైన నాయుడుగారు గర్జింప సభికులు దద్దరిల్లిరి. చుట్టలు కాల్చునలవాటు తప్పించుటకును, మద్యపాన నిషేధముకొరకును, వేశ్యావృత్తి నిర్మూలనమునకును, సాంఘికపారిశుద్ధ్యము కొరకును తెలుగునాడంతయు నాయుడుగారు తీవ్రమగు ప్రచారము గావించిరి. జాతీయ జీవితమందుకూడ బాహ్యాంతరశ్శుచి అత్యంత అవశ్యకమని ఆదినములలోనే అహోరాత్రములు ప్రచారముచేసిన 'మహాత్ముడు' నాయుడుగారొక్కరేయని "కృష్ణాపత్రి" కాధిపతులు జోహారులొనర్చిరి. వేశ్యలలో మాతృరూపమును వెల్లడించిన నాయుడుగారు

ఒక మహాసభలో ప్రసంగవశమున "ఆమె నా సోదరి" అనగానే "సిగ్గు సిగ్గు" అని కేకలు మిన్నుముట్టెను. "ఎవరికి సిగ్గు? తల్లుల తెగకు చెందిన ఆ చెల్లెండ్రను అధోగతికి పాలుచేసిన సంఘదుస్థితి ఎవరికి సిగ్గుచేటు? మీ కన్నబిడ్డలను, మీ తోబుట్టువులను శీలమునకు కళంకము దెచ్చు నృత్యగానములకు పంపెదరా?" అని ఆవేశముతో వా రుపన్యసింప, సభికులు ముగ్ధులైరి. ఆంగ్లమందు వారి వక్తృత్వము గంగాఝరి. విదేశీయులు సహితము అచ్చెరువొందుచుండిరి.

పొన్నేరి స్టేషనులో కనబడిన నలుగురు అనాథబాలికలను, మరికొందరిని తన బిడ్డలుగ పెంచి పెద్దలను చేసిరి. "మీరే లేనిచో వారేమైయుండేవాళ్లు" అని ఒకరనగా "వాళ్లు లేకపోతే నే నేమైయుండేవాడనో" అని జవాబిచ్చినారు నాయుడుగారు. మద్రాసు ప్రయాణపు రాకపోకలలో, పొన్నేరిస్టేషన్‌వద్ద రైలు ఆగినపుడెల్ల ప్రార్థనలో నిమగ్నులయ్యెడివారు. "పొన్నేరి నా పుణ్యభూమి" అని ఒకజాబులో నాయుడుగారు వ్రాసియుండిరి.

వితంతువులను, అనాథలను, పతితులను తల్లివలె ప్రేమించి సకలవిధముల ఆదరించెడివారు. నాయుడుగారి ఆరామము ఆదీనుల పురుడు పుణ్యములకు పుట్టినిల్లు. ఎందరికో ఆయన 'నాయన', 'తాతయ్య'. ఎండ యనక వాన యనక కష్టించు స్త్రీలు, కూలివాండ్రు, రోగులు, ప్రయాణీకులు, ఎందరెందరో నాయుడుగారి దయాంతఃకరణకు పాత్రులైరి. బాధలను చూచి సహింపనేరక తన శక్తికొలది ఎట్టివారికైనను వారు సహాయపడెడివారు. హరిజనోద్ధరణ, మద్యపాననిషేధను మొదలగు నిర్మాణకార్యక్రమము కాంగ్రెస్ చేపట్టుటకు అర్ధశతాబ్ది పూర్వమే ప్రేమపూరితమైన తమ నిష్కామయోగముచే, నేటి సర్వోదయ సమాజస్థాపనకు నాయుడుగారు నిరాడంబరమైన కృషిచేసి, సుస్థిరమైన పునాదులను వేసియుండిరి.

## సంగ్రహ జీవితచరిత్ర

నాయుడుగారి మతమునకు సంకుచితమైన పేరులేదు. సంప్రదాయములకు, సిద్ధాంతములకు, బాహ్యకర్మకలాపములకు అతీతమైన ప్రేమ ఆయన మతవిశ్వాసము. ఏపనిచేసినను ఈశ్వరార్పణగా చేసెడివారు. నిరంతర బ్రహ్మోపాసనయే వారి పరమావధి. తమ జీవితేశ్వరుని ధ్యానములో నిమగ్నులైన సమయములందు వారి తేజోమూర్తి సత్య శివ సుందరము. వారి తపోమహిమయే వారిని శరణాగత రక్షకునిగా, అనాధ నాధునిగా, పతితపావన మూర్తిగా, సాటిలేని ఉపదేశకునిగా, దీనజనోద్ధారకునిగా ప్రసన్నుని చేసినది.

సుప్రసిద్ధ 'కృష్ణాపత్రికా' సంపాదకులు శ్రీ ముట్నూరి కృష్ణారావుగారి భక్త్యంజలి, వారి గురుదేవుల శాశ్వత స్మరణచిహ్నము.

'మహాపురుషలక్షణములు మూర్తివంత మైన విగ్రహ మది. బాతృత్వముచే పొడుగుసాగిన అజానుబాహువు లవి; ఉదారాశయముల కాశ్రయ మిచ్చుటచే ప్రవర్ధమానమైన ఉన్నతవక్షస్థల మది. యోగనిద్రయందు ప్రజ్ఞాచక్రము నిరంతరము పరిభ్రమించుటచే నునుపుదారిన విశాల ఫాలతలమది; ఎట్టి గహన తత్వముల లోతులనైనను జొచ్చుకొనిపోవు నేత్రయుగ్మ మది; పర్వత శిఖరమును బోలి ఊర్ధ్వలోకములకు సోపానములు వేయగల దేవతావిగ్రహ మది.

ఆంధ్రసీమలో నాయుడుగారివంటి మహాపురుషుడు మఱియొకడు లేడు. పాపపంకము చాటున పవిత్రతను జూడగల విశ్వాసము, దైన్యమున ఆత్మగరిమను ప్రతిష్ఠింపగల ధీరవృత్తి, దౌర్బల్యమున శక్తినిసాధింపగల ఉపాసనాబలము- మమ్ములనువారి పాదపీఠమునకు గట్టివైచినవి. వారి సమ్ముఖమున నిలువబడిన ఏ హిమవన్నగము ముందో నిలువబడినట్లుండెడిది; వారితో సంభాషించిన జాహ్నవీతోయముల నోలలాడినట్లుండెడిది. నాయుడుగారి

జీవితము భక్తి రససింధువు; పతితులకు నావ; అనాధలకు పట్టుకొమ్మ; భక్తులకు అమరగానము."

బ్రహ్మర్షి శతజయంత్యుత్సవము 1962 అక్టోబరు 7వ తేదీని, కాకినాడలో అంధ్రబ్రహ్మోపాసనామందిరమందు ప్రార్థనలతోను; 22వ తేదీని సూర్యకళామందిరమందు అమాత్యశేఖరులు గౌ॥ శ్రీ ఎమ్. అర్. అప్పారాపుగారి అధ్యక్షతను; 1965 అక్టోబరు 15వ తేదీని భారతరిపబ్లిక్ అధ్యక్షులు, డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షత క్రింద హైదరాబాదునగరమందు 'రవీంద్రభారతి' లోను కడువైభవముగా జరిగియుండెను.

ఓమ్

# బ్రహ్మర్షి
# రఘుపతి వేంకటరత్నంనాయుడుగారు

II

## నాయుడుగారి ఉపన్యాసాలు - ఉపదేశాలు

**సాంఘికపవిత్రత :**

సాంఘిక నైర్మల్యమును గూర్చి మాట్లాడుతూ ఆయన సమాజాన్ని నైతిక విషయ పరంగా మూడు ప్రత్యేక దశలుగా విభజించవచ్చునని చెప్పారు. ఆ ప్రకారంగా చట్టమూ, ప్రజాభిప్రాయమూ, వివేచనాబుద్ధి— ఇవి సత్ప్రవర్తనను క్రమబద్ధం చేస్తాయి. ఇది ఎంతటి సత్యమో మనమెరుగుదుము. మనం శాసన నిర్మాణం ద్వారా నైతిక పరమైన ఐహిక విషయాలను సాధించడానికీ, శాసనంద్వారాసంఘాన్ని ఉచ్చస్థాయికి తీసికొనిరావడానికి ప్రయత్నిస్తున్నాం. శాసనానికి ప్రజాభిప్రాయం అనుకూలంగా వుంటేనే తప్ప ఆ శాసనం విజయవంతంకాదు. మనం మద్యనిషేధాన్ని అమలుపరచడానికీ, జూదాన్ని నివారించడానికీ, వ్యభిచారాన్ని శిక్షించడానికీ ప్రయత్నిస్తున్నాం. కానీ ఆ ప్రయత్నం ఏమాత్రం జయప్రదం కాలేదు. రెవిన్యూ శాసనంవలె లేక క్రిమినల్ ప్రొసీజరు కోడ్‌వలె సాంఘిక శాసనాన్ని అమలుపరచడం సాధ్యం కాదు. ఒకదొంగ పట్టుబడినట్లయితే క్రిమినల్ శాసనం క్రింద శిక్ష విధించవచ్చు. శిస్తు ఒక రూపాయి నుండి రెండు రూపాయలకు పెంచబడినట్లయితే శిస్తు విధించబడిన వ్యక్తి దానిని చెల్లించవలసి వుంటుంది. కాని మద్యపానాన్ని శాసనం ద్వారా శిక్షార్హం చేస్తే దాన్ని అమలు పరచడం అంత సులభంకాదు. ఎవరో ఒకరు పట్టుబడవచ్చు కాని చాలామంది శిక్షను తప్పించుకోడానికి అవకాశం

ఉంది. జూదగృహాలను మూసివేసినట్లయితే అవి క్లబ్బులు అనే గౌరవనీయమైన పేరుతో తిరిగి వెలుస్తాయి. "దైనందిన లావాదేవీలలో మానవుల్ని సన్నిహితంచేసే అనేక సందర్భాలు, అతి జాగ్రత్తతో మెలగేవారి దృష్టికిని పరిపాలక సంస్థల దృష్టికిని గోచరించవు" అన్నారు ఆయన. సమాజం ప్రభుత్వానికి అండగా ఉండి, నైతిక విషయాలకు సంబంధించిన శాసనాల కనుకూలమైన ప్రజాభిప్రాయాన్ని పెంపొందించాలి. 'ప్రజలు తమ వ్యక్తిత్వాన్ని గుర్తించి స్వధర్మపాలన, ఆత్మ విశ్వాసము, వైరాగ్యభావము, భక్తి, ఆత్మార్పణ, సేవాపరాయణత— ఈ గుణాలను అలవరుచుకొన్నకొద్దీ సమాజం శీఘ్రగతిని అభివృద్ధి చెందుతుంది.' అలా జరిగినప్పుడే 'ఇతరులను అనుకరించే పద్ధతి స్థానంలో వ్యక్తిత్వానికి ప్రాబల్యం ఏర్పడుతుంది. ప్రజలు ఆచారాన్ని లెక్కచేయక స్వయంగా ఆలోచించి పనిచేస్తారు.' ఈ విషయాన్ని నిరూపించడానికి ఆయన కొన్ని ఉదాహరణలు ఇచ్చారు: 'కొన్ని ఇదమిద్ధమైన ఉదాహరణలు తీసుకొని పరిశీలించినట్లయితే ఈ మూడు చర్యలయొక్క ప్రత్యేకత, ఔచిత్యం విదితమౌతుంది. శాసనాలు జాతియొక్క భౌతికపరమైన భద్రతకును, సంక్షేమం విషయంలోను బాధ్యత వహిస్తాయి. ప్రజాభిప్రాయం సాంఘిక సంబంధాలను క్రమబద్ధంచేస్తూ సాంసారికబాధ్యతలను నిర్వహిస్తుంది. వ్యక్తిత్వ భావన మానవునిలో గుప్తంగా ఉండే ఉద్దేశాలను లేక సహజ ప్రేరేపణలను పటిష్టంచేస్తుంది. సమాజంయొక్క నైతిక ఔన్నత్యాన్ని సాధించడానికి వస్తుతః విభిన్నమైన ఉద్దేశాలతో ఈ మహత్తర సాధనాలు వేరువేరు రంగాల్లో పనిచేస్తాయి. మన దేశంనుండే కొన్ని ఉదాహరణలు తీసుకుందాం. శాసనం సతీసహగమనాన్ని రద్దుపరచి వితంతువుయొక్క న్యాయమైనహక్కులను నిర్ణయిస్తోంది. ప్రజాభిప్రాయం స్త్రీపునర్వివాహాన్ని నిరసిస్తుంది. క్రూరమైన దురాచారాలకు గురిఅవుతున్న అసంఖ్యాక ప్రజానీకానికి విముక్తి కల్గించడం వ్యక్తుల న్యాయబుద్ధి,

ఉన్నతభావాలు కల్గియున్నప్పుడు మాత్రమే సాధ్యం అవుతుంది. వ్యక్తులు తమ సమ్మతిని తెలుపుటకు ఎంత వయస్సు కలిగియుండాలో శాసనం నిర్ణయించవచ్చు లేదా అది వివాహ సంబంధమైన హక్కులను పునరుద్ధరించవచ్చు. కాని క్రూరులైన భర్తల ప్రచ్ఛన్న క్రౌర్యాన్ని అణచివేసేది ప్రజాభిప్రాయమే. పవిత్రమైన వాంఛలతో కూడిన సహృదయత మాత్రమే దాంపత్య జీవితాన్ని స్వర్గ తుల్యం చేస్తుంది. శాసనంద్వారా మద్యపానీయాల ధరలను పెంచి అవి ప్రజలకు అందుబాటులో లేకుండ చేయవచ్చు. కాని ప్రజాభిప్రాయంతప్ప ఇంకేదికూడ ఈ దురలవాటును అరికట్టలేదు.

శాసనం బహిరంగంగా అసభ్యంగా ప్రవర్తించే వారిని శిక్షించవచ్చు. కాని అసభ్యకరమైన పాటలను గర్హించేది బలమైన ప్రజాభిప్రాయం మాత్రమే.

శాసనం, జరిగే కార్యాన్ని పరిశీలిస్తుంది. ప్రజాభిప్రాయం ప్రవర్తనను పరిశీలిస్తుంది. వ్యక్తిగతాభిప్రాయం అంతరంగిక వాంఛను పరిశీలిస్తుంది. శాసనం మానవుణ్ణి నేరం చేయకుండ అసహాయుణ్ణి చేస్తుంది; ప్రజాభిప్రాయం మానవుని సాంఘిక జీవితాన్ని ప్రభావితం చేస్తుంది; వ్యక్తిగత బాధ్యతను మానవుని పౌరుషాన్ని అదుపులో పెట్టు తుంది."

శాసనం, ప్రజాభిప్రాయం పరస్పరసహకారం కొరకు ఏ విధంగా పని చేస్తాయో సమగ్రంగా వివరించిన తరువాత ఆయన, శ్రమ నివారణలో సంతుష్టిని, విధినిర్వహణలో సంతోషాన్ని, ఇబ్బందిలో సౌఖ్యాన్ని ఈ ప్రకృతి ఏవిధంగా ఏర్పరచిందో వివరించారు.

ఆహారంతో ఆకలి బాధను నివారించవచ్చు కాని సంతుష్టి కల్గించేది రుచియే. జీవితాన్ని సుఖమయం చేసుకోడానికి ఎంతైనా వీలుంది. కాని మానవునికి జంతువుకు మధ్యగల తేడా అట్టిసౌఖ్యాన్ని వినియోగించుకొనే విధానంలోనే ఉంది. జీవితలక్ష్యంగా సౌఖ్యాన్ని

కోరడం జంతులక్షణం; జీవిత లక్ష్యానికై సౌఖ్యత్యాగం చేయడం మానవలక్షణం. అంటే సహజ స్వభావానికి ప్రాముఖ్యం ఉంటుంది. మానవుడు తన సహజ స్వభావాన్ని హేతుబద్ధం చేసుకుంటాడు. కావున జంతువు తాత్కాలిక సృష్టి. కాని మానవుడు శాశ్వత సృష్టి. ఈ అధిక్యత మూలముగనే మానవుని విషయంలో సౌఖ్యం ప్రగతికి సాధనం అవుతుంది. దానిని విడనాడవలసిన పని లేదు. సౌఖ్యం క్రమబద్ధం చేసుకోవలసిన ఒక సాధనమేకాని బొత్తిగా వదులుకోవలసిన పీడకాదు. "నిగ్రహము" మానవునికి చాల అవసరం. నిర్మలత్వమే నిగ్రహము. గృహ సౌఖ్యాలను, సాంఘిక ఆదర్శాలను నిర్ణయించు స్త్రీ పురుషుల మధ్య ఉండే శ్రేష్ఠమైన సంబంధం మన జాతి గతిని మారుస్తుంది. కావున సాంఘిక నైర్మల్యం అంటే సంపూర్ణ అభివృద్ధికి అనుగుణంగా జీవన విధానాన్ని మార్చుకోవడానికి మన కాంక్షలను అదుపులో పెట్టడం.

అయన స్త్రీని ఒక మాతృమూర్తిగా, సోదరిగా, పత్నిగా భావించారు. ఆయన ఎప్పుడూ స్త్రీని ఒక వ్యభిచారిణిగా ఎంచలేదు. ఆయన స్త్రీని వంచించే మతాన్ని గర్హించారు. మతానికి సంబంధించిన అక్రమాలను తీవ్రంగా నిరసించారు. "బ్రహ్మచర్యం—భగవంతుని సేవకై ఆత్మసమర్పణ చేసుకోవడం— సాంఘిక దురాచారానికి దారితీసింది. పవిత్ర దేవదాసీల స్థానంలో సందేహాస్పదమైన శీలంగల స్త్రీలు వచ్చారు. భారతదేశపు ఆధ్యాత్మిక దురాచారాలను తొలగించే గోప్యస్థితి ఈ జీవంలేని ఎముకల్లో జీవం పోస్తుంది. అంతే కాకుండా అనేకులు ఆచరించే మతవిషయికకార్యకలాపాలలో అసహ్యం పుట్టించే ఉన్మత్త తాండవాలు, ఇంద్రియ సుఖాసక్తి పూరకములయిన లీలలు, కామం మూర్తీభవించిన దేవతలు. అపవిత్రమైన హోలీలు ముఖ్యలక్షణాలు అయినవి. ఈ చెడు ఇంతటితో ఆగడంలేదు. జీవితంలోని అతిముఖ్యమైన విషయాలలో నైతిక విలువలపట్ల చూపుతున్న నేరపూర్వకమయిన ఈనిర్లక్ష్యం

మతాన్ని దోచడమేకాకుండా కొన్ని సందర్భాలలో సాధారణ సంస్కారాన్ని, భక్తినికూడ నాశనం చేస్తున్నది. పవిత్రస్థలాలుగా పేరెన్నికగన్న ప్రదేశాలను జాగ్రత్తగా పరికిస్తే అవి అపవిత్రతతో దుర్గంధ భూయిష్ఠమై ఉండడం గమనించవచ్చును. ఇదంతా చాలా బాధకరమైన విషయం. ఇది మానవశక్తిని మించిపోయేటటువంటి దేమీకాదు. దీనికి నివారణోపాయం సమాజంలో ఉన్నది. ఆచార మన్నది లేనిచోట ఈ విషయాలలో సమాజం అసాధారణంగా మేల్కొంటుంది. విజ్ఞానవంతులు మాత్రమే ఈవిషయాలను ముఖా ముఖిగా చూడాలి. మన జాతీయ ఆదర్శాలలోను, సంప్రదాయాల లోను కావలసినంతగా పవిత్ర ధర్మనిష్ఠాపరత, ఉత్తేజకరమైన నిర్మ లత్వము ఉన్నవి."

వివేచనా రహితంగా మన పూర్వఘనతను చాటుకోవడం అన్నది ఒక విషయం. వివేకంతో దానిని అనుసరించడమన్నది మరోవిషయం.

సాంఘిక, మతైక విషయాలలో నిర్మలత ఉండవలసిన అవస రాన్ని గురించి విశదపరచిన పిమ్మట సానివృత్తి నిర్మూలన ఉద్య మాన్ని ఆయన చేపట్టాడు. ఆంధ్రలో ఉన్న వేశ్యల గురించి వ్యథా పూరితమైన తన హృదయాన్ని ఆయన వ్యక్తం చేస్తాడు. సంగీ తానికి విరుద్ధంగా ఆయన పోరాడుతున్నాడని, వేశ్యలను వ్యక్తి గతంగా ద్వేషిస్తాడని చేసిన నిందారోపణలు ఆధార రహితమైవని ఆయన పేర్కొన్నారు. బాగుచేయడానికి వీలులేనిదాన్ని ఆయన బాగుచేయడానికి ప్రయత్నిస్తున్నాడని కూడ కొందరు అన్నారు. అటువంటి దురదృష్టకరమైన విషయంపట్ల ఏకాగ్రతతో వ్యవహ రించిన వ్యక్తి మరొకరెవరైనా ఆయనకు పూర్వంకాని తరువాతకాని ఎక్కడైనా ఉన్నారా ? ఈవిషయం ఒక్కదానిలోనే ఆయన సంఘ సంస్కర్తలలో అగ్రస్థానానికి అర్హుడవుతున్నాడు. సంగీతం, నాట్యం, నటనలను దుర్మార్గం, అపవిత్రత, సంఘ బహిష్కారాలనే

అవమానాలనుండి రక్షించడంలో ఆయన ఘనవిజయాన్ని సాధిం చాడు. ప్రాచీనమైనవన్న పేరుతో మాత్రమే చలామణీలో ఉన్న కర్కశ ఆచారాలను ఆయన ఎలా ఎదిరిస్తున్నారో చూడండి.

'ఆచారం ఎంతో పురాతనమైనదై ఉండి బహుళ వ్యాప్తి కలిగి ఉండినప్పటికీ అప్పుడప్పుడు ఉత్తేజిత ప్రభావం చూపించుతూ ఉంటుందేకాని చెడును ప్రమాదరహితంగా మాత్రం చేయలేదు. ఈ ఘోర అన్యాయం తనలో జీవిస్తూ పెంపొందటానికి పడేబాధకు భారతదేశం చెల్లించవలసి వస్తున్న మూల్యం వెలుగులోకి రాకుండా పోతున్నది. నిశ్శబ్దంగా దాదాపు అచైతన్యంగా ఈ మూల్యం చెల్లించబడుతున్నది. చెడుయొక్క వికృత స్వరూపాన్ని దాచిపెట్టి బహిరంగంగా దానిని పరిగణించడం వల్ల అది నాగరికమైపోయి అతి వ్యయకారక మవుతుంది. ప్రతికూల భావం మాత్రం ఉండే పోటీని అది నెలకొల్పుతుంది. ఈ ప్రమాద భరితమైన వ్యామోహం సంప దకు, జీవితానికి ఎంత వ్యర్థంగా పరిణమించిందన్న విషయాన్ని దరిద్రదశకు చేరుకొన్న అనేక కుటుంబాలు, నిష్ఫలమైపోయిన వందలకొలది ఆశలు, నిరాశోపహతులయిన అనేకుల జీవితాలు, నిష్ప్రయోజనమైపోయిన అవకాశాలు, ఉపేక్షింపబడిన అనురా గాలు, భిన్నాభిన్నమైపోయిన సంపదలు విస్తారంగా వివరించి చెపు తాయి. ఇంతేకాకుండా ఒక పాపం పట్ల సంఘం ప్రదర్శించే ద్వేషా నికి తగిన పరిమాణంలో సాధారణంగా పశ్చాత్తాపం పడాలని ఉంటుంది. భోగనిరతుడైన సురాజుద్దౌలా తనను గురించి చెప్పిన అసహ్య గీతిక నుద్దేశించి "అది నీ తల్లికే కళంకాన్ని ఆపాదిస్తున్నది; నా పేరును మాత్రమే నీవు దీనికి జతపరుస్తున్నావు" అని చురుకైన వేశ్య బాలిక ఒకతె గర్వంగా ఎదురుదెబ్బ కొట్టింది. సంఘం అవసర మైన వృత్తిగా దేనినైతే పరిగణిస్తున్నదో దానిని నీచ వృత్తిగా ఎవరోగాని పేర్కొనటం లేదు. ఎవరికెంత రాసిపెట్టివుందో అంత కంటె ఎక్కువ ఆశించ నవసరంలేదన్న ఊరడింపుభావం పరితాపా

నికి సులభంగాని వృత్తి కలిగిస్తుంటుంది. నికృష్టదాస్యంకన్నా హీనంగా కవి పరిగణించే ఈ "తెచ్చి పెట్టుకొన్న తృప్తి" పాపపు దురదృష్టకర పెంపకం యొక్క ఘోర శిక్ష. తన కళంకిత జీవితం తనను నైతికంగా కుష్ఠు రోగిని చేసి వేస్తున్నదని ఆమె తల పోయడానికి కూడ ఇందువల్ల సాధ్యం కాదు. ఆ విధంగా అతి నికృష్టుడైన పాపికికూడా స్వర్గంలో తెరచివుంచిన పశ్చాత్తాప ద్వారం ఆచారాలలో తల మునకలైపోయిన సమాజంచే పూర్తిగా మూసివేయబడింది. అందు మూలంగా పశ్చాత్తాప హీనమైన అపరాధాన్ని అది ప్రోత్సహిస్తున్నది. ఇతరుల హీనస్థితి ఆధారంగా ఖరీదు చేసే ఆనందాన్ని ఏదికూడ సమర్థించలేదు. కృత్రిమంగా ఏ సిద్ధాంతమైనా ఉండనీయండి. కాని, వాస్తవానికి జీవితంలో ఎల్లరు అనుభవించే స్త్రీగా ఉండిన ఏ స్త్రీకూడా గాయనిగా ఉండదు. ఉండలేదు. దుఃఖకరమైన ఆమె పరిస్థితే ఆమెను ఆ వృత్తికి అర్హురాలను చేస్తుంది. పాశ్చాత్య దేశాలలోని గానమందిరాల గాయనులతో ఈమెను పోల్చేవారు ఈ ప్రశ్నను మానవమర్యాదలనే వాటి సహాయంతో పరిష్కరిస్తారు. అయితే ఆ దేశాలలో ఈ రకపుజీవితం అగ్రాహ్యముగాను సందర్భ వశాత్తు సంభవించే బలహీనతవల్లను ఏర్పడిపోయినదని, ఇక్కడ తప్పవి సరిగా ఉండవలసిన అర్హతగా పరిణమించినదని వారు మరచి పోతున్నారు. గొర్రెను చంపేవాడే కాక ఆ మాంసాన్ని వండేవారు తినేవారుకూడ జీవహింస చేసినవారవుతారని మనువు ఆరోపిస్తున్నాడు. అటువంటప్పుడు "పతిత" స్థితిని నాట్య వృత్తికి, ఒక యోగ్యతాపత్రంగా పరిగణించేవారికి వేశ్య బాలిక పతితజీవనంలోని తప్పులోను అవమానంలోనూ భాగం ఉండదా ? సంగీతం దైవాంశమయిన కళ. 'క్రూరమృగాలను సాధువులనొనర్చేటంత క్రిందకు దిగి దేవదూతలంత ఉన్నత శిఖరాలకు' అది చేరుతుంది. "అనంతపుటంచులలోకి తీసుకవెళ్లి ఒక్కక్షణం అందులోకి మన దృష్టిని సారింపజేసే అవ్యక్త అగాధ భాష" అది. ప్రేమోప

భోగము, ఆత్మ వికాసకారకము అయిన సంగీతం బహిరంగ నైతిక పతనంతో అపవిత్ర సాంగత్యం పొందడంవల్ల చాలవరకు నిర్లక్ష్యింప బడి అపఖ్యాతి పాలయింది. ఒకప్పుడు మహర్షులు కూడ దానిని బోధించుటకు వెనుకంజ వేసేవారుకాదు. రాకుమార్తెలు కూడ ఈ విద్య నేర్చుకొనకుండా ఉండేవారుకాదు. శీలవతులు, ఉచ్చస్థితిలో ఉన్న స్త్రీలు ఈ కులీనవిద్యను నేర్చుకొని ఉపయోగించిన ఉదాహ రణలు ఎన్నయినా పేర్కొనవచ్చును. వారు దీనిని అగౌరవంగా భావింపలేదు. ప్రజలుకూడ దీనిని దోషముగా పరిగణింపలేదు. ఎప్పు డయితే సంఘం, రాజకీయ సంక్షోభం వల్ల స్థిమితము కోల్పోయి, సాంఘిక స్థాయి దిగజారి పోయిందో మర్యాద అంత రించిపోయింది. తులువతనము అంతరాయం లేకుంతా పైకొచ్చినది. శాంతి, విజ్ఞానోదయం అయిన తరువాత ప్రతిచోటా సంగీతాన్ని దాని పూర్వఖ్యాతికి తీసికొని రావలసి ఉండినది. అయితే సాంగత్య ప్రభావం దానికి కళంకాన్ని ఆపాదించి పెట్టింది. సంగీతం మన సంఘంలోని వేశ్యల విశేష హక్కు కాదని గర్హించనంతవరకు (వగ లాడియొక్క రసహీనమైన సంగీతాన్ని మనం త్రోసి పుచ్చనంత వరకు) ఈ పరిస్థితి ఇలాగే ఉంటుంది. అది పాపానికి చేదోడుగాను నిందార్హమైన దానికి ప్రతిబింబంగాను ఉంటూ మరింత స్వేచ్ఛగా బలిగొంటూనే ఉంటుంది. సిగ్గుబిడియములను పాటించకుండా స్త్రీలోక మంతటిలోను తనొక్కతే 'దేహాన్ని' అద్దెకిమ్చుకొంటూ సోదరి అన్న పవిత్ర నామాన్ని పోగొట్టుకొని కన్య, భార్య, విధవ కాకుండా బ్రతుకుతూ ''చమత్కారంగా మోసపుచ్చేవలలో చిక్కించుకొనే హృదయాన్ని," "నరక ద్వారమయిన గృహాన్ని" కలిగి, తను రోజూ అపవిత్రం చేసేటటువంటి ఆనందం కోసం కళంక పరిచేటటువంటి సౌశీల్యాన్ని నటిస్తూ బ్రతికే వేశ్య పాల్గొనే వినో దాన్ని తిలకించే ప్రతి కుటుంబం, భార్య, పిల్లలు, అతిథులు, స్నేహితులు అందరి మీదా చివరకు కళంకం, హైన్యం, నైచ్యం

తమ ప్రభావాన్ని కలిగి ఉంటాయి. అశుద్ధాన్ని తాకి అంటుకో కుండా ఉండాలనుకోవడం అద్యంతరహితమైన నైతిక శాసనాన్ని రద్దు పరచడానికి ప్రయత్నించటువంటిదే అవుతుంది. విజ్ఞాని, పూజ్యుడు అయిన డాక్టరు భండార్కరు చెప్పిన అమూల్యమైన మాటలు ఇక్కడ చెప్పడం సబబుగా ఉంటుంది. "వేశ్యలకు ప్రాపకం ఇచ్చే వ్యక్తి, వారు ఎంతో బహిరంగంగాగడిపే దుర్నీతిపూరకమైన జీవితాన్ని తగినట్లుగా అసహ్యించుకోవడం లేదని, స్త్రీలో కులీన లక్షణాలు పెంపొందే భూమి అయిన భారతదేశం స్త్రీపవిత్రకు ఇవ్వ వలసినంత ఔన్నత్యాన్ని ఇవ్వడం లేదని నేను ఎల్లప్పుడు అభిప్రాయ పడుతూనే ఉన్నాను. స్త్రీ పురుషుల నైతికవిలువలను వేశ్యావృత్తి హైన్యపరస్తూనే ఉంటుంది. సాని మేళాలను ఏర్పాటుచేయడంలోను వాటికి వెళ్ళడంలోను సంతోషాన్ని పొందే పురుషుని విషయంలో గట్టి ఋజువు ఉండినగాని అతను విశ్వసనీయుడైన భర్తగా ఉంటున్నా డని నేను నమ్మను. ఇంట్లో వేశ్యను ఉంచుకోవడమంటే కుటుంబము లోని బాలబాలికలకు, ముఖ్యంగా బాలురకు, దుర్నీతులలో పాఠం చెప్పడమన్నమాట. వేశ్యను షోకైన విషయంగా పరిగణించినంత కాలం, స్వేచ్ఛగా అనుభవించినంతకాలం పురుషుల నైతికస్థాయి గొప్పగా అభివృద్ధి అవడం గాని, స్త్రీలపట్ల మన గౌరవభావం పెంపొందడంగాని సాధ్యపడదు" విషయాన్నంతా క్లుప్తంగా వివరించే విజ్ఞానపూరిత వాక్కులివి. "ప్రభుత్వాధికారులు, సంఘునాయకులు తాము అహ్వానితులయిన ఏ వినోద కార్యక్రమంలో'గాని వేశ్యలు పాల్గొనకూడదన్న కోరికను శతాబ్ది ప్రారంభంలో తెలియజేసి నట్లయితే భారతదేశంలో నైతికస్థాయి విషయంలో ఖచ్చితమైన అభివృద్ధి కన్పించవచ్చు" అని బిషప్పు వెల్డన్‌గారు చెప్పిన మాటలు ఇక్కడ చక్కగా అమరుతాయి."

స్త్రీలు మాతృమూర్తులుగాను, సోదరీమణులుగాను ఏ విధ ముగా చూడబడినారో రఘుపతి దృష్టాంతముల నిచ్చియున్నాడు.

తనవద్దచేరినవారిలో ఏ తరగతికి చెందిన స్త్రీ కానీ నిలబడిఉన్న వక్ష ములో తాను కూర్చొనెడివాడుకాడు శ్రీ రాజా ధామమోహన రాయ్; ఈమార్గమును ఈయన అనుసరించాడు. ఒకసారి కొంతమంది భారతీయ స్త్రీలు మాజిక్ లాంతరు ప్రదర్శనాన్ని తిలకింపవచ్చారు. వారికి ఆసనాలేవీ లేవు. వారికి తొలుత ఆసనాన్ని ఇచ్చింది ఈయనే. మరోసందర్భంలో ఈయన నడివేసవికాలంలో రైలుప్రయాణం చేస్తున్నప్పుడు తన రెండవతరగతి టిక్కెట్టును ఒక ఆంగ్లో ఇండి యన్ స్త్రీకి ఇచ్చి ఆమె మూడవతరగతి టిక్కెట్టును తాను తీసి కొన్నాడు. మరో సందర్భములో బెజవాడ దగ్గర బకింగిహాము కాలువలో తిరిగే కొంతమంది పడవ నావికులు ఒక బీద స్త్రీని నీచంగా అపహాస్యం చేయడం ఈయన గమనించారు. గౌరవమయిన వ్యక్తిగా ఆమె తన "కులాన్ని" పోగొట్టు కోవడమన్నది వారికి తోచిన కారణం.

భోగంమేళాలుండే పెళ్ళిళ్ళకుగాని, సాంఘిక కార్యక్రమా లకుగాని వారెన్నడూ హాజరుకాలేదను విషయం సుప్రసిద్ధం. ఆ కాలంలో జాతీయోద్యమంపట్ల సానుభూతి కలిగి వున్న బహుకొద్ది మంది యూరోపియన్లలో శ్రీ నార్టనుగారు ఒకరైనప్పటికీ, మద్రాసులో జరిగిన భారతజాతీయకాంగ్రెస్ సమావేశంలో ప్రసిద్ధ పురుషులతో బాటు గౌరవస్థానాన్ని ఆయనకు ఇవ్వడానికి వ్యతిరేకించిన వ్యక్తి వారొక్కరే. అతడు ప్రసిద్ధుడైన బారిస్టరు, వక్తకూడా; కాని అతడు అపవిత్రమైన జీవితం గడుపుతున్నాడని వేంకటరత్నం నాయడుగారు ఆక్షేపించారు. ఆవిధంగా కంఠమెత్తి పలకడానికి మనలో ఎంత మందికి ధైర్యం ఉంది? నైర్మల్యము, సత్యం, ధైర్యం, దాతృత్వం, పేదరికం, పవిత్రతతో కూడిన జీవితం గడిపారాయన. వారి పరిచయ భాగ్యం లభించిన విద్యార్థులను యువకులను ఉన్న తాశయాలతో ప్రోత్సహించాడు. నాయడుగారి సోషల్ ప్యూరిటీ అసోసియేషనులోని సభ్యులంతా నాయడుగారి శిష్యులమని చెప్పుకో

డానికి గర్వించేవారు. వారి ప్రభావం వల్ల బోగపుమేళాలు పాత బడిపోయాయి. నర్తకుల వర్గానికి జెందిన బాలికలందరూ వారి ప్రభావం వల్ల అప్పటి నుంచీ పెళ్లిళ్ళు చేసుకొన్నారు. వారి ప్రోత్సాహం, దాతృత్వం, మార్గదర్శకత్వాల వల్ల పతితవర్గానికి చెందినవారు చాలామంది ఉన్నతస్థానాలను చేరుకొన్నారు.

## మద్యపానం:

సాంఘికపరిశుద్ధత మనజీవితాన్ని అంతను ఆక్రమిస్తుందని వారి అభిప్రాయం. మొదటి నుంచీ అయిన మద్యపాన వ్యతిరేకి, తుదివరకు త్రాగుడును వ్యతిరేకిస్తూనే వచ్చారు. మెట్రొపాలిటన్ టెంపరెన్సు అండ్ ప్యూరిటీ అసొసియేషనుకు అధ్యక్షులై నిగ్రహోద్యమానికి గట్టిగా తోడ్పడ్డారు. 1923 లో మద్రాసు శాసన పరిషత్తు సభ్యులుగా ఉండి రాష్ట్రంలో మధ్య నిషేధాన్ని ప్రవేశపెట్టనందుకుగాను అబ్కారీశాఖ బడ్జెటును నిశితంగా విమర్శించారు. అబ్కారీ ఆదాయంలో అధికభాగం ఏ తరగతి ప్రజానీకమునుండి వస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అబ్కారీ ఆదాయం సమాజపు భౌతిక శక్తిపై దెబ్బ తీస్తూ, శీలాన్ని క్షీణింపజేస్తూ, ఆర్థిక స్థిరత్వాన్ని దుర్బలం చేస్తుంది. అది అన్యాయమనీ, బ్రిటిషు పరిపాలనకే కళంకమనీ వక్కాణించారు:

"అందుకు ఉదాహరణగా ఇక్కడ మనువు అభిప్రాయాన్ని పేర్కొంటాను. సురాపానం, గురువాంగనాగమనాలను పంచమహాపాతకాల తెగలోనే చేర్చాడు మనువు. పూజ్యురాలగు గురువు భార్యను మానవుని ఐదురుగుతల్లులలో ఒకరుగా భావించాలని, మనకు ఉపదేశించారు. హానికరమైన ఈ త్రాగుడును జాతి ఎంత అసహ్యము, అనిష్టము అయిన వస్తువుగా భావించిందో దీనివల్ల తేటతెల్లమవుతుంది. మనదేశంలో రాజకీయంగా, సాంఘికంగా ఎన్నో మార్పులు వచ్చినప్పటికీ ఈ దృక్పథం మారకుండా నిలిచి

వుంది. సామాన్య భారతీయునికి నిగ్రహం అంటే సంపూర్ణ జితేంద్రియత్వం అని మాత్రమే అర్థం అని మహాదేవగోవింద రనడే ఒక సందర్భంలో ఉద్ఘాటించారు. అందుచేత నిగ్రహం అంటే సంపూర్ణ జితేంద్రియత్వమే తప్ప మరేమీకాదు."

నాయుడుగారెన్నో సాంఘిక సంస్కరణ పథకాలను ప్రారంభించి విజయవంతంగా నిర్వహించారు. ఆ విజయం ఇంకా అందుబాటులోకి రాలేదు మనకు. ఆయన సాధించిన ఫలితాలు అద్భుతమైనవి. విధవా వివాహం, స్త్రీ జనాభ్యుదయం, వెనుకబడిన తరగతులవారికి సంక్షేమం, అస్పృశ్యతా నివారణ— ఇవన్నీ వీరేశలింగం పంతులుగారు, పిఠాపురం మహారాజాలవంటి ప్రముఖనాయకుల తోడ్పాటుతో నాయడుగారు తీసుకున్న శ్రద్ధమూలంగా వర్ధిల్లినట్టివి. ఈ అపారమైన కృషికంతకు మానవాళిపట్ల వారికిగల అమితానురాగమే కారణం.

## ప్రేమ మార్గం:

"ఈ సమస్త విశ్వం, విజ్ఞానాలు, ఏఅధికారాలతో కాక ప్రేమ పదార్థంతో నిర్మించబడింది. అందుచేత భగవంతుడంటే ప్రేమ స్వరూపు డన్నమాట. ఈ ప్రేమ స్వరూపమే మన ప్రధాన చింతనయై ఉండాలి. ప్రేమమార్గంద్వారా మాత్రమే మనకు భగవంతుడు లభ్యమవుతాడు. అప్పుడు భగవత్సాన్నిధ్యం మనకు ప్రేమ మార్గం ద్వారా సుసాధ్యం, స్వేచ్ఛాయుతం కావాలంటే, అది సమస్తం ప్రసాదిస్తూ ఏదీ కోరని ప్రేమ అయి ఉండాలి. అలాంటి ప్రేమ ద్వారా త్యాగం సాధ్యమవుతుంది. కలిమిలేములంటూ ఉండవు. స్వర్గ సౌందర్యంలోని రహస్య స్థానాలను, మానవ శ్రేష్ఠతలోని నిక్షిప్త నిధులను కనుగొనడం ప్రేమద్వారానే సాధ్యం. సేదదీర్చే వాన జల్లులు. ఉల్లాసం కలిగించే తెమ్మెరలు, పరవశత కలిగించే పరిమళాలు, మంత్రముగ్ధులనుజేసే గాత్రస్వరాలు, సంతోషాతిశయం కలుగ

జేసేదృశ్యాలు- ఇవన్నీ నాకు అనుభవవైక వేద్యాలు. అవి వంశ పరం పరగా అనుభవింపదగిన స్థిరాస్తి నాకు. ఈ అనశ్వరమైన సంపదలు గల నన్ను పేదనని అనడానికి ఎవరికి ధైర్యం ఉంది? భగవంతుడు నాకు ప్రసాదించిన ప్రేమ అనే దివ్యదృష్టితో మంచు బిందువుల్లో అమూల్యమైన ముత్యాలను వీక్షించగలిగినపుడు, ఇంద్ర ధనస్సు లోని అనందాత్మకమైన శోభను అనుభవించగలిగినపుడు, పేదరి కాన్ని చెడ్డగా భావించడ మెందుకు? మానవునికి పేదరికం పెరిగే కొద్దీ అహం తగ్గుతుంది. క్షమ విషయం తీసుకుంటే, ప్రేమద్వారా, పేదరికం అధికమయ్యేకొద్దీ క్షమా భిక్ష స్వేచ్ఛగా ప్రసాదించ గలుగుతాడు. అసలు తాను క్షమించవలసిన పనే లేదని భావిస్తాడు. ఎందుకంటే ఇప్పుడు క్షమాపణ అవసరమయ్యేటంత అపకారం అతని కెప్పుడు జరిగింది కనుక? తుకారాం గురించిన పరమానంద కరమైన కథను మనం వినలేదా? ఒకనాడు సాయంకాలం శిష్యుడు కానుకగా సమర్పించిన చెఱుకు గడలమోపును ఇంటికి తెస్తూ, దారిలో కలిసినవారందరికీ గడలు ఇస్తూవచ్చాడు. చివరికి ఒకే ఒక గడతో ఇంటికి చేరుకోగా భార్య అతన్ని ప్రశ్నించింది, "ఒక్క చెరుకు గడను మాత్రమే కానుకగా ఇచ్చినలోభి ఎవడు?'' అని. అప్పుడు జరిగిన సంగతిని అతడు విశదపరచగా, ఆ గడతోనే ఆమె అతన్ని బాదింది. ఆ గడ రెండు ముక్కలుగా విరిగింది. ఒక ముక్కను తీసుకొని ఇలా అన్నాడతడు: 'నీవు ప్రియ పత్నిగా, నీ భర్తతోపాటు ఈ ఒక్క గడనైనా పంచుకోవాలి.' అలా క్షమించ డానికి అవకాశం లేనట్లైతే, ఇవ్వటానికి అవకాశం ఉంటుంది. ప్రేమ సాధనకోసం భగవంతుడు అసంఖ్యాకమైన అవకాశాలు ప్రసా దిస్తాడు. గ్రీకు బానిస — ఋషి, ఎపిక్టిటస్‌నుగూర్చి మనం విన లేదా? అతడి యజమాని ఎంతకఠిన హృదయుడో! ఆ ఋషి ఇలా అన్నాడు: "మీరు కఠినంగా వర్తించలేదా? ఆ విధంగా నేను అంగవికలుడినై, ఇకమీదట మీకేమాత్రం ఉపయోగ పడనుకదా?"

ముసలితనంలో విరిగిన కాలుతో అతడు ఇలా అనగలిగాడు. "ఓ యువకులారా! స్వేచ్ఛగా తిరుగుతూ జీవితవరాలను అనుభవిస్తారు మీరు. నెరిసిన తల, వైకల్యంతో కూర్చొనినా భగవంతున్నిస్తుతించ గలుగుటకు కృతజ్ఞుడను నేను". మానవుని ప్రేమించు వాడు తద్వారా భగవంతుణ్ణి ప్రేమిస్తాడను భావనలో తప్పు, అస్పష్టత ఉంది. ప్రధాన సూత్రం ఇది; భగవంతుని ప్రేమించు, అతనికి మారుగా ఇతరులను ప్రేమించవద్దు. అతని కోసమే అతనిని ప్రేమించు. మానవునికి, దేవునికి మధ్య మూడడుగులు మాత్రమే ఉన్నాయంటాడొక సూఫీ. మొదటిదాంతో ఈ ప్రపంచాన్ని దాటు, రెండవదాంతో తర్వాతిలోకాన్ని దాటు, మూడవదానితో భగవంతుడిముందే నిలువగలవు నీవు. 'స్వర్గం, ఇల్లు' సంబంధాంశాలనుగూర్చి పాడ్తాడు కవి. కాని, మనం ఒక అడుగుముందుకువేసి ఇలా అందాం: "స్వర్గం, ఇల్లు– ఏకాంశం." ఇల్లును స్వర్గంనుండి వేరుచేయి, జైయిలుకొట్టుగా అవుతుందాఇల్లు; స్వర్గాన్ని ఇంటినుండి వేరుచేయి, ఎండమావులుగా మారుతుందా స్వర్గం. స్వర్గమే ఇల్లు. ఇల్లే స్వర్గం. మనం ప్రేమలో జన్మించి ప్రేమలో జీవించటమేగాక ఇంట్లో ప్రేమతో నివసించినపుడు, అంతకంటె ఉన్నతస్వర్గాన్ని వేరే ఊహించుకోగలమా? అని అంటాడొక గూఢమతవాది; మహమ్మదీయ విశ్వసృష్టి విషయక శాస్త్రంలో ఏడు ఆకాశాలు, ఎనిమిది స్వర్గాలు ఉన్నాయి. 'అలాగైతే అవి ఎక్కడ ఉన్నాయి? ఎనిమిది స్వర్గాలలో ఏడు, ఏడు ఆకాశాలలో ఉన్నాయి, ఎనిమిదవ స్వర్గం నీహృదయంలోనే ఉంది.' ఆ ఎనిమిదవ స్వర్గం– అత్యున్నతస్వర్గం, యథార్థస్వర్గం– నీలో ప్రవేశించినపుడు నీవు స్వర్గవాసివి కానేరవు– స్వర్గనివాస స్థలం మాత్రమే అవుతావు. అందుచేత భగవంతుడు స్వర్గంలోలేడు, స్వర్గమే అతనిలో ఉంది– స్వర్గమే దైవం. ఎంత వరకు ఆత్మను ప్రేమకు వశీకృతం చేశాను? అనేది అంతిమ పరీక్ష. 'ప్రభూ! ప్రభూ! మీరు ప్రసాదించిన శక్తిద్వారా 'బ్రహ్మ

కృపాహి 'కేవలం' అను అనిర్వచనీయమైన సత్యంయొక్క రహ స్యాన్ని గ్రహించగలిగాను' అని నేను పలుకగలిగినంత మేరకు. ప్రేమయె దైవము, లేదా తమిళ శ్రుతులలో చెప్పబడినట్టు అది- 'అంబేశివం'- ప్రేమే దైవం- ఇది శబ్దాలంకారం కాదు. వాస్త వికాంశం. నగ్నసత్యం. ఈ ప్రేమసందేశాన్ని స్వీకరించిన వారి ఆత్మదర్పణంలో భగవంతుడు ప్రతిబింబిస్తాడు. అతడు భగవంతు డిలో ఐక్యమవుతాడు. అలా భగవంతుడితో అభిన్నమైనవారు ఏదీ కానేరరు. అమృతస్యపుత్రః! 'అంతా ఆపరమాత్ముని చిరంజీవులైన సంతానమే.'

## మహిళాభ్యుదయం :

ఈ ప్రేమనే సృష్టిలోని దైవసాక్షాత్కారంగా వెంకటరత్నం భావించారు. బాల వితంతువు, పీడిత హరిజనుడు, నిరాదరింపబడిన స్త్రీజనం, అనాధశిశువు- వీరికి అండగా నిల్చుటకు వారిని ప్రేరేపిం చింది ప్రేమయే. బాల వితంతువుల వివాహ సమస్య అతడి దృష్టిని బాగా ఆకర్షించింది. ఈ ఉద్యమంలో శ్రీ వీరేశలింగంపంతులుగారికి తోడ్పడ్డా రాయన. రాజారామమోహనరాయ్ సతీసహగమన నిషేధం ద్వారా గొప్ప సేవ చేశాడు. దహన సమయంలో భర్త చితిపై నుండి వితంతువు రక్షింపబడినపుడు, జీవితాంతం నిర్భంధ వైధవ్యమనే మరో నరకంలోకి ఆమె త్రోసి వేయబడింది. వితంతు వుకు పునర్వివాహ హక్కును ప్రసాదించడానికి శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారు తన జీవిత సర్వస్వాన్ని ధారపోశారు. ప్రతి ఆరుగురు హిందూస్త్రీలలో ఒక వితంతువు వుండేదని అనాటి నమ్మకం. వితంతు వివాహాలు జరిపించడంలో నాయుడుగారుఎంతో శ్రద్ధ తీసుకున్నారు. అలా జీవితాంత బానిసత్వం అనే అమానుష క్రూరత్వం నుండి భారత యువతీ లోకాన్ని రక్షించారు. అచార రీత్యా నిందించబడు వితంతువునకు వివాహం పూర్తిగా ఒక నూత్న జీవితాన్ని ప్రసాదిస్తోంది. ఇలాంటి కానుకలెన్నో సమర్పించా

రాయన. స్త్రీలోకానికి ఇంతకంటె గొప్ప సేవ ఏమి ఉంటుంది కనుక? మహిళలనుగూర్చి మాట్లాడుతూ "మహనీయులగు వ్యక్తులను సృష్టించుటయందు బ్రహ్మ సమాజపు సేవలను ఉగ్గడించేటప్పుడు, ఇతరవర్గాలలో తరువాత కన్పించిన వార లెంతో మంది బ్రహ్మసమాజంలో పెంచబడ్డ వారేనన్న విషయాన్ని గ్రహించాలి మనం. జనాభా లెక్కలలో బ్రాహ్మికగా గుర్తించబడటానికి బహుశా సిద్ధంగాలేనప్పటికి, బ్రహ్మ సమాజానికి చెందిన తల్లిదండ్రులచే పెంచి పోషింపబడి, ప్రపంచ గౌరవం పొందిన శ్రీమతి సరోజినీదేవి గారి పేరు మనకు సుపరిచితమే. మనకు సన్నిహితంగా ఉండి బ్రహ్మసమాజంతో ప్రత్యక్ష సంబంధంగల వారిలో శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మిగారు మనకు నిదర్శనం. సదా గౌరవనీయులగు మన కందుకూరి వీరేశలింగం పంతులుగారి ప్రియతమ జీవిత సహధర్మచారిణి ఆమె. ఆంధ్రదేశంలో నిర్వహించబడిన అమోఘమైన అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయనతో పాటు ఆమెకూడా పని చేశారు. ఆయన సాధించగల్గిన ఫలితాలన్నింటిలోనూ ఆమె ఆయన్ని బలపరుస్తూ సహాయకురాలుగా వుండేవారని ఆయనే చెప్పారు. బొంబాయి రాష్ట్రంలో స్త్రీల అభివృద్ధికి దారితీసిన వారందరూ ప్రార్థన సమాజంనుండి వచ్చారు. సాంఘిక, గృహజీవితాలలో వారు సంపాదించిన ఉన్నత స్థానానికి డాక్టర్. ఆత్మారామ్ పాండురంగగారి పిల్లలు ముఖ్యులు. పట్టుదలతో పనిచేసి ప్రసిద్ధికెక్కిన గౌరవనీయురాలైన శ్రీమతి రమాబాయి రనడే పేరుకూడ వుంది. అణగద్రొక్కబడిన వర్గాలను పైకితెచ్చే కార్యక్రమంలో 'బ్రహ్మసమాజం'లోని శ్రీ సఖ్యరాంద్రే ఉత్సాహాన్ని రేకెత్తించి తీవ్రతరం చేశారు.

రాజారామమోహన్‌రాయ్ స్వభావంలోని ఒక గొప్ప లక్షణాన్ని ఉదహరిస్తాను. ఆయన హాజరైన ఏ సమావేశంలోనైనా— అది బహిరంగ సమావేశమైనా, కాకపోయినా; పెద్దదైనా, చిన్నదైనా

ఒక స్త్రీ నిలబడి వుండగా ఆయన కూర్చుని ఎరుగడు. ఆ విధంగా ఆయన పురుషులలో ఉత్తముడని నిరూపించుకొన్నారు కదా? ఇంగ్లాండులో ఆయన స్నేహితురాలొకామె నేనే కనుక ఇంగ్లాండు రాణి నయినా ఇంతగా గౌరవింపబడేదాన్ని కాదని అన్నది. బ్రహ్మసమాజంలో పవిత్రుడైన మహమ్మద్ ప్రవక్త యొక్క ఉన్నత భావాన్ని పూర్తిగా పంచుకొంటాము. మానవుని తల్లిదండ్రులలో ఎవరుగొప్ప? అని ఆయన నడిగినట్లయితే తల్లియే అని ఉద్ఘాటించారు. ఎందుచేతనంటే ఆమె పాదాలవద్ద స్వర్గం వాలుతుంది. మాతృమూర్తిపట్ల గౌరవభావాన్ని కలిగివుండడం బ్రహ్మసమాజ ఉద్యమలక్ష్యాలలో ఒకటి, బ్రహ్మసమాజంలో తల్లి బిడ్డను పోషించడమే కాకుండా ప్రోత్సాహాన్ని కనిగించేది కూడాను. తల్లినుండి గ్రహించిన ఈ ప్రోత్సాహం దేశపరివ్యాప్తమయింది.

ఇక్కడ చాలామంది యువకులున్నారు. వారందరికీ అంతిమ విజ్ఞప్తి చేస్తున్నాను. స్వచ్ఛమైన, బలమైన, తెలివిగల, ప్రయోజనాత్మకమైన భావాన్ని అలవర్చుకొని తరువాత మాతృమూర్తిని గౌరవించడం నేర్చుకోండి. అప్పుడే మానవుడు శక్తిపుంజుకొని ఉన్నత శిఖరాలను అందుకోగులడు. భక్తశిరోమణి ప్రహ్లాదుని ఆధ్యాత్మిక చింతనంలో ఈ 'మాతృభావం'—మాతృవిధేయత—ఒక ప్రధానాంశం, ఒక అవశ్యక సూత్రం గదా? ఈ నిర్మల దృష్టి విశాలదృక్పథాలు గొప్ప ఔదార్యానికే కాకుండా పవిత్రమైన మానవత్వానికి కూడా మూలాధారాన్ని కలుగజేస్తాయి. మాతృమూర్తి పాదాలకు నమస్కరించి, అవతారమూర్తికి నమస్కరించు. సోదరి నివేదిత విజ్ఞతతో చెప్పినట్లు హేమ్‌లెట్ దోషియైన తల్లిని నిందించటం పాశ్చాత్యదేశంలో సాధ్యం కావచ్చు; కాని ప్రాచ్యదేశంలో అసాధ్యం. మాతృమూర్తి ఎప్పుడూ మాతృమూర్తే. తెలివిగల చక్కని ఉన్నతా

త్మకలైన బాలబాలికలను పెంచిన తల్లిచేతులు నిశ్చయంగా బంగారు ఉయ్యాలలే. స్త్రీపట్ల బ్రహ్మసమాజంయొక్క అభిప్రాయ మిదే. మన జాతీయ స్వభావం దృష్ట్యాను, మన దేవతాధర్మం దృష్ట్యాను, మనం మాతృమూర్తులపట్ల గౌరవము, భక్తి కలిగి వుండడం నేర్చుకోవలసి వుంటుంది."

స్త్రీలపై ఆరోపింపబడ్డ పూర్వాపచారా లెన్నింటినో ఈ కాలంలో స్థిరపరచడానికి అన్ని వైపులా మతాధికారం ఉదాహరించే టపుడు, భౌతిక అశక్తతలు మానసిక ఆందోళనలనుండే గాక ముఖ్యంగా ఆధ్యాత్మిక పతనంనుండికూడా సోదరసంబంధముగల ప్రతి స్త్రీని విముక్తురాలను చేయడం నిజమైన బ్రహ్మసమాజకుని ముఖ్య కర్తవ్యం. ఎందుకంటె స్త్రీ హృదయంలోనే భగవంతుని పవిత్ర దేవాలయం నెలకొంటుంది. అందుకనే కదా భార్యను అర్ధాంగి అని ఎంతో సముచితంగా అన్నారు.

## అనాధలు - అస్పృశ్యులు :

పిఠాపురం మహారాజా, మహారాణి వారి సంగక్షణ సహకారాలతో 1909 లో ఆయన అనాధ శరణాలయాన్ని ప్రారంభించారు. విడిచిపెట్టబడ్డ శిశువులు ప్రేమతోను శ్రద్ధతోను జాగ్రత్తగా పెంచబడ్డారు. వారు వెలివేయబడినవారిగా కాక గౌరవనీయులుగా పోషింపబడ్డారు. ఇదే గురువుగారు నేర్పిన పాఠం. దాన్ని మన మిప్పుడు విస్మరిస్తున్నామేమోనని నాకు భయంగా వుంది. అనాధుల పోషణ సమాజపు ముఖ్య కర్తవ్యం. ఎక్కడైతే అనాధుల ఆర్తనాదం అణచివేయబడిందో అక్కడ సమాజం క్షీణించి పోతుంది. కాకినాడ మహారాజా కళాశాలలో స్త్రీలవద్ద ఫీజు వసూలు చేయబడలేదు. ఎన్నివందలమంది లాభం పొందారో ఉపకారం పొందిన

వారికే తెలుసు. వేంకటరత్నం నాయుడుగారిలో అస్పృశ్యతానివారణాచరణము మూర్తీభవించింది. మహాత్మాగాంధీ నాయకత్వంలో ఈ ఉద్యమానికి ఎంత ప్రాముఖ్యము ఇవ్వబడిందో మనకుకూడా తెలుసు. మనలో చాలామంది అస్పృశ్యతను గురించి మాట్లాడుతాం. కాని కొంతమందిమాత్రమే జీవితంలో దాన్ని ఆచరిస్తాం, ఆ మహర్షి అస్పృశ్యులను తన సొంతబిడ్డలుగా పెంచారు; కాదు, తన సొంతబిడ్డలకన్నా ఎక్కువగా పెంచి అగ్రకులాల వారితో వివాహాలు జరిపించారు, ఆ విధంగా ఆయన ఈ మహత్తర కార్యంకోసం తన జీవితాన్ని అంకితంచేశారు. హరిజన బిడ్డలను తమ సొంత బిడ్డలుగా పెంపకం చేసినవారిని మనం ఎందర్ని పేర్కొనగలం ? ఈ విషయంలో ఆయన వుద్దేశం ఏమిటంటే—నా తమ్ముడు లేదా నా చెల్లెలు అంటరానివారా, అంటరానివారు కారా అని కాదు నేను ప్రశ్నించుకోవలిసింది. ఈ సమాజపు పాపపంకిలంతో నా వైపున్న యీభయంకర అవమానతాభావంలో గర్వం అహంకారంతో నాచుట్టూ వున్న దుర్భర వాతావరణంలో నేను అంటుకోటానికి తగిన వాడినా ? స్పృశ్యులలో ఒకణ్ణిగా నన్ను నేను లెక్కించుకోగలనా? అనే ప్రశ్నను నాకు నేన్మువేసుకోవాలి. అందువల్ల స్పృశ్యత, అస్పృశ్యత సమస్య వచ్చినప్పుడు ఆత్మ పరిశీలన చేసుకోవలసిన సమస్య ఏమిటంటే—నన్ను నేను ప్రసక్తిలో వుంచుకోకుండా ఎవడు స్పృశ్యుడో, ఎవడు అస్పృశ్యుడో నిర్ణయించే అధికారం నాకున్నదా ? అనేది. ఈ సందర్భలోం వ్యభిచారం చేసిందనే నేరం మోపబడి తీర్పుకోసం తన దగ్గరకు తీసుకువచ్చిన స్త్రీకి సంబంధించి జీససు జీవితంలోని ఒక ఉత్తేజకరమైన సంఘటన ఉన్నది. ఈ మహత్తర సమస్య విషయంలో సక్రమమైన దృక్పథాన్ని పొందటానికి, సరియైన పంథా, సముచితమైన తత్వాన్ని మనకు ఆయన ఉపదేశించారు.

'ఇప్పుడు ఈ విషయంలో మనం ఏంచేయాలి అనేదాన్ని గురించి వివరంగా ఆలోచిద్దాం. అస్పృశ్యులు అని పిలువబడే వాళ్ళు కొన్ని అవాంఛనీయమైన అలవాట్లను, ఆచారాలను అధిగమించినట్లయితే త్వరలోనే స్పృశ్యులుగా పరిగణింపబడే రోజు ఆసన్నమవుతుందనే విషయం యదార్థం. దాన్ని ఎవరూ కాదనలేకపోవచ్చు, కాని అప్పుడు పరస్పరతావాదం ఒకటి వస్తుంది. వారు మనలను అంటవచ్చు అనేదానికంటే మనంకూడా వారిలో ఒకరమే అనే భావాన్ని వారిలో ఎంతమేరకు మనం కలుగజేస్తామో అంత మేరకు ఈ అలవాట్లూ, ఆచారాలు వారిలో తొలగిపోతాయి. లేకపోతే వారిప్పుడు ఎక్కడున్నారో అక్కడే ఉండిపోతారు. ఎమర్సన్ గూర్చి—ఆయన ప్రసంగాలు వినటానికి తరచు ఒక చాకలి మనిషి వస్తూవుండేదట. ప్రశాంత, మహత్తర ప్రవచనాలు నీ కెంతవరకు అర్థమయ్యాయి-అని ఆమెను అడిగినప్పుడు, ఆమె అనేది - 'ఆయన ఏమిచెప్పనీయగాకనాకు ఒకే ఒక విషయం చెబుతున్నారు. అదేమిటంటే భగవంతుడు విస్మరించిన పాపిని నేనుకాదని, నేనుకూడా నిజంగా సాధ్విని కాగలనని, నాలోకూడా ఉదాత్తమైనది, పవిత్రమైనది ఏదో ఉన్నదనే విషయాన్నికూడా చెబుతూండేవారు. ఆయన పథాన్నే నేనూ తప్పక అనుసరిస్తాను'. ఈ విషయంలో స్వామీ వివేకానంద సరియైన దారి చూపుతున్నారు. తప్పుచేసిన వాడి దగ్గరకు వెళ్లి, నీవు పాపివని చెప్పకు! నీవూ పుణ్యాత్ముడవు కాగలవు - అని చెప్పు. అదే విధంగా ఈ జాతులవారు మన కెంతో ప్రియమైన వారనీ, మన శరీరమే వారి శరీరమనీ, మన రక్తమే వారి రక్తమనీ వారికి అర్థమయ్యేలా చేద్దాం. అందువలననే వారికి దూరంగా మనం నిలబడినప్పుడు మనమే అణగద్రొక్కబడినట్లు, మనమే అవమానింపబడినట్లూ మనం భావిస్తున్నాం. అందువల్ల మన

మంచికే వాళ్ళని మనవాళ్ళుగా చేసుకోవాలని అనుకుంటున్నాం. ఈ సహోదరతా సందేశాన్ని వారికి అందజేయండి. మన గౌరవాన్ని, వాత్సల్యాన్ని వారికి చూపించటం ద్వారా మనకు వారెంతో ప్రియమైనవారని నిరూపిద్దాం. వారి విధానాలు మారాలనేది, వారి పరిసరాలు మెరుగుపడాలనేది యథార్థమే. కాని అత్యంత ముఖ్యమైన విషయమేమిటంటే మన విధులలో ఇది తప్పనిసరియైనదిగా, తప్పించుకోటానికి వీలులేనిదిగా భావించి మనలో ప్రతి ఒక్కరూ ఏదో ఒకటి చేయాలి. దళిత జాతుల సముద్ధరణకోసమే చేయమని నేను చెప్పను. స్వీయ ఆత్మోన్నతికోసమే చేసుకోమని, ఆ విధంగా వారి సహోదరుడు కమ్మనే నేను చెప్పేది. వారి యెడల నాకుండే ఆసక్తిని, వాత్సల్యాన్ని చూపటంకోసం నాకున్న పరిధిలో నా జీవితంలో నేను ఏమి చేయాలి అనేదే అతని ధ్యేయమై వుండాలి."

## విద్య - విజ్ఞానం :

డాక్టరు వేంకటరత్నంగారు ఉత్తమ శ్రేణికిచెందిన విద్యావేత్త. వారు ఉపాధ్యాయ వృత్తికే ప్రాముఖ్యమిచ్చారు. కళాశాల ఉపాధ్యాయుడుగా, ప్రిన్సిపాలుగా, వైస్-ఛాన్సలరుగా ఆయన కృషి గణనీయమే గాక ఆదర్శప్రాయమైనది. అందువల్ల విద్యపై వారిభావాలు అమూల్యమైనవి. విద్యార్థులను పరీక్షకు తర్ఫీదుచేసినప్పటికీ, వారి శీలసంపదను, సంస్కృతిని పెంపొందించుటే వారి లక్ష్యం. విద్యాకార్యక్రమంలో విజ్ఞానం, వివేకం, ప్రవర్తనలకు ప్రాధాన్య మివ్వాలని వారి ఉద్దేశం. "ఒక విద్యాసంస్థ పనితనానికి పరీక్షలే ప్రతిబింబంకాదు. అచట సత్యానికి లభించే ఆదరణ, ఆశయాలకిచ్చే ప్రోత్సాహం, విద్యార్థులపై కలుగజేసే ప్రభావం, యిచ్చే శిక్షణ, మార్గదర్శకత్వం — ఇవి విద్యాప్రగతికి నిజమైన గీటురాళ్లు.

'(1) మీలో ప్రతి ఒక్కరి ధ్యేయం అతిప్రాముఖ్యం వహించే విద్యాస్థాయి విషయంలో ఏదో కొంత విషయాన్ని సేకరించడం గాదు; నిజమైన విజ్ఞానాన్ని నేర్చుకోవాలి. అన్నిరంగాలలోను సమగ్రమైన విజ్ఞానాన్ని నేర్చుకోవాలి. అన్నిరంగాలలోను సమగ్రమైన విజ్ఞానాన్ని సాధించిననాడే వ్యక్తి సృష్టిలో తన వైశిష్ట్యాన్ని ప్రదర్శింపగల్గుతాడు. ఆనాడే విజ్ఞానజ్యోతి మనలో ప్రసరిస్తుంది. ఏ విద్య లక్ష్యమైనా సంస్కృతియే. ఎమర్సన్ వర్ణించినట్లు మానసిక, నైతిక, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించేదే సక్రమ జీవితవిధానానికి మూలాధారం. ఇదే లక్ష్యంతో ప్రతి వ్యక్తి కళాశాలలో చేరాలి. ఆత్మకు ప్రతిబింబమైన ఈ విజ్ఞానం ప్రకృతి పరిధిలోకి చొచ్చుకొనిపోయి దైవత్వం కోసం అన్వేషిస్తుంది. సత్యానికి మూలభూతమైన ఈవిజ్ఞానమె సృష్టికి పునాది. సరియైన యూనివర్సిటీ విద్య ఇట్టి విజ్ఞానాన్ని అందజెయ్యాలి, సంస్కృతిని విడమరచి చూస్తె మానవజీవిత లక్ష్యం చంచలమైన ఆత్మను విజ్ఞానం వైపుకు మళ్ళించడమేనని స్పష్టమౌవుతుంది. ఈ ఆశయంతోనే మీ తల్లిదండ్రులు మిమ్ములమ ఇచటికి పంపుతారు. కాని అనేకమంది జ్ఞానసంపాదనకు వక్రమార్గాల ననుసరించి ఈ మహోన్నత జీవిత లక్ష్యానికి దూరం కావడం శోచనీయం. మూడు దశాబ్దాలకు పైగా ఉపాధ్యాయ వృత్తిలో నా అనుభవాన్ని తలచుకొంటే నటనతో యువకులు తమ కాలాన్నెలా వృధా చేశారో, సందర్భాలనేకం జ్ఞప్తికొస్తాయి. మీకొక హాస్యకరమైన ఉదాహరణ చెబుతాను. ఒక విద్యార్థిని ఒక మాటకు అర్థం అడిగాను. ప్రక్కవిద్యార్థితో రహస్యంగా సంప్రదించి ఆమాటకు అర్థం 'మూర్ఖుడు' అని చెప్పాడు. 'ఇది నీ స్వీయచరిత్రలోనిదా ?' అన్నాను. విద్యార్థి ప్రతి విషయాన్ని తనకు తానుగా నేర్చుకోవటం తన ప్రాథమిక విధిగా గుర్తించాలి. అలా నేర్చుకొన్నది స్వల్పమే కానీయండి; అది మీ శీలసంపదకు జీవిత విధానానికి

గీటురాయిగా పనిచేస్తుంది, ఈలక్ష్యాన్ని తప్పి ఏ వక్రమార్గాన్ని అవ లంబించినా విద్యావిధానం కలుషితమౌతుంది. ఏపనినైనా స్వయంగా హృదయపూర్వకంగా చెయ్యండి. మీ భవిష్యత్తుకు అది పునాదిగా పనిచేస్తుంది. విద్య అన్నది పరిపూర్ణ జీవితానికి మార్గమని నిరూపించగల్గినవాడే సరియైన విద్యను అభ్యసించినట్లు భావించాలి. మీరు ఇచట సంపాదించిన విజ్ఞానాన్ని జీవితశేషంలో ఆత్మవికాసంద్వారా సద్వినియోగపరచాలి. అది అన్నివిధాల జీవిత ప్రమాణానికి కొలబద్ద. ఆనాటి కానాడు విజ్ఞానపథంలో కొంతైనా ముందుకు పోకపోతే భగవంతుడు ప్రసాదించిన అమూల్యమైన కాలాన్నే వృథా చేస్తున్నామన్నమాట! ఒక జ్ఞాని ఇలా అన్నాడు—'నాజీవితయాత్రలో రెండు విలువైన వస్తువులను పోగొట్టుకున్నాను. తిరిగి నాకిచ్చేటందుకు ఎవరూ ప్రయత్నం చేయకండి. రెండు రోజులు వృథాగా పోనిచ్చాను." కాబట్టి నిజమైన విద్యకు సమగ్రము, పటిష్ఠము, నిజాయితీగల విజ్ఞానం అవసరం.

(2) ఇప్పుడు వివేచనా శక్తిని గూర్చి ఆలోచిద్దాం. శీలాన్నిగాని, మరోవిధానాస్నిగాని దేనిదృష్ట్యా లెక్కిస్తాం? ఈసందర్భంలో ఒక చిన్న సంఘటన చెపుతాను. ఈ కళాశాలలో ఎఫ్. ఎ. లో ఉత్తీర్ణుడైన యువకుడు మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో చేరేటందుకు వెళ్లి నా ఉపాధ్యాయుడైన డాక్టర్ మిల్లర్‌ను కలసికొన్నాడు. ఆయన సంతోషంతో "మాతోవుండటానికి వచ్చినందుకు సంతోషం" అన్నాడు. విద్యార్థితో ఎంతో దయగా మాట్లాడారు. "స్కాలర్ షిప్ పొందగలనాండీ ?" అన్నాడు విద్యార్థి. "స్కాలర్ షిప్‌లు ఇవ్వడం పూర్తయింది. ప్రస్తుతం ఏమీలేవు'' అన్నాడు డా. మిల్లర్. ఆ విద్యార్థి తిరిగివచ్చి అన్నాడు ''మాటలేగాని పనిచేసే మనిషి గాదు."

ఐదు దశాబ్దాలుగా ఆయన చేసిన నిస్స్వార్థసేవ విద్యార్థి దృష్టిలో విలువలేకుండాపోయింది. అది సరియైన వివేచనాశక్తి కాదని మీరూ ఏకీభవిస్తారు. మరో చిన్న సంఘటన: కాకినాడలో ఆంధ్ర విద్యార్థుల ద్వితీయ సమావేశ సమయాన ఆటలపోటీలలో ఈసంఘటన జరిగింది. కళ్ళికోట కళాశాలలోని ఒక విద్యార్థి తాను ఉత్తమంగా పోటీ నిర్వహించానని చెప్పాడు. తీరా అతను వీగిపోయినట్లు ప్రకటించగా "ఫరవాలేదు. మరో సోదరునికి ఆ బహుమతి వస్తుంది" అన్నాడు. ఉత్తమశ్రేణి వివేచనా శక్తి అంటే ఇదే. ఎవరు బాగా నిర్వహించారన్నదే ప్రధానం గాని, వచ్చిన బహుమతి ఎలా ఉపయోగపడుతుందన్నది ప్రధానం గాదు. వ్యక్తిగత స్వార్థాలను విడనాడితే తప్ప నిజమైన వివేచనాశక్తి పెంపొందించడం సాధ్యం కాదు. ఎమర్సన్ చెప్పినట్లు ప్రక్కవాడి కాళ్ళకు గొలుసు చుట్టే వాడు దాని రెండవ చివర తన మెడకే చుట్టుకుంటుందని గుర్తించాలి. వివేచనాశక్తి లోపంవల్ల వచ్చే చర్యలన్నీ విషమఫలితాల నిస్తాయి. ఒక సంఘటనవల్ల కలిగే పరిణామాలను గ్రహించగల్గడం, వ్యక్తిగత స్వార్థాలను విడనాడటం, మానవ జీవితంలో అసలు విలువలను గుర్తించటం, ప్రతి విషయంలోను సత్యాన్వేషణ చేయడం —ఇవే సమగ్రవిద్యకు సోపానాలు,

(3) ప్రతివ్యక్తి తానుచూసి, గమనించిన దానిని వివేచనా శక్తితో నిర్ణయించ గల్గేటందుకు విద్యాస్థాయిలో మూడవ అంగంగా మంచి ప్రవర్తనను విధిగా అలవరచుకోవాలి. కార్లైల్ నుడివినట్లు నేత్రం తాను చూడగల్గిన దానినే చూస్తుంది. వస్తువుయొక్క బాహ్య స్వరూపమేగాక అంతర్యాన్ని కూడ గ్రహించగల ప్రత్యేకశిక్షణను మనం కంటికి నేర్పాలి. సాధనతో కూడిన శీలమే ప్రవర్తన. అంతర్గత సౌశీల్యమున్నచోట కావలసిన బాహ్యప్రవర్తన చేకూరుతుంది.

ఉపన్యాసాలు - ఉపదేశాలు

శీల సంపదకు జీవితంలో మనం చేసే ఏవో కొన్ని ఘనకార్యాలే కాదు; ప్రతి ఆలోచన, భావానికి సక్రమరూపమివ్వాలి. ఆత్మ వికాసానికైనా, వినాశనానికైనా భావంతోటే భవితవ్యం వెంటనే నిర్ణయంకాదు. దీనికి అనేక దశలున్నాయి. ఒక భావాన్నుండి ఆలోచన కల్గుతుంది. ఆలోచన నుండి కోర్కె ఆవిర్భవిస్తుంది. కోర్కె చర్యకు హేతువౌతుంది. చర్యనుండి ఆచరణ వస్తుంది. ఆచరణ ద్వారా శీలం పెంపొందుతుంది, తుదకు శీలమే భవితవ్యానికి దారి తీస్తుంది. అందువల్ల మొదట చక్కని భావాలను, ఆలోచనలను అల వరచుకోవాలి; వీటినుండి క్రమంగా తగిన కోర్కెలు, శీలసంపద కల్గి ఉన్నతమైన ప్రవర్తన అలవడుతుంది. విద్యాస్థాయి, వివేచనా శక్తి, ప్రవర్తన- యీ మూడింటి సమ్మేళనమే నిజమైన సంస్కృతి. అందువల్ల యువక మిత్రులందరికీ నేను చెప్పదలచిన దేమంటే, సత్ప్రవర్తనమిారు మిా విద్యాసంస్థ ద్వారా నిర్మించుకోండి. సత్ప్రవర్తన సాధించగలిగితే మీాకు భావస్వాతంత్ర్యం లభించినట్లే. మిాశక్తి సామర్థ్యాలు స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చు. ఏ నిరంకుశత్వం కూడా అప్పుడు మిమ్ము ఎదిరించలేదు. సత్ప్రవర్తన గల పుత్రులను చూసి భారతమాత ఆనందిస్తుంది. భగవంతుడు మిమ్ము లను ఆశీర్వదించుగాక."

'సరియైన సంస్కృతిచ్ఛాయలు బలపరచుకోకుండానే సాంకేతిక శాస్త్రీయ విద్యారంగాలకు అత్యధిక ప్రాధాన్య మిచ్చినందువల్ల కలిగిన దుష్ఫలితాలను మనం యిప్పుడిప్పుడే గ్రహిస్తున్నాం. సాంకేతిక శాస్త్రీయ నిరంకుశత్వం నుండి మానవజాతి బయటపడాలంటే సంస్కృతి వికాసం, మానవత్వం, ప్రేమ-' యివే ఆధారాలు. ఉపాధ్యాయుని దృష్టితో ఆయన ఉపాధ్యాయుల సమస్యలను గురించి పనిచేశాడు. భారతదేశంలో ఉపాధ్యాయవృత్తిని గురించి ఆలోచించినప్పుడు ఒక ముఖ్యమైన ప్రశ్న మనకు స్ఫురిస్తుంది. జాతీయ

జీవనంలో ఉపాధ్యాయుని పాత్ర ఏమిటి? 1814 లో డైరెక్టర్లమండలి (కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్) వారు గ్రామాలలోని ఉపాధ్యాయులంటే దేశమంతటా గౌరవం వున్నదని తెలిపారు. 110 సంవత్సరాల తర్వాత రవీంద్రుడు భారతీయ ఉపాధ్యాయులు నిరంకుశులని నిందించాడు. ఈ మార్పు ఎందుకు జరిగింది ? 1814 లోనూ, 1924 లోనూ మనదేశంలో పరిస్థితుల వ్యత్యాసమే యీ అభిప్రాయభేదానికి కారణమని నా ఊహ. అప్పుడు భారతదేశం నిద్రిస్తున్నది. 1924 లో భారత జాతీయత మేల్కొన్నది. అనాడు భారతదేశం విశ్రాంతి తీసుకుంటున్నది. 1924 లో భారతదేశం విరంరాన్వేషణలో నిమగ్నమై వుంది. ఈ అన్వేషణకు బీజాలు వేసినవాడు ఉపాధ్యాయుడే. 'సంపూర్ణ జాతీయ జీవిత సాధనాన్వేషణకు ఉపాధ్యాయు డొక్కడే దోహదం చేయగలడు. భౌతిక, ఆధ్యాత్మిక శక్తి సందోహ సంపాదనకు ఉపాధ్యాయుడే మార్గదర్శి. ఇప్పుడు అమల్లోగల విద్యావిధానం తప్పనీ, దానిని తుదముట్టించాలనే భావనను చూసి మనం భయపడనక్కరలేదు. అది అంత చెడ్డది అయితే. యిప్పటికి అంతా చీకటిమయంగానే వుండేది. మరి యిప్పుడు మనం సాధించిన అభివృద్ధికీ, యికముందు సాధించనున్న ఘనకార్యాలకూ యీ విధానమే కదా బీజ భూతమైనది ? మనలో యింతటి ప్రగతి ప్రేరణను కల్పించినది యీ విధానమే గదా ! అయితే యిప్పటి విద్యావిధానాన్ని పునర్నిర్మించుకోవలసి వున్నది. దానికొక నూతన దృక్పథాన్ని రూపొందించుకోవడంలోనూ, దానిని అభివృద్ధి చేసుకోవడంలోనూ నూతన మార్గాలు అన్వేషించుకోవలసి వుంది. అలాగే కొన్ని పద్ధతులను మార్చుకోవలసి వుంటుంది. పైగా మనకున్న వనరులను ఎక్కువచేసుకోవలసిన అవసరంకూడా వుంది. మనం తేబోయేమార్పులను 3 విషయాల దృష్ట్యా అమలుపరచాలి– మంచిని పెంపొందించడం, చెడును తిరస్కరించడం, కావలసిన

దాన్ని వినియోగించడం. నేటి అవసరాల కనుగుణంగా ఈ మార్పు వుండేటందుకు జీవితంలోని అన్నిరంగాల ఉన్నత శక్తులను సమీకరించాలి. ఒక ప్రముఖ విద్యావేత్త విద్యాకార్యక్రమ వ్యాప్తి యావత్తు జాతి ఉమ్మడి కృషివల్లనే సాధ్యమని తెలియజేశాడు. ఐతే భవిష్యత్తులో ప్రయోజనానికి విద్యాపునర్నిర్మాణం దృష్ట్యా ఉపాధ్యాయుడు భావి తరాలవారి రక్షకుడుగా ప్రముఖపాత్రను వహించవలసి వుంది. జాతీయ జీవనంలో తన స్థానాన్ని తిరిగిపొందే టందుకు అతడు విశేషంగా కృషి చెయ్యాలి. జాతి అభివృద్ధికి తగిన అర్హత అతనికి లభించాలి. మరొక రచయిత చెప్పినట్టు విద్య ఖరీదైనది కావచ్చు. కాని అజ్ఞానం మరింత ఖర్చుతో కూడినది. ఆదర్శ ఉపాధ్యాయుడు ఆర్థికంగా లాభాన్నికూడ కలుగజేస్తాడు. ప్రజల శ్రేయస్సును అభిలషించే ప్రభుత్వం ఉపాధ్యాయుని కోర్కెలను తీర్చేటందుకు ప్రయత్నించాలి. తగిన సౌకర్యాలులేని ఉపాధ్యాయులు సమాజాన్ని ముందుకు కొనిపోలేరు. అదే రచయిత చెప్పినట్లు మానసిక వికాసానికి మనం ఎంత ఖర్చు చేయగల్గితే అంత మంచిది. నేటి జీవన విధానంలో సమాజంలోని ఇతర వ్యక్తులకన్న ఉపాధ్యాయుడు ఎక్కువ చైతన్యవంతుడు కావాలి. మన చుట్టూ వ్యాపించివున్న అజ్ఞానాంధకారాన్నుండి బయట పడాలంటే నిస్స్వార్థంగా జీవితాన్ని దేశప్రయోజనానికి అంకితం చేయగల స్త్రీ, పురుషులు కావాలి. ఉపాధ్యాయవృత్తిని "విమోచన సేన"గా వర్ణించారు. విజ్ఞానజ్యోతిని వెదజల్లే అంతిమలక్ష్యంగల ఉపాధ్యాయ వృత్తికి ఈ ప్రయోగం ఎంతో సముచితంగా వుంది. ఈ ఉద్యమ లక్ష్యం ఉపనిషత్తులో చెప్పినట్లు ఉపాధ్యాయ- విద్యార్థి అనుబంధానికి దారి తియ్యాలి.'

## జీవం - శివం :

నాయడుగారు గొప్ప వేదాంతి అనికూడ మనందరికీ తెలుసు. ఇతరమతాల వారు హిందూధర్మాన్ని ఆమోదించాలంటే రెండు ప్రధానమైన మార్పులు రావాలన్న డాక్టర్ మెక్నికాల్ వాదానికి జవాబుగా ఆయన 'జీవం'కు "శివం'కు గల సంబంధాన్ని చర్చించారు. జీవం, శివం ఏకం కాకూడదు. మానవుడు, భగవంతుడు— రెండు వేర్వేరు రూపాలుగా పరిగణింపబడాలి. "అహం బ్రహ్మాస్మి" అన్న సూక్తి అంగీకారం కారాదు. ఈసందర్భంలో వారి అభిప్రాయాన్ని పేర్కొనడం ఎంతైనా అవసరం.

'గౌరవనీయులైన రచయిత చెప్పిన విషయాన్ని వ్యతిరేకించడం నా ఉద్దేశంకాదు. బ్రహ్మసమాజ చరిత్రలో జీవ, శివులు ఒకదానికొకటి విభిన్నం కానవసరం లేదని, రెండు రూపాలుగా వున్న జీవ, శివులు విడివిడిగా వుండనవసరం లేదన్న వాదాన్ని ఇంతకాలం బలపరచాం. రాజా రామమోహన్‌రాయ్ కాలంనుండి ముఖ్యంగా మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్, అతని అనుచరుల ఉపదేశాలలోను, పండిత సీతానాథ్ తత్వభూషణ్ రచనల్లోను మానవుడు భగవంతుని ప్రతిరూపం కాకపోయినా ప్రాథమికంగా ఒకరేనని, ఒకరికొకరు సమానులు కాకపోయినా, వేర్వేరు రూపాలన్న సిద్ధాంతం చాటబడింది. జీవరాసి కారకుడుగా తప్ప భగవంతుడు మన ఊహకందడు. సృష్టికర్త ప్రతి సృష్టిగా తప్ప మానవుని వేరుగా వూహించలేము. వెలుతురు లేకుండా సూర్యుని, నేత్రదృష్టి లేకుండా రంగును ఎలా వూహించలేమో అలాగే భగవంతుని, మానవుని పరస్పర సంబంధంతో తప్ప వూహించలేము. ఒక రచయిత చెప్పినట్లు భగవంతుడు కేవలం మానవునికి ముందుగానే ఆవిర్భవించినవాడు మాత్రమే కాదు; ఒక ప్రయోజనానికి భగవంతుడు కారణభూతుడు. భగవం

తుడు, మానవుడు—ప్రాథమికంగా చూస్తే ఒకరే. ఐనా ఉభయులూ వేరువేరుగానే పరిగణింప బడతారు. మూలంలో ఒక్కటైనా లౌకిక దృష్టిలో వేరుగా వుంటారు. అలాకాకపోయినట్లైతే భగవంతుని గూర్చి ఆలోచించే శక్తే వుండేదిగాదు. ఈ విధంగా జీవానికి, శివానికీ అంతర్యంలో ఏకత్వం వుంది. ఈసూత్రాన్ని గ్రహించినట్లయితే అద్వైతానికి, ద్వైతానికీ సమన్వయం కల్పించడం, ఏమంత కష్టం కాదు. భగవంతునికి, మానవునికీ మధ్యగల సంబంధం విషయమై రెండు దృక్పథాలున్నాయి. భగవంతుడే విశ్వవ్యాప్తుడు, సర్వోత్కృష్టుడు అని ఒక దృక్పథం. ఆత్మలోనే అంతర్యాభుతుడైవుండి సర్వత్రా వ్యాపించి వున్నాడని మరొక భావం. అయితే ఈ భావాలు పరస్పరం భిన్నమైనవికావు. అండ పిండ బ్రహ్మాండమంతటికీ సృష్టి కారకుడు అంతర్యాభుతుడైన భగవంతుడు, మనలోనే వున్నాడు. అతడు ఊహాతీతుడు. ప్రేమించిన వాని హృదయంలోనే వుంటాడు. ఇది పెద్ద జలాశయం వంటిది. ఆదిలో సన్నసన్న తుంపరలవలె పైకి విరజిమ్ముతూ క్రమేణా పొంగి పొరలి, నదులవలె ప్రవహిస్తూ అంతిమంగా సముద్రములో సంగమ మవుతుంది. ఈ రెండు దృక్పథాలు ఒకదానికొకటి అనుబంధంగా వుంటాయి. మతమనే గోళానికి ఈ రెండు దృక్పథాలు పూర్వ పశ్చిమార్థ భాగాలవలె వుంటాయి. అంతా బ్రహ్మ స్వరూపమే, ఈశ్వర లీల అని తెలుసుకోవడంలో కష్టమేమీ లేదు. భక్తి ప్రియుడైన భగవంతుడు హృదయంలోనే వుంటాడు. అట్లని ఇతరత్రాలేదని అర్థంకాదు. నీటిబిందువులో సూర్యుని కాంతి ఇమిడి వుంటుంది. అయితే సూర్యునికాంతి విశ్వవ్యాప్తమే కదా! మాతృమూర్తి ప్రేమలో జోల పాట వుంటుంది. అయితే ఇది జోలపాటతోనే అంతంకాదు. స్నేహితుని మధుర మందస్మితంలో ప్రేమ తొణికిసలాడుతుంది. అంతటితోనే ఆగదు. ఈవిధంగా చూస్తే అంతర్యాభుతుడైన భగవం

తుడు సర్వవ్యాప్తుడవుతున్నాడు. అనంతమైనవాడు, సృష్టిలయము లకు కారణభూతుడవుతున్నాడు. తనకుతానే లయమైతే తప్ప అనం తుడు కాలేదు. లయంలేనిదే సృష్టిజరగదు. భగవంతుడు ధ్యాన స్వరూపుడని భావిస్తే, అతను భక్తిస్వరూపుడని కూడా భావించాలి. మహర్షుల దృష్టిలో భగవంతుని స్వరూపములు రెండూ ఒకటే భగ వంతునిగూర్చి ధ్యానం చేయాలంటే అతను సర్వోత్కృష్టుడుగా వుండాలి. ప్రేమకూ, భక్తికీ, మనలో అంతర్భూతుడై వుండాలి. భక్తి ధ్యానము, ధ్యానము భక్తి — ఈ రెండు రంగాలలోనూ మానవుడు పురోగమిస్తాడు. అప్పుడు భగవంతుడు సర్వోత్కృష్టు డనీ, అంతర్భూతుడని కూడా గుర్తిస్తాడు. మనము పఠించే ఆరాధన మంత్రంలో యివి రెండూ మేళవించి వుంటాయి. ఆత్మలో ఆరా ధిస్తూ, విశ్వాంతరాళమంతా వ్యాపించి వున్నాడని భావిస్తాము. మనకంటికి కనిపించే ప్రపంచము నిత్యమైనదీ, వాస్తవమైనదిగా తోస్తుంది. అంటే భగవంతుని తెలుసుకొన్నట్లన్నమాట. అంతా భగ వత్సంకల్పమే అనే దృష్టి కూడా ఏర్పడుతుంది.

మన విశ్వాసాన్నీ, మన అనుభవాల్నీ రెంటినీ మేళవించి మతములతో నిమిత్తంలేకుండా భగవంతుని ఆరాధనకు దోహదం కలుగజేయాలి. ఒకే దేవాలయంలో కాకపోయినా, ఒకే ఆశ యంతో భగవంతుని ప్రార్థన చేయగలం. తద్వారా పునీతులమై సత్కృషి చేయడానికి ఉత్తేజ పూరితులమవుతాము. కృషిలేని భక్తి నిష్ప్రయోజనం. భక్తిలేని కృషి వ్యర్థం. ఇవి రెండూ ఒకదాని కొకటి చేదోడువాదోడుగా వుండడం సదా శ్రేయస్కరం. అప్పుడు ఆత్మశక్తి పెంపొందుతుంది. భగవంతునికి మానవునికి గల పరస్పర సంబంధం అవగతంకావాలి. ధ్యానంలో భగవంతునియందు మన స్సును లగ్నంచేసి, భక్తితో ఆరాధిస్తాడు మానవుడు. అప్పుడే భగ వంతుడు భక్తితో కనిపిస్తాడు.

ఈ ప్రకారం డాక్టర్ మెక్నికోల్ దృష్టిలో విభిన్నముగా వున్న దృక్పథాలను సమన్వయం చేయడం సాధ్యమవుతుంది. భిన్న ముగాకనిపించే ఇతగ మతాల్ని మనమతాలుగానే ఆదరించగలం. జీవులంతా ఒక లేనసేజ్ఞానం కలుగుతుంది. జ్ఞాని అయిన నేథాన్ యూదునికి, క్రైస్తవునికి మధ్య ప్రగాఢమైత్రి ఏర్పడుతుంది. "నేథాన్, నీవు క్రైస్తవుడవే కాని, వేరేకాదు" అని క్రైస్తవు డంటాడు. "నీలోవున్న యూదుడు ఆ విధంగా పలికిస్తున్నాడు" అని ప్రత్యుత్తర మిస్తాడు. క్రైస్తవుడు యూదీయుని అర్థంచేసుకో వాలంటే, ఆతనితో ఏకీభవించాలి, అతనిలో లీనమైపోవాలి. యూదీయుడు క్రైస్తవుని అర్థంచేసుకోవాలంటే, అతనితో ఏకీభ వించాలి. సర్వత్రా ఇది సత్యమైన విషయం. 'రూమీ'ది ఒక కథ వుంది. ఒక అరబీ దేశీయుడు, పారశీకుడు, టర్కీదేశస్థుడు — ఈ నలుగురూ కలిసి ప్రయాణం చేస్తున్నారు. అందరికీ ఆహారం కావా లనే కోరిక కలిగింది. ఒకడు నాకు 'అనాబ్' కావాలంటే మరొ కడు తనకు 'అంగూర్' కావాలని, ఇంకొకడు 'అంజీర్' కావాలనీ, నాల్గవవాడు 'స్టాఫూల్' కావాలనీ అన్నాడు. ఈవిధంగా పేరు విష యమై వాళ్ళు పేచీ పడుతూంటే ఒక గాడిద ఏదో ఒకమూటను మోసుకొంటూ, ఆ దారిలో పోతూ వుండడం చూశారు. అ మూటలో వుండేవానినిచూచి, నలుగురూ 'నాకు ఆపండ్లు కావాలి' అన్నారు. భావంలో వాళ్ళకు తారతమ్యం లేదు. పేరులోనే వుంది అంతా. స్వరూపాల తత్వాన్ని తెలుసుకోవాలంటే వివిధమతాలకు చెందినవారు ఒకచోటికి కలిసిరావడం సాధ్యంకావాలి. విభిన్నభావా లన్నీ వాటిలో ఇమిడివుండే ప్రత్యేకతనే తెలువుతాయి కాని, తారతమ్యాల్ని తెలియజేయవు. హిందువు భగవంతుని బ్రహ్మస్వరూ పునిగా తలచుతాడు. క్రైస్తవుడు ప్రేమస్వరూపునిగా భావిస్తాడు. ఇటీవల ఖురాను మతగ్రంథాన్ని అనువదించినవ్యక్తి "అల్లా"ను

ఆంగ్లభాషలోనికి అనువదించాలి గనుక గ్రంథమంతా 'భగవంతుడు' అనే ప్రత్యామ్నాయ పదంవాడకుండా 'అల్లా'ను మాత్రమే వాడుతూ వచ్చాడు. ఇవి స్వరూపాలు మాత్రమే; వివిధరూపాలలో వివిధ ప్రజల హృదయాంతరాళాలలో హత్తుకొనిపోయి వుంటాయి. అవన్నీ వేరువేరుగా మనం భావించకూడదు. అన్నీ భగవంతుని భిన్నస్వరూపాలేననీ, భగవంతుడు చిదానంద స్వరూపుడు, ప్రేమ మయమైన సుందరమూర్తి అని గుర్తించాలి. భగవంతునిగూర్చివున్న భావాల్ని వేటినికూడా త్రోసిపుచ్చజాలము. ఆత్మ భగవంతుని ప్రతిబింబింప జేసినపుడు ఇవన్నీ మోక్షకారక మవతాయి. సూఫీ చెప్పినట్లు "'నీవూ', 'నేనూ' ఒక తోటలో కూర్చొని వున్నాము సంభాషణలు జరుపుతూ. నీకూ నాకు మాత్రమే ఈ సంభాషణ అర్థమవుతుంది." ఇందుకు సిద్ధాంతమైన జ్ఞానంకాదు కావలసింది. పరస్వరం అర్థంచేసుకొవడంద్వారా ఇది సాధ్యమవుతుంది. భక్తి ప్రధానం కాని, మతం కాదు. 'హే భగవాన్, మాలో ప్రతి ఒక్కరికి దీనిని ప్రసాదింపుము !'

## వివాహ అనుష్ఠానం :

'బ్రహ్మో' వివాహం సందర్భంగా వైవాహిక జీవితంలోగల పవిత్ర బాధ్యతలనుగూర్చి వధూవరులను ఉద్దేశించి పురోహితుడుగా ఆయన చేసిన ఉద్బోధ యెంత ఉత్తేజకరంగా ఉందో యీ ప్రసంగం వ్యక్తం చేస్తుంది :

'నా ప్రియమైన వధూవరులారా ! సృష్టికారకమైన వివాహం పవిత్రమైన మహోత్సవం. మానవుడు కల్పించిన సంప్రదాయం మాత్రమేకాదు; దైవం నెలకొల్పిన పవిత్ర బంధమే ఈ వివాహం. జీవితం మొత్తం మీరు ఇద్దరూ వేర్వేరుగా కాక ఒక్కటిగా ఉండడం మీ ప్రథమకర్తవ్యం. ఒకరికొరకు యింకొకరు అనే

భావంలో ఇద్దరుగా ఉండవచ్చునేగానీ ఐక్యత అనే భావంలో యిద్దరు ఒకరుగానే వ్యవహరించాలి. అదే విధంగా దైవ నిర్దేశిత మార్గంలో జీవితపర్యంతం మీ ఆత్మలను ఏకంగా నిలపండి. కాలక్రమేణ, దశలవారీగా మానవజాతి మొత్తం ఏకకుటుంబంగా మెలగాలని భగవంతుడు యేవిధంగా నిర్దేశించినాడో, రెండు జీవుల కలయిక అయిన యీ వివాహ బంధం వ్యక్తపరుస్తుందని బ్రహ్మ సమాజం భావిస్తున్నది. మానవుడు ఏకాకిగా ఉండడానికి సృష్టించ బడలేదు. ఇతరులతో కలసి మెలసి ఐక్యతగా ఉండడానికే నిర్మించ బడ్డాడు. ఐకమత్యాన్ని నెలకొల్పే శాశ్వతకృషిలో వైవాహిక బంధం మొదటి మెట్టుమాత్రమేకాక ముఖ్యమైనదికూడా. ఈ విష యాన్ని మీ మనస్సులో యెప్పుడూ మననం చేసుకునే ప్రయత్నం చేయండి. దీనికి నిదర్శనంగా, సహాయంగాను మీరు ఇద్దరు ప్రతి రోజు దైవంవద్ద కూర్చొని కొంతసమయాన్ని గడపండి. ఇద్దరూ ఏకకంఠంతో భగవన్నామస్మరణ చేయండి. ఎల్లప్పుడు హృదయ పూర్వకంగా భగవంతుని ప్రార్థించండి. ఎప్పుడు ఆయన మార్గదర్శ కత్వాన్ని కోరండి. కష్టాలు, పరీక్షలు యెన్నో రావచ్చు. అయితే భగవంతునిలోను, మీలో మీకు నమ్మకం ఉంచడానికి వచ్చిన దైవం పిలుపులే అవి. కష్టాలు, పరీక్షలను గురించి ఆలోచించేవారికి భగవంతునిలో విశ్వాసం సమధిక మవుతుంది. ఆయనలో విశ్వాసం ఉంచండి. ఆయన అనుగ్రహాన్ని పొందండి. భగవంతునికి చెందిన మీ స్నేహితులు, బంధువులు, సమాజం మీలోని మంచిని కోరు తున్నారు. మీ విధిని నెరవేర్చి తద్వారా దైవంలో లీనం కావాలి. ఇటువంటి ప్రతి సందర్భంలోను నేను చెప్పినట్లు యీ విషయాన్ని మీ మనసుల్లో పదిలపర్చుకోండి. ఇకనుండి నీకు ఒకే ఒక స్త్రీ ఉం టుంది (వరుని వైపు మళ్ళి). నీకు ఒకే ఒక పురుషుడు (వధువు వైపు మళ్ళి). తక్కిన వారందరూ దైవం పేరుతో "తండ్రులు",

'తల్లులు' మాత్రమే అవుతారు. మానవత్వం, విశ్వాసం గల స్త్రీ పురుషులనే దృష్టిలో ఉంచుకోవాలి. నేత్రాలకు కృత్రిమ అంధత్వాన్ని అలవర్చుకోవాల్సిన అవసరాన్ని యిది కలిగించదు. భగవంతుడు నీలో ఉంచిన స్వచ్ఛత అనే తెర యితర యే స్త్రీ పురుషుల ఆకర్షణను కాక ఒకే స్త్రీని ప్రతిబింబింప జేస్తుంది. దాంపత్య జీవితం ఆశించేది యిదే. అనుమానాలు లేనిది, పెడమార్గాలు పట్టనిదే నిజమైన దాంపత్యం. మీలో ఒకరిపై ఒకరికి భక్తి విశ్వాసాలను పెంపొందించే సౌశీల్యాన్ని భగవంతుడు మీలో కలిగించుగాత! మానవుడు తనకొరకే జీవించడంలేదు. మానవజాతికొరకూ, దేశం, సమాజం, కుటుంబం యితరుల కొరకూ జీవిస్తున్నాడనే విషయాన్ని జ్ఞప్తియందు ఉంచుకోవాలి. భగవంతునిలో విశ్వాసముంచే యితరులకు యే కొద్ది ఉపకారం చేసినా అది ఆయన పరిగణనలోకి వస్తుంది. ఈ మార్గంలో వచ్చే అవకాశాలను జారవిడువకండి. మీరు సమష్టిగా ఉండి చేసేపని ఒక్కడుచేసే పనికన్నా పదిరెట్లు యెక్కువగా ఉంటుంది. ఈరోజు మీరు ఇద్దరు దంపతులు మాత్రమే; దైవ నిర్ణయానుసారం కుటుంబంగా అభివృద్ధిచెంది భవిష్యత్ మానవాళికి వారసత్వాన్ని అందించండి. వివాహం కాకున్నా స్త్రీ, పురుషులు కుటుంబాలుగా ఉండవచ్చు. కాని దైవకటాక్షంలో ఉండే జీవితంలో జీవించండి. ఆయన దయతో మీరు తప్పక సంతోషంగా ఉండగలరు. యవ్వన జనిత ఊహలు కాలగతిని అనుభవాలుగా మారుతాయి. భగవంతునిలో విశ్వాసం ఉంచు. నీ కర్తవ్యనిష్ఠలో దృఢంగాను, మానవునిపై ప్రేమ అధికంగాను కలిగి ఉండు. మీరు సంయుక్తంగావేసే ఏడు అడుగులు 'జాతీయ వివాహం' అనే కల్పిత కథను పరిచయం చేయవు. కాని మానవత్వం, కుటుంబ బాధ్యతలు, దేశాభిమానం, కర్తవ్యం, నిజాయితీలలో ఐక్యతగా ఉండేటందుకు అవి మిమ్ములను ప్రోత్సహించగలవు. ఇద్దరూ చేతిలో

చేయివేసుకుని పయనించండి. మిమ్ములను ఇద్దరినీ ఇక్కడికి తీసుకు వచ్చిన భగవంతుడు మిమ్ములను ఆశీర్వదించుగాక ! ఇక్కడ వున్న వారు, లేనివారు, అందరి ఆశీస్సులు మీకు లభిస్తాయి. అవిమీకు పెన్నిధివంటివి. బంధువుల, స్నేహితుల, భగవంతుని దయతో మీరు ఆనందంగా ఉండండి."

ఆయన సాహితీ పరుడు. అన్నిటిని మించి గొప్పవక్త. అనుభవంతోకూడి, రమ్యంగా ఉండే ఆయన వాక్యాలు వినడం గొప్ప అదృష్టం. ఆయన ప్రార్థనలు, దైవారాధన కలకాలం నిలిచి ఉంటాయి. వాటిలో కొన్నిటిని యిక్కడ ఉదహరించడం అనుచితం కాబోదు.

## ఓ ! జయ విశ్వపిత! భగవాన్! దయానిధి :

అఖండ విశ్వానికి పిత భగవానుడు. అన్నిటిని రక్షించేవాడు, దయానిధి. ఇటువంటి సంతోషప్రదమైన పవిత్ర సమయంలో అట్టి దైవాన్ని మనం స్మరించుదాం. ఆయన దయాసముద్రుడు. ఆ విశ్వపితను, దయానిధిని పవిత్రంగా పూజించిన తర్వాతకూడా మనకు ఉద్బోధన అవసరమా ? ఇక్కడ ఉన్న ప్రతి మానవుడు పవిత్రోచ్చారణతో విశ్వపిత నామాన్ని మననం చేసుకోడా ? ఆయన సృష్టి కర్తయేకాదు, సంరక్షకుడు, పరిపూర్ణతకలవాడు. అంతా ఆయన ఉద్దేశపూర్వకమైనదే. ఆయన అతిసన్నిహితుడు, ప్రియమైనవాడు, అనంత ఆనందాన్ని కలిగించేవాడు. ఆయన సృష్టికర్తగా ఆయనను తలంచము. సంరక్షకుడుగా కృతజ్ఞత తెల్పం. అయితే ఆయనను అంటిపెట్టుకొని ఉంటాం. మన తండ్రిగా కొలుస్తాం. విశ్వానికి ఆయన పిత. మనలో ప్రతి ఒక్కరికీ ఆయన తండ్రి. గతమంతా ఆయనలో లీనమైంది. భవిష్యత్తు అంతా ఆయననుండి ప్రసరిస్తుంది.

ఆయన సర్వాంతర్యామి, ప్రతిచోటా ఆయన లీలలే గోచరమవు తాయి. అందువల్ల ఆయనకొరకు వేచివుండాల్సిన అవసరం లేదు. మనదగ్గరికి రమ్మని యాచించాలన్న అవసరంకూడా లేదు.

మనం ఆ మహాత్ముని హృదయపూర్వకంగా అర్చించడానికి శ్రమ పడనవసరం లేదు. ఆయన అనవరతమూ మనలో ప్రతిఒక్కరి ఆత్మలో ప్రతిష్ఠితుడై సర్వకాల సర్వావస్థలలోనూ మనలోనే, మన తోనే, మనచుట్టూనే వుంటాడు. మనకూ ఆయనకూ మధ్యగల సంబంధాన్ని, ప్రేమాదరాలను వర్ణించి చెప్పడానికి మాటలుచాలవు. ఆయన మన చెంతకు రాకుండా ఎంతకాలం ఎంతదూరం వుండ గలడు? ఆయనమనల్ని ప్రేమాదరాలతో హత్తుకొని మనలనుపూర్తిగా తనలో లీనం చేసుకుంటాడు. మనకు ప్రియమైన సన్నిహితుడైన ఆ నిజమైన భగవంతుని ఆరాధించడం కేవలం ఒక ఉత్సవంకాదు. కాని అలా చేయడం మన ఉఛ్వాస, నిశ్వాసలలో అంతర్భాగం. మనం ఆయనను ఇక్కడ పూజిస్తున్నామంటే ఆయననొక అనుగ్రహ దైవంగా గాక ఆయనను సత్యస్వరూపమైన దైవంగా గుర్తిస్తున్నా మన్న భావం మనలో నిక్షిప్తమై వుంటుందన్నమాట. ప్రేమైక మూర్తి, ప్రియతముడయిన ఆయనే మన అర్చనాదైవం. ఈ ప్రత్యేక శుభసందర్భంలో మనం మాటలతో కాలాన్ని వ్యర్థపుచ్చక ఆరా ధనా సాగరంలో తేలియాడాలి. వాకొనరాని దీవెన ఆయన పూజకై తపిస్తున్న మన ఆత్మలను ఆయనవైపు మళ్ళించుగాత! నిత్యమూ, శాశ్వతమూ అయిన ఆ మహానందాన్ని వర్ణించడానికి మాటలు చాలవు.

ఆ రా ధ న :

ఓం ! సత్యమ్ జ్ఞాన మనంతమ్ బ్రహ్మ ! ఆనందరూప మమృ తమ్, యద్విభాతి, శాంతమ్, శివమద్వైతమ్, శుద్ధ, మపాపవిద్ధమ్ ;

నిత్యమూ, శాశ్వతమూ, మహోన్నతశక్తిగల సత్యానికి ప్రతిరూపం నీవే! కేవలం అసంబద్ధమూ, మాయ, మిథ్యాపూర్వకమూ, అసత్యమూ అయిన దేనినైనా నిరోధించడానికి వీలుగా కాలుష్యాన్ని పారద్రోలి పవిత్రత ఒనర్చబడకుండా నాలుక సత్యాన్ని పలుకదు. ఆలోచన సత్యాన్ని మరుగు పరచదు. ఆత్మ సత్యాన్ని అంగీకరించదు. ఈ విశ్వానికి, ఈ అనంత ప్రపంచంలోని పవిత్రతకు సకల చరాచరాలన్నిటికి మూలం అయినది సత్యమే! ప్రతిమాటలోనూ పవిత్ర ప్రాముఖ్యాన్ని సూచించే సత్యంయొక్క ప్రతిరూపానివి నీవే! సత్యమే ప్రతి దానిలో బ్రహ్మాండమైన శక్తిని పెంపొందింపచేస్తుంది. సత్యమే ఈ సకల చరాచర బాహ్యప్రపంచంలోగల ప్రతిదానికి ఎప్పుడూ నశించని దివ్యత్వాన్ని, అమరత్వాన్ని చేకూరుస్తుంది. సత్యమే హృదయ స్పందనంలో ప్రేమామృతాన్ని జారవోస్తుంది. ఆ వెలుగులోనే నక్షత్రాల కాంతులు ప్రకాశిస్తాయి. సత్యమే నిరంతరం పరిభ్రమిస్తూంటే ఋతుచక్రం ద్వారా మహాశక్తిని ప్రస్ఫుటం చేస్తూ భగవంతునిచే సృష్టింపబడ్డ ప్రాణికీ ప్రాణికీ మధ్య, మానవునికీ మానవునికీ మధ్య, సాధువుకూ సాధువుకూ మధ్య ఏవిధమైన విభేదాలు వుండకుండా చేస్తుంది. ఇటువంటి సత్యానివి నీవే! నిత్య జీవితంలో, ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో, మా చూపులో, మాటలో నీవు ఎక్కువ స్థానాన్ని ఆక్రమించుకున్నావు. ప్రతి చేతను, కదలికను జీవితంలో ప్రతిక్షణం సత్యం గమనిస్తుంటుంది.

మేము నీముందు అవనత శిరస్కులమై వున్నాము. జ్ఞాన దైవం వలెనే నిన్ను సత్యానికి ప్రతిబింబమైన భగవంతునిగా కీర్తిస్తాము. ప్రతి కాంతికిరణంలోనూ, సత్యపూర్వకమైన చూపులోనూ, నీవే! నీ ప్రభావం లేకుండా అవి నిలువబడలేవు. అవన్నీ నీనుంచే జ్ఞానం అనే జలయంత్రంనుండి ప్రవహిస్తున్నాయి. "తెలివి'' అనేది చిన్నమాటకాని "విజ్ఞానం" నిన్ను జ్ఞానంగా ప్రతిబింబింప చేస్తూ

న్నది. ఆ జ్ఞానతృష్ణ, కాంక్ష యుగ యుగాలనుంచీ వస్తున్నది. నక్షత్రాల కాపల, ప్రపంచం ఏర్పడడానికి ముందు అంతు తెలియని ఆత్మయొక్క అగాధాలలోతులకు వెళ్ళింది నీవేగదా జ్ఞానదైవమా ! బయల్పరచబడిన సత్యం, జ్ఞానం మానవుని దరికి చేర్చబడిన సత్యం జ్ఞానం, జీవనయాత్రలో ఆత్మకు దారి చూపించేది జ్ఞానం. పసి బాలురు ఆశగా నమ్మకంగా ప్రేమాదరాలలో వున్న తల్లి దండ్రుల వైపు చూచినట్లుగా వుండే సత్యమే జ్ఞానం. జ్ఞానం జీవనగతిలో దారి చూపే కాంతివంటిది. అది మహాత్ములలో అంతర్భూతమై, సాధు పుల హృదయాలలో చొచ్చుకొని మహర్షులను దీక్షిస్తుంది. అది నిస్సహాయులను రక్షించడమేకాక మనిషిలో మనిషికి నమ్మకాన్ని కలిగిస్తుంది. జ్ఞానదైవమైన నీకు ఇవే మా నివాళులు ! అర్చనలు !

ఈ సత్యం శాశ్వతమైంది. ఈ జ్ఞానం అందరినీ వరించేదే. నీవు మహాత్ముడవు. అనంతుడవు. నీవు ప్రతి మనిషిలో స్థావరం ఏర్పరచుకొని నిన్ను నీవు పెంపొందించుకుంటున్నావు. నీ ఉనికికీ, చర్యలకూ, నీ గొప్పదనం యొక్క ఉచ్చస్థితికీ, నీ విశాలత్వానికి కొలబద్ద నీ అనంతత్వమే ! నీవు అనుక్షణం ఏదో ఒక అద్భుతాన్ని సృష్టిస్తూ అనశ్వరుడిగా, అనంతుడిగా పెరుగుతున్నావు. అట్టి నీముందు మోకరిల్లి ఇవే మా నీరాజనా లర్పిస్తున్నాము. నీతో సరి తూగగలవారు ఎవరూ లేరు. నీవు విశ్వాన్నంతా నిండివున్న అనంత బ్రహ్మవు. అనంత శక్తిమంతుడివి. విశ్వానికి మూలకారకుడవు ఐన నిన్ను కొంచెం కూడా తెలుసుకోవడం చాలాకష్టం. ఇది మా ముక్తికన్నా మాకోరిక. ఇది మాశాశ్వత కాంక్ష. అంతవరకు నీకు మేము సేవచేస్తూనే వుంటాము.

అనంత ప్రపంచాన్నంతా ఆవరించుకువున్న అనంతుడివి. కనుక నీవు- ఆనందరూప మమృతమ్. ఆ విధంగా నీవు విశ్వాసాన్నం

తటా ఆక్రమించుకుని వున్నావు. శాశ్వతమైన ఆనందామృతంలో నీవు సర్వకాల సర్వావస్థలలోనూ ప్రతిబింబిస్తుంటావు.

కనుక నీవు నీ ఆనందంలో, శాంతంగా నీఅమృతంలో శివంగా పునరావిర్భూత మవుతుంటావు.

మరొకసారి అందరినీ ఏకం చేసే అవిభాజ్యమైన మహత్తర శక్తి నీది. నీవు అద్వైతానివి. అంతులేని అనంత ప్రేమకు నిలయానివి నీవు. ఆ విధంగా నీవు అందరినీ ఏకం చేసే, పవిత్రం చేసే భగవంతుడవు.

నీవు ప్రాణికోటికి బంధముక్తినీ. పరిపూర్ణతను కలిగించే వాడవు. నీ ప్రకృతి విధానం ద్వారానే మేము నిత్యమూ, శాశ్వతమూ అయిన గమ్యాన్ని చేరుకుంటాం. "శుద్ధ మపాపవిద్ధం" అనే పవిత్ర లక్ష్యం కూడా దీని ద్వారానే సిద్ధిస్తుంది. ఇది పాపరహితమైనది. లోపరహితమైనది. నీ ఆరాధనలో ఆనందపారవశ్యం చెందడంకన్న వేరే కోరికలేదు. అన్య ఆకర్షణలను విడనాడి, ఆశా మోహాలను పరిత్యజించి నీ పవిత్రతలో మేము జీవిస్తాము. పరమ పవిత్రుడైన పరమాత్ముని పవిత్ర సంతానంయొక్క అమరత్వం ఇది. దైవత్వము సిద్ధించిన మానవులుగా నిరంతర ఆశీర్వచన బలంతో వున్నాము. నీ నామము ఇప్పుడును, ఎల్లప్పుడును చిరస్థాయిగా వుండుగాక!"

['ధన్యవాద సమర్పణము' కంటె చక్కని ప్రవచనము ఆంగ్ల సాహిత్యంలో నా దృష్టికి రాలేదు.]

## ధన్యవాద సమర్పణము :

ప్రార్థన— అంతా నీదయరా!

'ఇదంతా నీకరుణ ఫలితమని, అజ్ఞానులం, సంకుచిత దృష్టి గలవారం అయిన మాకు కూడా స్పష్టంగా తెలుస్తున్నది. అడుగకుండానే మా అవసరాలన్నిటినీ—తలవని తలంపుగా తటస్థించేవి కూడా– నీవు తీరుస్తున్నావు. తల్లికి బిడ్డలపట్ల వుండే శ్రద్ధ, ప్రేమ, వాత్సల్యాలతో మమ్ములనందర్నీ పోషించి రక్షించుతున్నావు. జీవన విధానం మానసిక దృష్టిని మరుగుపరిచి, హృదయ భావాలను చలన రహితంచేసి, ఆత్మదృష్టికి అడ్డుపడి, నిన్ను మా నుండి చాటుచేస్తున్నది. జీవితంలో మాకు కలుగుతున్న ఈ సౌకర్యాలు నీకు తెలియకుండానే చేకూరు తున్నాయని, వీటిని నీవు స్వయంగా కల్పించలేదని అప్పు డప్పుడు మా అజ్ఞానంచేర భావిస్తూ వుంటాము. సూర్యుడు వెలుగును ప్రసాదిస్తాడు; నదులు నీటిని అందిస్తాయి; మందమారుతాలు మనోల్లాసకరంగా వీస్తాయి; భూదేవి సృష్టి భారాన్ని వహిస్తుంది. జీవితం ప్రారంభమై, విస్తృతినొంది, పరిసమాప్త మవుతుంది. కుటుంబాలు ఏర్పడతాయి; తెగలు సమకూడుతాయి; తల్లిదండ్రులు పోషణ చేస్తారు; ఉపాధ్యాయులు జ్ఞానభిక్ష పెడతారు; మిత్రులు సహాయపడతారు; పిల్లలు తల్లిదండ్రులను, భార్య భర్తను, భర్త భార్యను ప్రేమిస్తారు. ఈ విధంగా నీ సృష్టి జాలంలో మేము ఇమిడివున్నాము. అయినా నిన్ను మేము మరిచిపోతాం. మేము మాహృదయ నేత్రాన్ని తెరిచినట్లయితే జీవితపు అనుబంధాలన్నింటిలోనూ నీవు సాక్షాత్కరించడం చూడగలుగుతాం. అందుకు మేము ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని పొందుతాం. పుణ్యాభివృద్ధికై అన్ని ప్రయత్నాలూ, కష్టాలూ స్వీయాభివృద్ధికీ సేవకు సమస్త సౌకర్యాలు– ఇవన్నీకూడా నీవు అనుగ్రహించినవే. కేవలం ప్రపంచ భవితవ్యానికి సంబంధించిన విశాలమైన విషయాలలోనే గాకుండా ప్రతి ప్రాణికి సంబంధించిన చిన్నవిషయాలలో కూడా నీవు దృగ్గోచర మవుతావు, పసిపిల్లలకుండే నిర్మల హృదయం మా

కున్నట్లయితే భోజన సమయంలో నీవుకూడా మాలో కలిసి ప్రేమతో భోజనం చేస్తున్నట్లు గ్రహించగలిగేవారం. "సేవకుడు కొనితెస్తాడు. వంటవాడు పక్వాలు సిద్ధంచేస్తాడు. నేను భుజిస్తాను" అనుకోవడం వాస్తవికానికి వక్రభాష్యమే అవుతుంది. ప్రతిరోజూ ప్రతిగంటకూడా శిశువును తల్లి పోషించే విధంగా మమ్ములను సంరక్షిస్తున్నావు. ప్రతి శిశువు జీవితానికి అవసరమైన ఆహారాన్ని ప్రతికబళాన్ని నీవే శిశువు నోటికి అందిస్తున్నావు. శిశువు త్రాగే పానీయం మాతృమూర్తి యొక్క ప్రేమామృతము. సేదదీరి మనోల్లాసం పొందడానికి శిశువు తల్లి వడిలో నిద్రిస్తాడు. రాత్రి అంటే ఏమిటి? శిశువు తల్లి వడిలో ఏకాంతంగా నిద్రించి తెల్లవారిన తరువాత మనోల్లాసంకలిగించే జీవితంలో తిరిగి ప్రవేశించడం కాదా? ఉదయాస్తమయాలు, ఋతువులు, వత్సరాలు ఇవన్నీకూడా నీవు నీ శిశువుల ఆనందంకొరకు, క్షేమంకొరకు ఏర్పరచినవే. నీవు సమకూర్చిన సౌకర్యాలన్నింటిని లెక్కపెట్టవలెనన్న ఏ జీవితమూ చాలదు. మేము నిద్రమేల్కొని మాలో ప్రతి ఒక్కరి యోగక్షేమానికీ, పరిపోషణకు నీవు అన్ని ఏర్పాట్లు చేశావనే విషయాన్ని స్మరించి ఆనందిస్తాము. తల్లి దండ్రులు, భార్యా బిడ్డలు, సేవకుడు, చెలికాడు, సేవచేసేవారు అందరూ మన శక్తిసామర్ధ్యాలను సరైన మార్గంలో అభివృద్ధిపరిచి ప్రకృతి క్రమంలో మనలను లీనం చేస్తున్నారు. ఈ అద్భుతాలన్నీ నీదయవలన కలిగినవే. ఇందుకు మేము మా హృదయపూర్వకమైన వందనాలను నీకు సమర్పిస్తున్నాము. నీ దృష్టిలో విశ్వాన్ని వీక్షించిన యెడల ఒక నిరంతర వ్యోమం సాగుతున్నట్లు గోచరమవుతుంది. సృష్టి అంతా ఒక ఆనందదాయమైన యాత్రవంటిది. తల్లి తన శిశువును కౌగలించుకొనినట్లు, వైభవోపేతమూ, సౌందర్యవంతము అయిన సృష్టి మనలను తనలో ఇముడ్చుకుంటున్నది."

భగవంతుని యందుగల ప్రేమనుంచి ప్రభవిల్లిన ఆనందోత్సాహంచేతనూ, దైవికమైన శక్తిని గుర్తించడంవల్లను ఋషిసత్తములు ఈ సందేశం ఇచ్చివుంటారు. లేనియెడల సామాన్య మానవ రచనలో ఇంతటి ఔన్నత్యం వుండదు.

* * *

వెంకటరత్నంగారి జీవితం పరిశుద్ధమైన కావ్యం వంటిది. ఆయన ప్రవచనాలు కోహినూరువంటి మేటి వజ్రాలు కూడా సాటిరాని అమూల్యరత్నాలు.

---

## మతము - ఆరాధన

ఈశ్వర మాతృత్వము నంగీకరింపుము. ఆరాధనయును ఆ శిశుభావమును అలవరచుకొనుము. ఆ యుద్దేశ్యముతోనే ఈ మందిరము నిర్మింపబడినది. పరమేశ్వరార్పితమైనది. ఆ జగన్మాతను సమీపించి ఆలింగనము చేసికొన ఆకాంక్షించు వారెల్లరకొఱకును ఈ మందిరము; జనయిత్రీ పూజనమునకై అహోరాత్రములు దీని ప్రాంగణద్వారము తెఱచికొనియే యుండును. ఎప్పుడైనను సరే రమ్ము; ఆ తల్లికడ చేరి ఉపాసనామాధుర్యమును ఆస్వాదింపుము. నా తల్లియె నాకు కావలెను. నా సర్వస్వమామె అనునదియే ఈ మందిరమున సముచితమును ఆవశ్యకమును అగు ప్రార్థన. రండు నిరభ్యంతరముగ రండు. అందఱు, అందఱును రండు. అందఱును అందఱును ఈ మందిరము నుపయోగించుకొనుడు. అందఱకు అందఱకును స్వాగతము. ఈ చోట కుటిలమైన దేదియునులేదు; అపాయకరమైన దేదియును లేదు. అపాయకరమైన దేదియును లేనేలేదు. ఒక్కనిబంధనము మాత్రమున్నది. చిన్నకూటములుగా గాని పెద్ద

సంఘములుగాగాని ఈ అలయమునకు ఆరాధనకై వచ్చునపుడు మనతల్లిని అర్చించుట అనగా ఆమె బిడ్డల అందఱను ప్రతి శిశువును హృదయమార ప్రేమించుటయే యని మనము జ్ఞాపకముంచుకొన వలెను. పారశీక కవి ఏమన్నాడు, ఆదాము బిడ్డలందఱును అనగా మానవు లందఱును ఒకరిలో నొకరు భాగములై యున్నారు. అంద ఱును ఒక వస్తువులోనివారే కనుక; అనగా ఒక పరమాత్మనుండియే వెలువడినవారు, ఒక జనని సంతానమే అని. నీసోదరుడైన మానవుని తప్పితివా జనకుడైన ఈశ్వరునే తప్పినవాడవు. డాక్టరు జాన్సనునుగూర్చిన ఒక ఇతిహాసము కలదు. జీర్ణవసనములు, నిరు పేదరాలు, తన చంటిబిడ్డను గుండెలకు హత్తుకొని కుంభవర్షపాత ములో కాళ్ళీడ్చుకొని పోవుచుండెను. అతనికి జాలి కలిగినది. తల్లిని బిడ్డను తన బండిలోని కెక్కించుకొన్నాడు. కాని ముద్దులు, మురిపెములు, జోలలు, జోకొట్టుటలుమాత్రము పనికిరావని కఠిన ముగా శాసించినాడు. ఇంచుకంతలో ఆమె ఆ శాసనమును మఱచి పోయినది. కన్న బిడ్డను మామూలు జోలపాటతో లాలింప మొద లిడెను. మరల కఠిన శాసనము మరికొంతసేపు. మరల ఆ నేరమే, బండి తలుపు తీసి, ఆమెను, ఆమె అసంబద్ధప్రలాపములను, ఆ పండితుడు బైటకు పారదోలుకొన్నాడు. అబలయెడ జాలిపడినాడు; కన్నతల్లిని సైరింపలేకపోయినాడు. కాని మాతృత్వమును నిరసించి నపుడే మానవత్వమును కూడ బహిష్కరించుకొన్నాడు. ఆ విధము గనే సృష్టికర్త కావలెనందుము; అతని సృష్టించుకొన్నది వదలి వేయుదుము. ప్రాణిని తిరస్కరించినపుడే ప్రాణప్రదాతను బహిష్క రించుచున్నాము. నన్ను ప్రేమింతువేని నా కన్నబిడ్డల ప్రేమింపు మని జగజ్జనని నిర్ణయించుచున్నది. కేవలము భగవన్నిర్మాణమైన ఈ సోదరభావము ఉన్నతోన్నతముగా సంపూర్ణముగ ఉచ్చాత్యు చ్చముగా శిరసావహించుట యనగా మనము కలసి మెలసి ఆరాధన మొనర్చుటయే. కావుననే క్రైస్తవునితో యథార్థ సోదర

భావము తిరస్కరించి, షైలాక్ "నీతో ప్రార్థనము చేయను" అని తీవ్రముగ ప్రకటించినాడు. కలసి పరమేశ్వరు నారాధించునపుడు అతనిలో అందరును సోదరులు అని బ్రతుకార అంగీకరించుట యగును. ఎన్నియో యేండ్లు కారాగారవాసి ఎంత కాలమై మరచి పోయినారో అతని పేరును, ఏదియో సంఖ్యయే పేరుగా పిలువ బడు జీన్వాల్జీను పరమభాగవతుడైన ఆచార్యస్వామికి తన నామ ధేయ మెరిగించి దాని నెఱుగుదురా యని ప్రశ్నించెను. "మాన వుడు నీకిచ్చిన పేరన్నమాట అది; పరమేశ్వర ప్రసాదమైన నీ నామధేయము నే నిదివఱకే యెరుగుదును. నీవు నా సోదరుడవు"- ఎంత గొప్ప ప్రత్యుత్తరమిది! ప్రకటింపబడిన ఏ నామముతోనో మనకు పరిచయము లేకున్నను, ఆ లోకైక జనయిత్రిని బట్టి ప్రతి స్త్రీయు నాసోదరి; ప్రతి పురుషుడు నాసోదరుడు. ఇట్టి ఆరాధనలో నున్న పరమానందమును, దీనిలో నిమిడియున్న సౌందర్యమును ధర్మమును స్వీకరింపుము. రమ్ము! రమ్ము! నీలో ఆ శిశుభావము పులకరించునపుడెల్ల ఈ మందిరములో ఆరాధింపుము. ఆ జగ న్మాత అమూల్యాశీర్వచనము ఆమె బిడ్డల కందరకు ఆశ్రయమగును గాక!

[25-1-1927 బ్రహ్మోత్సవ దినమున కాకినాడ ఆంధ్ర బ్రహ్మోపాసనా మందిరమును తెరచినపుడు బ్రహ్మర్షి వెంకట రత్నం నాయుడుగా రొనర్చిన ప్రసంగములోని తుదివాక్యము లివి- అనువాదకులు : శ్రీ కృష్ణశాస్త్రిగారు.]

ఓమ్

# బ్రహ్మర్షి
# రఘుపతి వేంకటరత్నంనాయుడుగారు

## III

## బ్రహ్మర్షి పరతత్త్వ కథాకథన సుధాస్రవంతి

### 1. 'సువిశాల మిదం విశ్వం పవిత్రం బ్రహ్మమందిరం':—

హిందువులు హైందవుడనీ మహమ్మదీయులు మహమ్మదీయుడనీ నానకుని అందరు హక్కు భుక్తంచేసుకుంటూరు. ఒకప్పుడు మెక్కాదిక్కు కాళ్లు పెట్టుకుని పరుంటే నానకును అధిక్షేపించారు. 'దేవు డేదిక్కునలేడో ఆదిక్కుకి నాకాళ్లు త్రిప్పండి' అన్నాడు నానకు. అదిక్కుతోచక అందఱు తెల్లబోయారు. నానకు పూరీ వెళ్లాడు. ఒక సాయంకాలం అర్చకులంతా జగన్నాధునకు హారతి యిస్తున్నారు. 'లోనికి వెళ్లరేం! దేవునకారతి యిస్తున్నారు' అన్నాడొకఁడు. 'ఓహెూ! నేనిక్కడ విశ్వవ్యాప్తమైన హారతిని ప్రత్యక్షంగా తిలకిస్తున్నా. ఈ హారతికి ప్రపంచమంతా ఒక పళ్లెం. అందు సూర్యుడు, చుక్కలు నిత్యం వెలిగే జ్యోతులు. చుట్టూవీచే గాలులు నిత్యమూ తిరిగే పంకాలు. అహారతికి వేరుగాలేను, దాన్ని ప్రత్యక్షంగా అనుభవిస్తున్నా' అన్నాడు నానకు.

ఒక సూఫీ పరవశించి మహదానందంతో నృత్యం చేస్తున్నాడు. ఛాందసానికి మూఢనమ్మకాలకీ తాళికట్టిన శ్రోత్రియుఁడొకడు ప్రార్థనకు వేళ ఔవచ్చింది. అని జ్ఞాపకంచేసాడాసూఫీకి. 'అటులనా! నేనిప్పుడు ప్రార్థనతోనే తన్మయత్వంలో మునిగిఉన్నా' అన్నాడా సూఫీ. "జెరూసలిం విశ్వమంతటికీ దేవాలయం. భగవంతుడెపుడూ తన్ని వెన్నాడుతూ ఉంటాడు' అన్నాడు జీసస్.

**2. ఒక్కటే ఒక్క మసీదు :—**

అదే సాధుహృదయం. అందటికీ ప్రార్థనాలయం. అక్కడే దేవుడు ఉంటాడు. 'సిలువనీ క్రైస్తవులనీ ఆమూలాగ్రం పరిశోధించా. ఎన్నో దేవాలయాల్ని సందర్శించా. పెగోడాల్నిచూచా. హీరట్, కందహార్ పర్వతాల్నీ అధిరోహించా. ఎక్కడా ఆయన జాడ కనిపించదు. కొండల్లో కానీ కోనల్లో కానీ, ఇంకచూచేది లేక నాలోపలికి నన్నే చూచుకున్నా. అప్పుడు నాహృదయంలో ఆయన్ని చూడగలిగా. దేవు డన్నిటికన్నా మిన్న. ప్రతి చిన్నహృదయాన్నీ పరిపూర్ణంగా మహదానందంతో నింపునట్టి చిన్మయమూర్తి". దివానిషమ్స తబ్రజ్ అను మహాగ్రంథంలో "రుమి" అన్నాడు:

"అచలదృష్టి నాసికాగ్రమందుననిల్పి
నిజసమాధినుండ నేర్చినట్టి
సాధుహృదయమొకటి సర్వేశునిలయంబు
సానుభూతి వాని సహజ గుణము."

**3. ఎప్పటికీ ప్రపంచం మంచిదే :—**

ఎమర్సన్ అంతటా మంచినే చూడగల్గి అంతా మంచికే అని నమ్మే ప్రగాఢ విశ్వాసం కలవాడు. చెడ్డనుకూడా చెడ్డగా చూడలేదు. అది యెప్పటికీ మారని విశ్వాసం. కారణానికి అతీతమైంది. ఇది తెలిసిన మిత్రు లతన్ని ఆంగ్లదేశసంచారంలో ఒక జైలునకు గొంపోయారు. ఆజైలు దొంగలు, దుర్మార్గులు, నరహంతకులూ, నీచాతినీచమైన నేరములు చేసినవారితో నిండిఉంది. వారినందటినీ చూపిస్తూ 'ఇప్పుడేమంటావు. ప్రపంచమంతా మంచిదేనా' అని అడిగారు. 'అవును. అయినప్పటికీ ప్రపంచం మంచిదే' అని యెల్లయెడలా మంచినే చూడగల్గిన ప్రగాఢమైన విశ్వాసంతో సహృదయంతో ఎమర్సన్ అన్నాడు. ఈ జైళ్ళన్నీ యదార్థంగా చెప్పా

లంటే సానుభూతితోను ప్రార్థనాపూర్వకంగాను నిర్వహింపబడే రోగాత్మల చికిత్సకు వైద్యాలయాలు.

**4. జీవునిదీ – దేవునిదీ రహస్యము :—**

దేవుడు తన్ను తప్పక ప్రేమిస్తాడనీ తాను దేవునకు ప్రేమ పాత్రుడననీ అందుకు తనకు హక్కు ఉన్నదనీ దేవుడు జీవులను ప్రేమించకుండా ఉండలేడని భావించే యొక భక్తునితో

'నేను నీగుట్టు బయటపెట్టనా! నీవు రహస్యంగా చేసే పాపాల్ని, నేరాల్ని బహిరంగంచేస్తా. అప్పుడందఱు రాళ్లతోకొట్టి నిన్ను ప్రాణావశిష్టుణ్ణి చేస్తారు' అన్నాడు దేవుడు. 'అట్లే కానిమ్ము! నేను మాత్రం ఊరుకుంటానా. నీమహదాశ్చర్యకరములైన రహస్యములన్నీ నేనూ బయటపెట్టగలను. నీయవ్యాజకరుణామయత్వాన్ని సర్వదయాపరత్వాన్ని, పాత్రాపాత్రతల్ని పాటించని శరణాగతవత్సలత్వాన్ని, నిర్హేతుకజాయమాన కరుణాస్వభావాన్ని ఒక్కసారి లోకానికి చాటుతా. అప్పుడు మానవులంతా దేవాలయాలు మూసి వేస్తారు. ప్రార్థనలుచేయకపోయినా భగవంతుడు మనల్ని రక్షించి తీరుతాడని ప్రార్థనలు మానుకుంటారు.

అప్పుడు నిన్నెవరు కొలుస్తారో చూస్తా' అని జీవుడు బదులు చెప్పాడు. "వద్దు వద్దు నీవు నారహస్యాల్ని భద్రంగా ఉంచు. నేను నీ రహస్యాల్ని దౌర్జన్యాల్ని భద్రంగా ఉంచుతా" అన్నాడు దేవుడు. అందుకే మానవుల నేరాల్ని దేవుడు క్షమతో తల్లివలె కడుపులో పెట్టుకుంటాడు. "నేనూ దేవుని అపారమైన, అగాధమైన దయాపరత్వాన్ని గుప్తంగా ఉంచుతా." అని దేవుడూ – జీవుడూ రాజీపడ్డారు.

'కాలు కదల్పలేడనుచు కట్టెదుటన్ బడజాలడంచున
న్నాలముచేసి కేరడములాడకు నేనును నోటదీట నె

కాకులు గుణించు లెక్కనెఱక్కైతల నీతిరుగుట్టుమట్టిలో
కాలెఱుగంగఁజాలగల గండడ సత్యవిభూ జగత్ప్రభూ !

**5. పారవశ్యము :—**

ఆరామంలో అడుగిడుతూంటే 'తిరిగి వచ్చేటప్పుడు నాకొన్ని పువ్వులు తెచ్చిపెట్టవూ' అన్నాడొక స్నేహితుఁడు. కోటలో ప్రవేశించి ఆరామసౌందర్యాన్ని ఎంతో మనోభిరామంగా అనుభవించా. సుమముల సోయగానికి ముగ్ధుడనై, సౌరభములకు మత్తిల్లి, భ్రమర గీతాలకు దిగ్భ్రాంతి చెంది తన్మయుడనయ్యాను. స్నేహితుని ప్రార్థన జ్ఞప్తికివచ్చేసరికిచూచుకుంటే ఆరామానికి అవతల ఉన్నట్టు తెలుసుకున్నా" అన్నాడు మధురహృదయుడైన 'సాదీ' (కానుక అనేది అనుభవించడానికి యోగ్యమైనదే కనుక తన్నుతాను మఱచి పోయి అనుభవించే అనుభవమే అనుభవము. అనుభవం ఒక్క వ్యక్తిత్వాన్ని మఱచిపోవడమే కాకుండా) అనుభవించినప్పుడే అది కానుక అవుతుంది. ఆ అనుభవంలో తన్నుతాను మఱచిపోవుటయే పూర్ణానుభవం. అది ఆత్మచైతన్యాన్ని కోల్పోవుటకాదు. ఆచైతన్యం సచరాచరమైన జగచ్చైతన్యములోనికి వ్యాపించి పరమేశ్వర సౌందర్యాన్ని తన్మయత్వంతో వృష్టిగా అనుభవించడం.

**6. రాజే యాచిస్తే- ప్రజలదే పైచేయి**
**దేవుడే యాసిస్తే- జీవునిదే పైచేయి :—**

ఒకగ్రామంలో యింటింటా ఒకభిక్షకుడు అడుక్కుంటూ ఉంటాడు. బంగారురథముపై ప్రభువు వెడుతూఉంటాడు. అభిక్షువు బంగారురథాన్నిచూచి ప్రభువుని యాచిస్తాడు. అత్యాశతో, ఆప్రభువు రథం దిగి భిక్షువుదగ్గఱకు వచ్చి నాకిచ్చుట కేమితెచ్చావన్నాడు, పాప మాభిక్షువు నిరాశతో తన సంచిలో చేయిపెట్టి దీనంగా ఒక ధాన్యపుగింజనుతీసి ప్రభువు కిచ్చాడు. ప్రభువు దాన్ని సంతోషంతో

స్వీకరించాడు. రథము వెళ్ళిపోయింది. భిక్షువు యింటికి వెళ్ళి సంచిలో చూచుకున్నాడు- అందులో ఒక బంగారుధాన్యపుగింజ! దేవుడు ప్రజలకు ప్రభువు. ప్రజలనుండి అల్పకానుకలను గ్రహించి, బదులుగా బంగారం వర్షిస్తాడు. ప్రజాస్వామ్యంలో ఒకతెగకు చెందిన సంఘ సభ్యుల యిచ్చిపుచ్చుకోడాలు దేవుని ప్రజలమధ్య యిచ్చి పుచ్చు కోవడంవలె ఇతోధికంగా ఉంటుంది.

దేవుడే యాచకుడైతే జీవునినుండి తృణాన్ని స్వీకరించి మేరువుని ప్రసాదిస్తాడు. ప్రజాస్వామ్యంతో యిచ్చిపుచ్చుకోడాలు ఇలాగే ఉంటాయి.

**7. 'దేవున్ని నీవెలా తెలుసుకుంటావు' అన్న హసన్ ప్రశ్నకు సమాధానం :**

నీవతన్ని 'ఇది, అది' అని తెలుసుకుంటావు. 'నేను' ఇదికాదు: ఇదికాదు' అని ఆనిరుపమానుణ్ణి, అనిర్వచనీయుణ్ణి తెలుసుకుంటా".

రాబియా కాచాని సేవింపదు అందరు ముస్లిమ్‌లవలె; 'నేను కోరేది నిన్నే. నా ఏకైకలక్ష్యం, నా అత్యధికమైన వాంఛ- ఈజన్మలో నిన్ను మరువగూడదు. నిన్నేస్మరించుకోవాలి- మరియొక జన్మలోనూ నిన్నే కలుసుకోవాలి" అని సేవిస్తాను.

**8. కిటికీలు - కిటికీలు :**

ఒకభక్తుడు, అధికారి, వర్తకుడు ముగ్గురు కలిసి ఒకే దారిని పోతున్నారు. అంతా ఒకసత్రంలో బసచేశారు. వాళ్ళకొక పక్షికూత వినిపించింది. అకూత ఏమిటంటారు అని ఒకళ్ళ నొకళ్లు ప్రశ్న వేసికొన్నారు. 'సృజనాత్మకశక్తినిగూర్చిన పొగడ్త' అన్నాడు భక్తుడు. 'కత్తి - డాలు- దండం' అన్నాడు అధికారి. 'ఉప్పు- నూనె- అల్లం' అన్నాడు వర్తకుడు. ఒకటేశబ్దం- ఒకటేపక్షి. అనూతే ఒకవిశే

దైవవిలాసంగాను, మరియొకనికి జీవితసంఘర్షణలో ఆత్మరక్షణ భారాన్ని వహించే ఆయుధసామగ్రిగాను, వేరొకనికి క్రయవిక్రయ మూలంగా లాభించే వస్తుసముదాయంగాను వినిపించింది; ద్యోతక మైంది. నిజంగా గవాక్షంనుండి ప్రసరించేకాంతి వివిధాత్మలలో వివిధంగా ప్రకాశిస్తుంది.

## 9. 'శివం, శివం':

క్షీరసాగరం మధిస్తే అమృతంతోపాటు హాలాహలంకూడా పుట్టింది. లోకరక్షణార్థం దాన్నెవరో భరించాలి. విషాన్ని త్రాగిన వాడే 'శివం, శివం' అని చాటగలడు. విషమను మానవదుఃఖాల్ని బాధల్ని త్రాగగలిగినవాడే శిహాశీర్వాదమును ప్రకటింపగలడు:- 'నేను విషాన్ని హరించా, నీవు శాంతంగాసుఖంగా ఉండడానికి. నేను ప్రాణాన్నే విడనాడా, మీరంతా నిండుప్రాణాలతో ఉండదానికి. శివుడు శివం అయ్యాడు విషాన్ని హరించి హరుడయ్యాడు కాబట్టి. అనగా అన్నిటినీ హరించే స్వార్థాన్ని నాశనంచేసాడు. అతడొక్కడే 'శాంతి శాంతి' అనగలడు. కావున త్యాగం సత్వరముక్తిసాధనం.'

## 10. చూడాలి - చూపించాలి :

చూచుట- చూపించుట: సర్కసును గూర్చి యిద్దరు మాట్లాడు కొంటున్నారు. ఒకడు నాకు తమాషా చూడాలని ఉందంటాడు. రెండవవాడు నాకు తమాషా చూపించా లనిపిస్తోంది అంటాడు. ఇదే జీవాత్మకి పరమాత్మకిగల సంబంధం. లభ్యమైన దైవసాక్షా త్కారాన్ని ప్రతిబింబింపజేయగలిగే శక్తిని, వస్తుతత్వంలో దివ్య త్వాన్ని నిరూపించే సామర్థ్యాన్ని ప్రసాదించు. ఇట్లు దిగివచ్చే దివ్యత్వాన్ని వస్తుతత్వాన్ని ముందు తెలుసుకున్నతరువాత ప్రపం చానికి వెల్లడిచెయ్యాలి.

**11. నాది అనుకున్నది - నిజంగా అందరిదీ :**

ఒకడు తన చిన్నకుమారునితో దక్షిణంగా ప్రయాణంచేస్తున్నాడు. 'అయ్యో మన అనుభవంల్లో ఉన్న ప్రాంతీయాకాశాన్ని వెనకవదలి వచ్చేస్తున్నామే' అన్నాడు చిన్నవాడు వినోదంగా. చివరికి వాళ్ళగమ్యస్థానం చేరుకున్నారు. పిల్లవాడు పైకిచూశాడు. 'నాన్నా ! ఇక్కడా ఆకాశంఉందే!' అన్నాడు చిన్నవాడు. అయినప్పటికి మనం నాదీ నాదీ అని సంకుచితంగా వినోదిస్తాం- ఆకాశం ఇక్కడే ఉందని. మనం వెళ్ళినకొద్దీ సర్వాచ్ఛాదిత ఆకాశాన్ని వెనక వదులుకొంటూ ఉంటాము. ఇదే పరమాద్భుతసత్యం. నాదీ అనుకున్న ప్రాంతాకాశం యదార్థంగా అందఱిదీని.

**12. స్వర్గసంవాసులు - అందరూ :**

వెస్లీ స్వర్గద్వారందగ్గఱకు గొంపోబడ్డాడు. వెస్లీయను లెవరైనా అక్కడ ఉన్నారా అని ప్రశ్నించాడు. ఒక్కరూ లేరని సమాధానం- ప్రొటెస్టెంట్లున్నారా ? ఏఒక్కడూ లేడు. పోనీ కనీసం క్రిస్టియనులేనా ఉన్నారా ? వాళ్ళూలేరు. మరి ఉన్నదెవరు ? అందఱూ విశ్వాసులే. రాజారామమోహనరాయ్ నవ్యవిశ్వమానవతకు నిజస్వరూపము- స్వర్గసంవాసత్వము ఏయొక్కతెగకు నిర్ధారింపబడలేదని, అది విశ్వాసమున్నవారందఱిదీ నని ఆయనమతం. దేవునిదయ ఎంత ఉన్నతమైనదో మానవుని వాంఛలు అంత యథేష్టమైనవి.

**13. దేవునిపక్షమందు :**

ఉత్తరదక్షిణ అమెరికారాష్ట్రల అంతఃకలహంలో దేవుడే తన పక్షాన్ని ఉండునట్లుగా ప్రార్థన చెయ్యవలసినదని కొందఱు భక్తులు అబ్రహాంలింకన్ని కోరారు. నీతిమంతుని నిజపుత్రునివలె దేవుడు నాపక్షముననే ఉండవలెనని నాప్రార్థనోదేశము కాదు. నా

ప్రయత్నమంతా, నాయావదుద్దేశము నేను దేవునిపక్షమందుండ వలెననియే కాని- దేవుని నాపక్షమునకు త్రిప్పవలెననికాదు. కాని నేను నిశ్చయంగాను నిశ్చలంగాను దేవునిపక్షమందుండాలి. నీతికి కట్టుబడుటఅంటే, నైతికశాసనాన్ని అనుసరించడమంటే, నేనే దేవుని పక్షాన్ని ఉండడం. దేవునిపక్షాన్ని ఉన్నవానికి ఈవిశాల ప్రపంచంలో అవధంటూ లేదు; పరాయిదంటూ ఉండదు- విశ్వమంతా అతనిదే.

## 14. అమ్మా- నాన్నా :

ఒకచిన్నవాడు, అతనిలేతహృదయంల్లో చిన్నకోరిక ఉండేది. అనుభవాన్ని ఒక జాబితా వ్రానుకోవాలని. దినదినమూ అతని అనుభవాన్ని వ్రానుకునే పేజీలో "ఏ" ఈవిధంగా దయచూపాడు;

'బి' ఈవిధంగా సానుభూతిచూపాడు; "సి" ఈవిధంగా ఎంతో ఉపకరించాడు; అని వ్రానుకునేవాడు. ఇట్లా వ్రాసి ప్రతిపేజీపైనా తన తొలిపలుకులు 'అమ్మా' 'నాన్నా' అని వ్రాసేవాడు. ఏమంటే ఆరోజు తాను పొందే అనుభవాలన్నిటికీ శీర్షికగా యీ మాటలు నిలిచేవి, స్ఫురించేవి, ఆరోజుపొందిన ఆనందానుభవంల్లో అంతర్లీనమై కానిపించేవి. జీవితంలో మనం పొందే అపారమైన ఆనందానికీ, దుఃఖానికీ స్థానమైన హృదయఫలకంపై ఏ అనుభవం 'దేవుడే నాతండ్రి తల్లి' అని చిత్రిస్తుందో అట్టి అనుభవమే మతము. అట్టి అనుభవజ్ఞుడే దేవునిగూర్చి ధర్మమునుగూర్చి చెప్పుట కర్హుడు.

## 15. 'ఆత్మవ త్సర్వభూతాని' :

అన్నిభూతములను స్వీయాత్మస్వరూపములుగా తన్నుగా నెఱుగుము. చైనాభాషలో దీన్నిగూర్చి చిన్న ముచ్చటైన కథ ఉంది. సత్యాన్వేషి యొకడు గురువును దర్శించి గ్రంథముల సారమంతా ఒక్కమాటలో చెపుతారా ? అన్నాడు. అన్యోన్యం ఇవ్వడం

పుచ్చుకోవడం- 'ఆత్మవత్సర్వభూతాని'-పరులనుండి ఏది కోరుతావో దాన్ని పరులకు నీవు చెయ్యి. నీతిశాస్త్రసారమంతా పరస్పరం యిచ్చిపుచ్చుకోడంలో యిమిడి ఉంది. తనకున్నది ఒకరికివ్వడం- లేనిది మరియొకరినుండి తెచ్చుకోవడం- ఆవిధంగా మతమును విశ్వవ్యాప్తం చేసి ఒక్కమాటలో చెప్పాలంటే- సర్వమత పరమార్థాన్ని బట్టీపట్టిన మూసలో మిగిలేది 'త్యాగమొక్కటే'. అదే పౌరాణికపరిభాషలో 'ప్రేమ'. బ్రహ్మర్షి దేవేంద్రనాథటాగూరుగారి కుడిభుజమైన, బ్రహ్మసమాజం నాయకమణియైన బాబూ రాజనారాయణబోసుగారిచే ఈప్రేమతత్త్వం ప్రవచింపబడినది. బ్రహ్మతత్త్వాన్ని ఒక్కమాటలో వర్ణింపమంటే అయన 'ప్రేమ' అన్నాడు.

* * *

"భవ్యమగునట్టి ప్రేమప్రపంచకమున
కమరపట్టణ మొక పల్లెయైనగాదు;
వేయుగన్నుల వెలయునా ప్రేమగతుల
గన్నుగవతోడ నెవ్వారు గాంచగలరు.

* * *

ఏమయిననేమి కొంచెమూహించిచూడ
బ్రేమమయుఁ డీశ్వరుఁడు; సృష్టి ప్రేమమయము
ప్రేమమయులెల్ల జీవులు ప్రేమయొకటే
పావనంబైనదని బోధపడుచునుండె."

వేం॥ హ॥ కవులు.

## 16. సేవించడం మనవంతు-ఆశీర్వదించడం ఆయనవంతు :

ఇద్దరు సన్యాసులున్నారు ఒంటరిగా వారిరువురు వారివారి గుడిసెల్లో నివసిస్తున్నారు. దీపం వెలిగించుకోడానికి యిద్దఱికి నూనెకావలసి వచ్చింది. నూనెకొఱకిద్దరు రెండు చెట్లనునాటారు.

అవి ఎదుగుతూ ఉంటే, ఒకసన్యాసి దేవునిగూర్చి ప్రార్థించాడు: 'ఓ తండ్రీ! నా చెట్టునకు తగినంతబలమును, దినదిన ప్రవర్ధమానంగా పెద్ద వృక్షమగుటకు తగిన నీటిని, నా అశ్రద్ధవలన అది ఎండిపోకుండా ఉండేవరమును ప్రసాదింపు'మని ప్రార్థించాడు. రెండవ సన్యాసి విత్తనంనాటి "ఓ తండ్రీ నాకు వెలుతురుకావాలి. దీపం వెలిగించుకోడానికి నూనెకావాలి. ఆస్నేహాన్ని ఆశించి నీదివ్యత్వానికి చిహ్నంగా నీ విత్తును నాటినాను. దాన్ని నీ పరిరక్షణలో పెరగనిమ్ము- దానిరక్షణభారాన్ని నానెత్తినవేసికొని గాని, దాని ఉపయోగాన్ని నీకు నివేదించి కాని వేసనపడలేను. ఆ భారమంతా వినయపూర్వకంగా నీకేవదలివేశాను. దాన్నిపెంచడం ఫలింపచేయడం నీవంతే!' అని దేవునిమీద భారంవేసి వదలుకున్నాడు. తాను నాటిన మొక్కకు కావలసిన నీటివనరులను, ఎరువులబలాన్ని దేవునకు నివేదించుకుంటూ ఆశించిన మొదటిసన్యాసి మొక్క ఎండిపోయింది. విత్తుమాత్రమే నాటి సర్వరక్షణభారాన్ని ఆ దేవునకే వదలిన రెండవసన్యాసి మొక్క బాగా వ్యాపించి పెరిగి పెద్దదై సుఫలమైంది. కావున నాటడం మనవంతు- పెంచడం దేవునివంతు. దున్నటం మనవంతు- ఫలవంతం చేయడం దేవునివంతు.

* * *

"నినుక న్గాంటిమి నీకటాక్ష మిటు రానిమ్మంటి మాపాపనా
శనతీర్థంబున గ్రుంకినార మఘముల్ శాంతించెనో లేదొ మే
మనుమానించితి మాస్వధర్మమిది మాయందయ్యె నీవిశ్వపా
లనధర్మంబెటు లైననేమి యలమేల్మంగా మనోనాయకా।"

### 17. నాకూ కొంతవిలువ ఉంది :—

ఒకచాకలి రోజూ ఎమర్సన్ ఉపన్యాసాలు వింటూండేవాడు. 'అన్ని ఉపన్యాసాలు వింటున్నావు. వానివలన నీవు గ్రహిం

చినదేమి?" అని ఒకరు ప్రశ్నింపగా, 'నేను నిరర్థకుణ్ణికాదు. అందరూ ఉపేక్షించే అల్పజీవినికాదు. నావల్ల కొంత ఉపయోగ ముందని నాకూ కొంతవిలువ ఉందని తెలుసుకున్నాను" అన్నాడు. స్వామీ దయానంద కూడ తన్ను చంపడానికివచ్చిన ఓకర్కోటకుణ్ణి తన వాగ్వైభవంతో మార్చివేశాడు. వాళ్ళ యిద్దఱిమధ్య శాశ్వతమైన ఒక అనుబంధం ఉందని దానికి కట్టుబడి మానవులంతా ఉన్నారని బోధించాడు. దానితో ఆ కర్కోటకునికి జ్ఞానోదయమైంది. అతనిచేతిలోని హింసాయుధం సత్యాన్ని పరిరక్షించడానికి ఉపయోగపడింది.

## 18. ప్రాణంతీసే సిలువ ప్రాణాన్నిచ్చే డోలిక :

విశ్వచైతన్య డోలికను త్యాగం కదలిస్తుంది. ఈఅర్థమే (లక్షణం) సిలువకికూడా ఉంది. బనియన్ వ్రాసిన పిలిగ్రిమ్సు ప్రోగ్రెస్ అనే గ్రంథంలో'విశ్వాసం'ఒకపాత్ర. ఆపాత్రసిలువకు బలియైంది. ఆసిలువ చరణసన్నిధిని బనియన్ గురుతుగా ఊయలను ఉంచాడు. అందులో అప్పుడే పుట్టిన శిశువు- ఆబిడ్డపేరు విశ్వాసంకాదు-'ఆశ'. సిలువపై విశ్వాసం ప్రాణంవదలింది-తచ్చరణసన్నిధినేఆశకు ప్రాణంవచ్చింది. విశ్వాస త్యాగం ఆశాజీవన డోలికను స్పందింప చేసింది.

ఓమ్

# బ్రహ్మర్షి
# రఘుపతి వేంకటరత్నంనాయుడుగారు

## IV

## నాయుడుగారిని గూర్చిన గాధలు

**ఈవి :**

శ్రీనాయుడుగారి యీవి ఒక ప్రత్యేకమైంది. వారిదానం–గుప్తదానం. ఖలీల్ జిబ్రాన్ అన్నకవి యీవిని గురించి అన్నమాటలు నాయుడుగారి యీవిపట్ల సత్యమనిపిస్తాయి:– నీకున్నదానిలో కొంత ఎవరికైనా యిస్తే అదిచాల స్వల్పదానం అనిపించుకుంటుంది. నిన్ను నీవే యితరులకంకితం చేసుకోవడమే నిజమైన దానం. శ్రీమంతులు ఏ కొలదిగానో దానంచేస్తారు. అవీ పేరుకోసం, గొప్పకోసం యిస్తారు. అది దానం అనిపించుకోదు. కొందరిపేదలకు ఏకొలది గానో ఉంటుంది, అట్టివారా ఉన్నదికాస్తా యిచ్చేస్తారు. అంతా యిచ్చివేసినా వారి కేలోటూరాదని వారివిశ్వాసం. అందుచే సంతోషంగా యిచ్చివేస్తారు. ఆసంతోషమే వారికి ప్రతిఫలం. మరి కొందఱు బాధపడుతూ యిస్తారు. వాళ్ళకు మిగిలేది ఆబాధే. మరి కొందఱు యిచ్చేటప్పుడు బాధపడరు; ఆనందాన్ని ఆశించరు; పుణ్యంకదా అనీ యివ్వరు. పుష్పాలు సౌరభము వెదజల్లినట్లు, గాలి వీచినట్లు, వృక్షములు ఫలించినట్లు, మేఘం వర్షించినట్లు దేన్నీ ఆశించకుండా కొందఱు వారివారి స్వభావంచే నిర్వర్తిస్తారు; నిష్కామంగా దానంచేస్తారు. అట్టివారి హృదయంలోంచి భగవంతుడు పలుకరిస్తాడు– చూపులోంచి మందహాసం చిందిస్తాడు.

అర్థించినవాని కివ్వడం మంచిదే. కాని అడగకుండా ఎదుటి వాని అవసరం గుర్తించి యివ్వడం మరీమంచిది. అట్టిదానకర్ణులకు అర్థించేవారు లభించడం మహదానందం.

ఉన్నదానిలో కొంత యిచ్చి కొంతవెనక వేనుకుంటావా- ఉన్నదంతా ఎప్పుడో ఒకప్పుడు నీకు దూరమయ్యేదే. అట్టి మహ దవకాశం నీవే దక్కించుకొని నీచేతులతో నీవే యిచ్చెయ్యి. అది నీ వారసులది కాకుండా చూచుకో. పాత్రులకేకాని అపాత్రులకు యివ్వనంటావు. ప్రకృతిలో వృక్షాలూ, పశువులూ- ఒక్కమానవులు తప్పించి మిగిలిన సచరాచర ప్రపంచ మంతా- పాత్రతా పాత్రతల నెంచక యెల్లరకు దాచుకోకుండా ఉపకరించేవే. నిస్స్వార్థంగా, సజీ వంగా ఉండాలనీ- ఉన్నదేమైనా దాచుకుంటే నిర్జీవుల మవుతామని వాటికి తెలుసు. ప్రకృతిలో అన్నిటినీ స్వామ్యంగా అనుభవించే అర్హత ప్రతి జీవికీ వుంది. ప్రకృతిలో ప్రతియొక్కదాన్ని పంచుకో డానికి అర్హతగల ప్రతియొక్కనికి నీనుండికూడా గ్రహించే అర్హత ఉంది.

అసలు అడగడానికే అరచావు చస్తాడు. దీనంగా ఎంతో కుదించుకుపోయి, కలిమి కులకడానికి కాదనీ- అది ఒలకపోయడా నికి మాత్రమే నన్న విశ్వాసం ఉన్నవాడు కాబట్టి, అంతటి దీనా వస్థలోను కలవానికి చేయి చాస్తాడు. హృదయం చీల్చి వీ వాతని యర్హతానర్హతలను పరీక్షించడానికి హక్కెముంది- అభిమానం దెబ్బతిన్నవా ణ్ణలా పరీక్షించడంకంటె చిత్రవధ మరియొకటిలేదు. ఆ అధికారం నీదీ కాదు. గ్రహీత అర్హతను గురించే ముందు దాతగా నీ కర్హత ఉందో లేదో చూచుకో. అట్టి అర్హతను సంపా దించుకో. ఇచ్చువాడవు నీవు కాదు. ఇవ్వబోయేది నీది కాదు. నీవు మాత్రం ఇచ్చే ఒక పరికరముగా వుండు. ప్రాణం ప్రాణాన్నిస్తుంది. దీపం దీపాన్ని వెలిగించినట్లు- ఎన్ని దీపాల్ని వెలిగించినా దీపం

దీపంలాగే ఉంటుంది. వెలిగేది వెలిగించేది ఉన్నంతవఱకు వెలిగించు కుంటూ పోవచ్చు. అల్లే ఉన్నవాళ్లల్లా అడిగినవాళ్లకు యిచ్చు కుంటూ ఉండవలసినదే. నీరు పల్లాన్ని వెతుక్కుంటూ పోయినట్లు ఆవిధంగా దాతలు గ్రహీతలుకూడా జ్యోతిర్మయులు కండి. అంతే కాని గ్రహీతని మాత్రం కృతజ్ఞతాగుణభారంతో క్రుంగదీయకండి. ప్రకృతిని తల్లిగాను, పురుషుని దైవంగాను భావించే యాచకుని దైన్యవేదనను కృతజ్ఞతాపేక్ష శంకించిన ట్లవుతుంది."

బ్రహ్మర్షి వేంకటరత్నంనాయుడుగారి వితరణ అట్టి జ్యోతి ర్మయ మైనది. దయారస వృష్టిని కురిపించే ప్రావృట్కాల ఘనా ఘనము. 'నా వెనకాల దయాసముద్రుడై యాతడుంటూ నాదంటూ ఏమీలేని వితరణకు గ్రహీతలచే కృతజ్ఞతలు ముట్టచెప్పిస్తా డేలకో భగవానుడు' అంటారు నాయుడుగారు. ఏ చేతనున్నదాన్ని ఆ చేతి తోనే రెండవచేతికి కాదు, ఇచ్చే హస్తానికి కూడా తెలియకుండా దానంచేస్తారు నాయుడుగారు. ఏంచేసినా సర్వం'బ్రహ్మర్పణమస్తు' అంటూ చేస్తారు. వెలిగే దీపం వెలిగించే దీపానికి తన కాంతినంతా యిచ్చినట్లు ఆత్మార్పణంచేసుకుంటారు నాయుడుగారు. ధన రూప ములో గాని, ధాన్యరూపంలో గాని, విద్యారూపంలో గాని, మాట సహాయంకాని, వాత్సల్యరూపంలోగాని ఏదో విధంగా అనుక్షణం ఎవరికో ఒకరికి యిస్తూండడమే ఆయన దినచర్య. అది ఈశ్వర ప్రేరిత మని ఆయన అచంచల విశ్వాసం. ఆయన మతం ప్రేమ, మాటలో ప్రేమ, క్రియలో ప్రేమ, మనసులో ప్రేమ. రూపమూ- నీలనీరద గంభీర శ్యామలము. దుస్తులా- శంఖ శ్వేత శుభ్రములు. శ్రీ నాయుడుగారికి సతీమణి పోయినది. ఆయన Widower. "పతి వియోగాన్ని భరించే భారత వితంతువుయొక్క వేషధారణ శ్వేతవస్త్రధారణ కావున- పత్నీవియోగినైన నాకు మాత్రము శ్వేతవస్త్ర ధారణమే యోగ్యమైన" దని శ్రీ నాయుడుగారి భావన.

అందుకే నిత్యమూ తెల్లని వస్త్రములనే ధరించెడివారు. ఆయన విశ్వ మయ ప్రేమకీ, సర్వదయాపరత్వానికీ ఎన్నో నిదర్శన లున్నాయి. అందులో నా స్వానుభవంలో ఉన్నవీ- కన్నవీ- విన్నవీ కొన్ని మాత్రం ఉదాహరిస్తాను.

(1) మైసూరులో నాయుడుగారి మిత్రుని భార్య ఉండేది. ఆమె భర్త చనిపోయిన తరువాత ఆర్థికమైన యిబ్బందులకు లోనైంది. ఆ కష్టంలో ఆమెకు ప్రతినెలా కొంత సొమ్ము మనియార్డరు పంపుతూ ఉండేవారు నాయుడుగారు. ప్రతి నెలా అనాథకు వచ్చే మనియార్డరు చూచి యిరుగుపొరుగువా రేమనుకొంటారో అన్న లోకభీతిచే- 'మావారు చనిపోయే ముందు కొంత సొమ్ము వారి స్నేహితునియొద్ద నాకొఱకు దాచి ఉంచారు. నాకు అవసరం వెంబడిని పంపుతూ వుండమని. ఆ స్నేహితులు పంపుతున్నా'రని చెప్పేదిట. ఈ సంగతి తెలిసినవా రెవరో యీ మాట నాయుడుగారి చెవిని వేశారు. "ఆమెచెప్పినది నిజమే. నేను పంపే సొమ్ముమీద ఆమెకు హక్కుంది. పాపం! లోకాపవాదం వస్తుందని ఎంత బాధ పడిందో ఆ సాధ్వి" అని గద్గదికతో కంటతడి పెట్టారు.

(2) ఒక కాలేజీ ప్రిన్సిపాల్ గారు- ఒక రోజున యింటిలో బియ్యం నిండుకున్నాయి. ఇంటినిండా చుట్టాలు. బియ్యంకొఱకు ఏప్రయత్నం లేకుండా చుట్టాలతోను, మిత్రులతో గోష్ఠి సల్పుతూ చిదానందంగా వున్నారు. ఆ నిర్లిప్తతను ఒక కవిమిత్రుడు కనిపెట్టి ఒక చీటి వ్రాసి నాకు పంపాడు- నాయుడుగారితో చెప్పమని, అప్పుడే లేచారు నాయుడుగారు. కాళ్లు పట్టుకొని ఏదోమాట్లాడుతూ కార్యాలు తీర్చుకోడానికి వెడుతున్నారు. చీటీని మెల్లగా అందించాను. ఆ చీటి చూచుకున్నారు. ఆగిపోయారు. నయనాలు చెమ్మగిల్లాయి. వెనక్కి తిరిగి గదిలోకి వెళ్ళి ఒక కవరులో కొన్ని నోట్లు పెట్టి చిన్న చీటీ వ్రాసి ఆ నోట్లకవరు, చీటీ ప్రిన్సిపాల్ గారికి పంప

మని నాచేతికిచ్చారు. ఆయన బాధల్లా ఆ ప్రిన్సిపాల్ శిష్యుని దీనా వస్థకు కాదు. 'బాబూ, మనవాడు యిద్దటి ద్వారా నాకు కబురు చెయ్యాలా ! అతనికి స్వయంగా నా దగ్గఱతీసికొనే హక్కుందే' అన్నారు గద్గదస్వరంతో. వితరణలో ఇంతటి ధర్మసూక్ష్మాన్ని ఎంత మందిలో చూడగలం. గుప్తమైనది శ్రీ నాయుడుగారి వితరణ.

(3) ఒక హైస్కూలు ఉపాధ్యాయుడు. బహుకుటుంబీకుడు. అతడు జబ్బుచేసి మంచం పట్టాడు. బెంగ పెట్టుకొన్నాడు. జబ్బుచేసిన సంగతి నాయుడుగారికి ఎవరివల్లనో తెలిసింది. ఒక రోజున రోగి మేలుకొని చూచుకునేసరికి తలగడక్రింద నాయుడు గారి దస్తూరితో ఒక తెల్ల కవరు, అందులో రోగి అవసరానికి పనికి వచ్చుటకు కొంత సొమ్ము. ఆ ఉపాధ్యాయుడు నిర్ఘాంతపోయాడుట– ఆ కవ రక్కడ కెలావచ్చిందో తెలియక.

"నాయనా, ఎవరైనా చిక్కుల్లో ఉన్నప్పుడు ఆ బాధ తీర్చడానికి వెంటనే యివ్వాలి. అట్టి సదవకాశాన్ని కోల్పోకూడదు. ఏదో ఉద్యోగం చేసికొని బ్రతికేవాడు, అందులో రోగియైనవాడు అడగాలంటే అభిమానం అడ్డంవస్తుంది. ఆ స్థితి ఎంతకష్టమో, దుర్భరమో అనుభవించేవానికే తెలుస్తుంది. ఇచ్చిన స్వల్పాన్ని నలుగురికి చాటితే అభిమానం దెబ్బతిని అర్థి నొచ్చుకుంటే ఆర్తశరణ్యుడెంతో పరితపిస్తాడు. కావున, ఆ దేవుని మనసు నొవ్వకుండా చెయ్యాలి ఏ పనినైనా" అన్నారు. దైవానుగ్రహంవల్ల ఆ ఉపాధ్యాయుడిప్పుడు పెద్దపెద్ద ఉద్యోగాల్లో వున్న బిడ్డలతో సుఖంగా వున్నాడు.

(4) పాపాన్ని శిక్షించాలి– పాపిని రక్షించాలి :– ఆమె అనాథశరణాలయంలో పెరిగింది. చదువాట్టేరాలేదు. పెండ్లిచేశారు. బిడ్డల్ని కన్నది. ఏట్లాగో మంత్రసాని పని నేర్చుకుంది. నైతికంగా పతనమై ఒకరిద్దరిని మళ్లీ పెళ్లి చేసుకుంది. లోకం దృష్టిలో పతిత. బిచ్చమెత్తినా తల్లీ బిడ్డలకు తిండి గడవదు. ఆమె నెఱిగిన పెద్దలు

Acc no. 11004



శ్రేయస్సు కోరి ఎంత చెప్పినా పళ్లీ మళ్లీ దిగిన గోతిలోనే దిగుచు క్రిందికిజారింది. నాయుడుగా రొకసారి శరణాలయం సూపరింటెం డెంటుగారితో కంట తడిపెట్టుకొంటూ– 'మన బిడ్డమా టింకేమిటి– ఏంచెయ్యాలి? ఏమీ తోచడంలేదు' అన్నారు. 'నేనుమాత్రం ఆమె విషయం ఇంక పట్టించుకోడం మానేశాను' అన్నారు– సూపరింటెం డెంటు. 'నేను పట్టించుకోకుండా వుండలేను–' అన్నారు నాయుడు గారు. ఆమె కందజెయ్యమని నాయుడుగారు డబ్బిస్తే పెద్దమనుష్యు లైనవారు వెళ్లియివ్వడానికి యిష్టపడేవారుకాదు– సంఘంలో వారి గౌరవానికి లోటని. నాయుడుగారు వారం వారం ఆమె కిమ్మని కొంత పైకం వారి బంగళా నౌఖరుచే గేటు దగ్గఱకు పంపిస్తూ వుండేవారు లోపలికి రానీక. 'పాపాన్నిశిక్షించు–పాపినిరక్షించు.' ఆ పతితను దగ్గఱకు రానీకుండా దూరాన వుంచడం శిక్ష. ఆర్ద్ర హృదయంతో అ పతితకు సహాయం అందచెయ్యడం– క్షమాపణ.

(5) అపూర్వ ప్రేమ :– శరణాలయంలో ఒకబాలు డుండే వాడు. అత డెప్పుడూ ఏదో తప్పుచేసినవాని వలె అందఱిలో మెల గుతూ వుండేవాడు. అందఱినీ ఒకేలాగ సర్వసమానంగా చూచే పెద్దనాయన (నాయుడుగారు) నిష్కళంక ప్రేమకు ముగ్ధుఁడై యధార్థం చెప్పా లనిపించింది అతనికి. ఒక రోజున నాయుడుగారి కాళ్లమీదపడి వెక్కివెక్కి ఏడుస్తూ– 'పెద్దనాయనా! నాకు తల్లి దండ్రు లున్నారు. శరణాలయంలో చేరడంకొఱకు అబద్ధ మాడాను. శలవిప్పించండి. నే వెళ్లిపోతా' అన్నాడు. ఆ బాలుని లేవదీసి, కౌగిలించుకొని, ముద్దాడి, 'నాదగ్గఱే ఉండువులే– సంస్థలో వద్దు' అని తనయొద్దపెట్టుకొని ఆదరించి పెద్దవాడ్ని చేశారు. అతడే హరి. ఉత్తమ ఉద్యోగస్థుడై, మంచిపేరు తెచ్చుకొని, యవ్వనంలోనే స్వర్గ ధామం చేరుకున్నాడు.



V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R I.
Acc. No.

(6) శరణాలయంలో మరియొక బాలు డుండేవాడు. శరణాలయంనుండి వెడలిన తరువాత బ్రతుకు బాటల్లో ఎన్నో కష్టాలు పడవలసి వచ్చింది. ఇట్లు కష్టాలు పడిపడి చివరకు మతి పోగొట్టుకొన్నాడు. అతని పిచ్చిచేష్టలు చూచి రక్షకభటులు జైల్లోవుంచారు. నేను చూడడానికి వెళ్ళా. నన్ను చూచి భోరున ఏడ్చాడు. 'బావగారూ– ఆహా! పెద్దనాన్న ! ఏం ప్రేమ– ప్రేమంటే పెద్దనాన్నదే!' అని కేకలు వేసినాడు. అంతటి అవ్యక్తస్థితిలో కూడ ఒకసారి చవి చూచిన పెద్దనాన్న ప్రేమ అతనిలో హత్తుకుపోయింది.

(7) ఈశ్వర విశ్వాసులకు విరోధులా? :– సర్కారు బాబుగారి తెలుగుబిడ్డ శకుంతలాదేవి, ఒకనాడు కేషబ్ ప్రార్థనలు చదువుతూ కూర్చున్న నాయుడుగారి పాదాలవద్ద కూర్చుంది. ఆమె బాగా చదువుకున్నది. ఉన్నట్లుండి నాయుడుగారు 'తల్లీ, ఇక్కడ శత్రువుల కొఱకు ప్రార్థన– అని బ్రహ్మానంద కేషబ్ చంద్రసేన్ వ్రాశారు' అని ఊరుకొని...ఆగి..."ఏమంటావు" అన్నారు, అంతా నిశ్శబ్దం. కొంతసేపు కండ్లుమూసుకొని నాయుడుగారు– 'తల్లీ, మన కేషబ్– బ్రహ్మానందుడు ఎంతో గొప్పవాడు' అని– 'అమ్మా! ఆస్తికులకు శత్రువు అనేవాడుండడు. అతనికొఱకు మనం ఎంతటివాళ్లం ప్రార్థన చెయ్యడానికి. ఆ విషయం భగవంతుడే చూచుకుంటాడని కదూ ? ఏదో నీలో మెదులుతూ ఆలోచిస్తున్నావు" అన్నారు. 'ఆఁ అదే ! సరిగా అదే నా అనుమానం" అన్నది ఆమె. వినేవారికి తెలియనట్లున్న ఆ పరమార్థాన్ని తానే నిరూపిస్తున్నట్లు కాకుండా ఎదుటివారిని ఏ విధంగాను నొప్పించని వానజల్లు లాంటి చల్లని సంభాషణ నాయుడుగారిది. అంతర్ గర్భితమైన భావాన్ని విన్నవారికి కూడా సుపరిచితమైనదాని వలెనే అందిస్తారు. నమ్మకంతో నమ్రతకూడా వుండాలి. మతోపజీవికి శత్రుపంటూవుండడు. కేషబ్ యెడ గౌరవంతోనే యీ సూక్ష్మాన్ని గ్రహించాలి. ఒకరి కంటె

మనం ఎక్కువ అనే భావం భక్తుని కుండరాదు. శత్రువు కొఱకు ప్రార్థన అనేది అహంభావంగా అనిపించవచ్చు. వారి కొఱకు ప్రార్థన చెయ్యడం, మన మెంతటివారం ? ఆ వైరుధ్యం మనం ఏ విధంగా పుట్టించాము ? మనలోనే ఏదో లోటుండాలి. ఇంతటి సూక్ష్మాన్ని అంత చల్లగా పన్నీరు జల్లుగా నిర్వచించడంలో ఆయనకు ఆయనే సాటి.

(8) హృదయ వైశాల్యం:- ఒక ఆదివారం సాయంకాలం చెన్నపురిలో దక్షిణ ఇండియా బ్రహ్మసమాజ మందిరానికి ప్రార్థనకి నాయుడుగారు గుఱ్ఱపు బగ్గీలో వెడుతూండగా 'దేవుని ఊరేగింపు' ఎదురైంది. ఒక పండుముసలిది దేవుని పాలకికి ఎదురుగా సాష్టాంగ పడి 'దేవునకు' నమస్కరించుటను లెంపలు వాయించుకొనుటను గమనించారు. ప్రార్థనాలయంలోనికి వెళ్ళి ఆ సంధ్యా సమయంలో బాష్పనయనులై ఆవేశంతో- "హే భగవాన్ ! నాకు నీవు ప్రసాదించిన ప్రకాశంతోపాటు ఆ తల్లి విశ్వాసాన్నికూడా అనుగ్రహించవా? అని మేఘ గంభీర స్వరంతో చేసిన నాటి నాయుడుగారి ప్రార్థన మిన్నుముట్టింది. [Oh ! for that Faith with my Life]

(9) భక్తిపారవశ్యం :- ఒకప్పు డాయన పెద్ద ప్రార్థన సమావేశంలో అరాధన చేస్తుంటే హఠాత్తుగా ఒక పిచ్చివాడు పరుగెత్తుకొని వచ్చి- 'భాయి- అల్లాహై" అని అరిచాడు. ఆ పిచ్చివాడు కాస్త స్థిమితపడిన తరువాత ఆ అరపునకు ప్రతిధ్వనియో అన్నట్లు- 'భాయి- అల్లాహై" అని అశ్రుపూరిత నయనాలతో నాయుడుగారు ఆనాడు చేసిన ఆరాధన అందఱిని ముగ్ధుల్ని చేసింది.

(10) నవనీత హృదయం:- ఒకనాడు కాకినాడ ప్రార్థనాలయంలో ప్రార్థన ముగించి నాయుడుగారు బంగళాకు కోచ్‌లో వెడుతున్నారు. చెప్పులు లేకుండా ఎండలో ప్రార్థనామందిరంనుండి హాస్టల్‌కి నడిచివెడుతూన్న అమ్మాయిని నాయుడుగారు చూశారు.

తల వంచుకొని ఎంతో బాధపడ్డారు. బంగళాకు వెళ్ళి ప్రార్థన చేసి నౌఖరికి డబ్బిచ్చి వెంటనే బజారునుండి చెప్పులుతెప్పించి ఆ బిడ్డకి పంపారు, ఆశీస్సులిస్తూ- ఉత్తరంతోసహా! ఆ 'తల్లి' ఎవరో ఆయనకు తెలియదు. ఆ జోళ్లు ఎవరు పంపారో ఆ అమ్మాయికి తెలియదు.

(11) అచంచల విశ్వాసం:- ఒక సంభాషణలో ఏదో ఆవేశంతో- 'నన్ను బ్రహ్మసమాజం తరిమేసినా సరే...' అని ఏవేవో నాయుడుగారి ఎదుట అంటున్నారు ఒకాయన. చల్లగా- 'బాబూ! బ్రహ్మసమాజం దూరంచేసినా బ్రహ్మ వదలడుగా!' అన్నారు. అంతటితో ఆ ఆగ్రహం చల్లపడిపోయింది.

(12) కడపటిసారి ఆయన కంటి చికిత్సకోసం మదరాసు వెళ్ళడం రైలు వేగంలో వినపడిన ధ్వని ఆయన్ని ధ్యానంలో నిమగ్నుణ్ణి చేసింది. ఒక్కటే ఆవృత్తి. కొంతసేపటికి నాయుడుగారు 'అది బాబూ ఒక్కడే సుండీ! ఒక్కడే సుండీ!' అని పల్లవి పాడుతోంది- పరుగెత్తే రైలు' అన్నారు. ఎట్టి అస్వస్థత స్థితిలోనైనా ఏకేశ్వరారాధన మీదనే ఆయన ఆలోచన.

ఒక సందర్భంలో 'ఒక్కడే! ఒక్కడే దైవం' అన్న విషయాన్ని గూర్చి సర్వత్రా అన్ని రంగాలకూ అన్వయించేలాగ **Oneness of God** అనే **Theme** మీద ఒక **Epic** వ్రాయమన్నాను. ఒక్కడే అన్న పురాణం మా కృష్ణశాస్త్రి వ్రాయాలి అన్నారు. అహోరాత్రాలూ ఆయన కదే ధ్యాస. 'ఒక్కడే దైవం'.

(13) ఆత్మగౌరవం:- శ్రీనాయుడుగారు బ్రిటిష్‌ప్రభుత్వం అంటే అభిమానం చూపేవారని, స్వాతంత్ర్యప్రియులు కారని చాల మంది దురభిప్రాయపడేవారు. రాజా రామమోహన్‌రాయి వలెనే భారతదేశమునకు బ్రిటిషు వారిపరిపాలనాసంబంధం కొంత మంచికే నని అది అంతా ఈశ్వరాదేశ మని నమ్మేవారు నాయుడుగారు.

ఆరోజుల్లో- అంతమాత్రాన ఆయన వ్యక్తిత్వాన్ని, ఆత్మ గౌరవాన్ని ఎన్నడూ అమ్ముకోలేదు. ఆయన కాలేజీ ప్రిన్సిపాలుగా వున్న రోజులు- అవి వందేమాతరం రోజులు. కలెక్టరుని, పోలీసు సూపరింటెండెంటుని కాలేజీ ప్రాంగణంలో ప్రవేశించి విద్యార్థులను అరెష్టు చెయ్యనియ్యలేదు. గేటువద్దనిలబడి, "మీరు లోనికి రావడానికి వీలులేదని, ఈ ఆవరణలో నా విద్యార్థుల మంచిచెడ్డలు నేను చూచుకొనేవాడను" అని, అధికారులతో నిష్కర్షగా చెప్పివేశారు. తన విద్యార్థులు తమ తమ యిండ్లలో అరెష్టు ఐతే, వారిని జామీను మీద విడిపించి జుల్మానాలు వేస్తే వాటిని శ్రీ నాయుడుగారే చెల్లించారు. ఈ గాథ 1907 నాటిదని మరువరాదు. శ్రీ నాయుడుగారు ఎంత ధీరుడో, ఎంత దేశభక్తుడో ఆయన విద్యార్థులిప్పటికీ చెప్పుకొంటారు.

(14) వ్యక్తిత్వం :- ఆయనకి "సర్" బిరుదు వచ్చినపుడు ఆనాటి నిబంధనల ప్రకారం నల్లదుస్తులు వేసుకోవా లన్నారు ప్రభుత్వం- ఆ బిరుదు స్వీకరించడానికి. "నాబిరుదు కావలిస్తే తీసుకోండి కాని, నేను నా మామూలు తెల్ల బట్టలతోనే వస్తా" నని వ్రాశారు గవర్నర్‌కి. ఆయన పాగా కుచ్చు పైకి మడిచెయ్యమంటే వీలులేదన్నారు, అంతకుముందు మొదటిబిరుదు వచ్చినపుడు ఇవి ఆయన స్వతంత్రానికి, జాతీయ భావాలకు చిన్న చిన్న నిదర్శనాలు.

(15) విశ్వ కుటుంబి :- ఎందరినో 'జీన్ వాల్ జీను'లను బిషప్‌వలె పరిరక్షించి, వారి జీవితాలలో తన ఆదర్శ-క్షమ-క్షమార్పణల వల్ల గొప్ప మార్పులను, పరిణామాలను తేగలిగారు నాయుడుగారు. ఆయన శిష్యుల కుటుంబాలలో అందరి పేర్లు నాయుడుగారికి జ్ఞాపకమే. వారిబిడ్డలు తన 'మానసపుత్రులు'. వారి మనుమలు తన మనుమలే. శ్రీ నాయుడుగారు గొప్ప విద్యావేత్తయే కాకుండ- విశ్వకుటుంబానికి యజమాని- జీవకారుణ్యమూర్తి.

## రఘుపతి వేంకటరత్నంనాయుడుగారు

విశాఖపట్నం నుంచి ఒక పూర్వ విద్యార్థి నాయుడుగారికి తాను ఆయన విద్యార్థికాకముందే సాహసించి ఒకవుత్తరంరాశాడు. అక్కడ కొంతమంది విద్యార్థులుకలిసి ఒక అద్దెగదిలో వుండేవారు. ఎవరో– ఒకప్పుడు మంచి స్థితిలో బ్రతికిన విద్యార్థి దైన్య స్థితిలో పడిపోయాడు. కొంతకాలం వాళ్లందరూ కలిసి కొంత సహాయం చేయడ మయింది. ఇంక అది సాగడంలేదు. ఎక్కడో కాకినాడలో రఘుపతి వెంకటరత్నంనాయుడుగారు అనేవా రున్నారని తెలిసి, వారిని బాధిస్తున్న సమస్యను గురించి, ఆ విద్యార్థి వ్రాశాడు. అది అందిన మరునాడు ఒక మనిఆర్డరు, తబిశీళ్లు ఇంకా రాయమని ఒక వుత్తరం నాయుడుగారి వద్దనుండి ఆ విద్యార్థికి వచ్చాయి. మామూలుగా ఒకేసారి ఏదో తోచిన సహాయం చేయడం కాదది. సహాయం పొందినవ్యక్తి కష్టసుఖాలు అడుగుతూ,వ్రాస్తూ అతను ఒక భక్తి మార్గంలో స్థిరపడేవరకూ క్షేమసమాచారాలు తెలుసుకోవడం నాయుడుగారిది 'తరుముకూతే'. నిజంగా [Hound of Heaven] ఈరీతిగా సహాయం పొందినవా రెంతమందో ?

ఏలూరు స్టేషన్‌లో ఒక పూర్వవిద్యార్థి కనిపించాడు. రైలులో నాయుడుగారు ప్రయాణం చేస్తోంటే. అతను చదువుకొనేటప్పుడు ప్రిన్సిపాల్ నాయుడుగారిని తూలనాడి ఎదిరించి పెద్ద ఆందోళన లేవతీశాడు. అదొక బీభత్సమైన ఘట్టం. ఆయన కాలేజీ ఉద్యోగంలో పెద్దవాడై స్టేషన్‌లో నాయుడుగారిని చూసినప్పుడు నమస్కరించి "నేను తమకు జ్ఞాపకమున్నానా" అన్నాడు. 'బాబూ, రాజూ, నాదగ్గర చదువుకొన్నావుకదూ– ఎలామరచిపోతాను ? నావిద్యార్థి నాకు ప్రియతముడు" అన్నారు గురువుగారు మనస్సాక్షి చురుక్కుమంది. సాష్టాంగపడి నాయుడుగారిని క్షమార్పణ అడిగాడు, పశ్చాత్తాపంతో అన్నిసంవత్సరాలకి. అది ప్రేమవిజయం.

కళావంతుల బిడ్డ ఒక అబ్బాయి చదువుకోడానికి ఉచితఉపకారవేతనం అడిగాడు; కళాశాలలో ప్రవేశం అర్థించాడు. రెండూ తప్పకుండా ఇస్తామన్నారు, ప్రిన్సిపల్‌గారు. కాని ఒకషరతు : వాళ్ళసంఘంలోనుంచే తనకి నచ్చిన అమ్మాయిని తరువాత పెండ్లి చేసుకోమన్నారు? ఆ వాగ్దానం యిచ్చాడు; అబ్బాయి చెల్లించాడు. ఆవిధంగా ఉద్ధరించారు కళావంతులని, నాయడుగారు.

16. అంతర్వాణి:- పిఠాపురం మహారాజావారికి వ్యావహారిక భాషంటే ఇష్టంలేదని నాయడుగారికి తెలుసును. ప్రగతినికాంక్షించే నాయుడుగారు రాజమండ్రిలో వ్యావహారికభాషావాదియైన శ్రీ గిడుగు రామమూర్తిగారి సన్మానసభకు వెళ్ళి కూర్చున్నారు, ఆ మహావ్యక్తియెడ తన గౌరవాన్ని తెలపడానికి. అందరూ ఆశ్చర్యచకితులయ్యారు.

రాజమండ్రిలో ఒకసారి శ్రీ తెన్నేటి సత్యనారాయణగారు నాయుడుగారిని దర్శించి, జిల్లా హరిజనసేవకసంఘానికి ఉపాధ్యక్షులుగా నుండమని కోరేరు. "సరే. కాని ఒక్కషరతు మీరు అస్పృశ్యతా నివారణమేరకే ప్రచారం చేస్తున్నారు. నాకు సమూలంగా కులనిర్మూలనానికి, అంతర్వివాహది సర్వమానవహక్కుల కొరకు పనిచెయ్యడానికి స్వేచ్ఛ ఉంటేనే అంగీకరిస్తాను. హరిజన సేవకు 'ఇంతవరకే' అని హద్దుపెడితే, నాకిష్టంలేదు." అన్నారు. అంతర్వాణినే ఆయన అనుసరించేవారు.

### రఘుపతి వేంకటరత్నంనాయుడుగారు

"నయము దప్పకుండ నడచు జనసమ్మ
తమ్ముగనుటె గౌరవమ్ముగాని
భాగ్య భోగములును పదవులు బిరుదముల్
వైభవములు గౌరవములుగావు.

జ్ఞానమలరజేసి యానంద మొదవించి
సమతగూర్చునదియె చదువుగాని
మతవివాదములును మదమత్సరంబుల
బొదలఁజేయు చదువు చదువుగాదు.

తనువు మనము ప్రాణమును నొక్కటిగనెంచి
ప్రియము నెఱపుచుంట ప్రేమగాని
కరపీడనములు కౌఁగిలింతలు స్వాగ
తములె ప్రేమవర్తనములుగావు.

నాల్క యిగిరిపోవ నామాలుచదువుచు
పూలు విసరినంత బూజగాదు
దేవునిత్యసేవ గావించు నెడనెడ
తెగని భక్తి పూజయగును గాని."

ఓమ్

### బ్రహ్మర్షి

# రఘుపతి వేంకటరత్నంనాయుడుగారి

# షష్టిపూర్తి కానుక

## V

## రత్నహారము

అవతారిక.

శ్రీయోగమయమైన సిద్ధరత్నంబు
ఆరోగ్యమయమైన యమృతరత్నంబు
రఘుపతి వేంకటరత్నంబునకును
ఆయురారోగ్యభాగ్యంబులఁ గూర్పఁ
దొలి షష్టిపూజలోఁ దోఁచినరీతి
మలిషష్టిపూజకు మాటలుదాఁచి
వెలమి వేంకటపార్వతీశ్వరకవులు
పరమేశ్వరుని గూర్చి పాడినపాట:

మంజరి.

౧. శ్రీపుష్పహారంబు చేతిలో నుండ
ముత్యాలహారంబు ముంగొంగునుండ
నీరత్నహారమే యింపయ్యెనేమొ
నాథుండు ధరియించి నవ్వుచున్నాఁడె!
పొలపంపునవ్వులోఁ బువ్వులు విరియ
ముసిముసినవ్వులోఁ ముత్యాలు గురియ
గలకలనవ్వులోఁ గమ్మలు మెఱయ
నాప్రేమరత్నంబు నవ్వుచున్నాఁడె!

## రఘుపతి వేంకటరత్నంనాయుడుగారు

౨. తెమ్మెరపాటలోఁ దేరినచలువఁ
దుమ్మెదపాటలోఁ దోఁచునాదంబుఁ
బువ్వులపాటలోఁ బొడమినతేనె
వెన్నెలపాటలో వెడలినసిగ్గు
రాగమాలికఁ జేర్చి రతనాలపాట
సుకవినై పాడుచు సొగయుచు నుండ
నీప్రేమకరముల నెమ్మేను నిమిరి
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె ?

౩. మధువనస్పతులతో మందు సేవించి
యజ్ఞానరోగంబు నడఁగింపలేక
మధురాక్షరములతో మంత్రముల్ చదివి
యాశాపిశాచంబు నదలింపలేక
విస్తృతారణ్యముల్ విశ్వకోశములు
శోధించి శోధించి చూచుచు నుండ
సిద్ధామృతం బిట్టె చేతిలో బెట్టి
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె !

౪. విరిదండలకు నెంతో విలువ లే దనుచు
స్వర్ణభూషణముల సంతరించితిని;
బంగారునగ లెంతో బరు వయ్యె ననుచు
మెఱుఁగులకై గ్రుడ్లు మిడుకరించితిని;
ఛూసించువారికే యలజడుల్ గాని
కోరుకోరికలకుఁ గొదలు లే వనుచు
నాజ్ఞానమూర్తివై ననుఁ బ్రబోధించి
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె !

౫. జోడుదీవ్వెలు వెల్గు చూపించుచున్న
సూర్యచంద్రులు కాంతి సూచించుచున్న
మనసులో నేమాయమబ్బు పట్టినదో
కడలెల్ల గాఢాంధకారమే యయ్యె;
ఈచిమ్మచీకటి కీవెల్గునకును
నేనాఁటిసఁబంధ మెఱిఁగింపు మనిన
నామాటతోడనే నను హెచ్చరించి
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౬. కనుఁగొన్నయట్లుగాఁ గలలఁ గాంచితిని;
గద్గదస్వరముతోఁ గలవరించితిని,
మెఱసినచో టెల్ల మెలపుతో వెదకి
దొరకినమణి యెల్ల దొలిచి చూచితిని,
ఇన్నింటఁ గనరాని యీరత్నమూర్తి
కన్నిటిలోననే గానవచ్చుటకుఁ
దాత్పర్య మే మని తలపోయుచుండ
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౭. చేయిజాఱెడుబిడ్డ చెలువంబుఁ జూచి
చిదిమివైచెడుకొమ్మ చిగురాకుఁ జూచి
యారిపోయెడు దివ్వె యందంబుఁ జూచి
జాఱిపోయెడుచుక్క చందంబుఁ జూచి
వట్టిపోయెడు నేటివడి నీటిఁ జూచి
వాడిపోయెడిపువ్వు వగనవ్వుఁ జూచి
ప్రకృతిలీలలఁ జూచి ప్రణయంబుఁ జూచి
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౮. కళల జాతించెడి కడసారివెలుఁగుఁ
జుక్క పుట్టిననాఁడె చూడలేనైతి;
నెత్తావు లెడలించు నిట్టూర్పుఁ బొగలఁ
బూవు పుట్టిననాఁడె పొడగాననైతి;
నిఖిలంబు వెలిఁగించు నీచిత్రకళల
సకలంబు మఱఁగించు చాయ లెక్కడివొ
నీదివ్యతత్త్వంబు నేఁటికిఁ జూపి
నాజ్ఞానరత్నమా నవ్వుచున్నావె!

౯. ప్రేమరత్నము స్వర్ణపేటికఁ బెట్టి
మమకారమునఁ జిక్కి మఱచిపోయితిని;
భావరత్నము జాళువాపూల దాఁచి
మదవాసనలఁ జొక్కి మఱచిపోయితిని;
జీవరత్నముఁ బైఁడిచెంగున ముడిచి
మాయలోపలఁ జిక్కి మఱచిపోయితిని;
నన్నె నే మఱచిన నావంకఁ జూచి
నాజ్ఞానరత్నమా నవ్వుచున్నావె!

౧౦. నానాఁటికిని దోఁచు నాయింటిదువ్వ
యేనాఁటి కానాఁడె యెత్తి పోసితిని;
ఏమూల నుంటివో యీ వందులోనె
బంగారుతీఁగలఁ బందించినావు;
కనుపాపలో నున్న కల్యాణమూర్తి
నిందాఁకఁ గనలేని యీమందమతికి
దివ్వెఁ జూపఁగ దివ్వెఁ దేవలె నంచు
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె!

## రత్నహారము

౧౧. ఘనపుటంబులనైనఁ గ్రాఁగని నీవు
కన్నీటివేడికే కరఁగుటఁ గాంచి
తొమ్మిదినిధు లైనఁ దూఁగని నీవు
తీయనిమాటకే తేలుటఁ గాంచి
యీరేడుజగములం దిముడని నీవు
నలుసంతకంటిలో నటియింపఁ గాంచి
యీవింత లే మంచు నే నెంచుచుండ
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౧౨. ఏపుణ్యగరిమనో యీతళ్కు గలుగ
నేయదృష్టముననో యెగురుట గలుగ
నిర్మలజ్యోతిని నేనే యటంచు
మిణుఁగురుపురుఁగనై మెఱసిపోయితిని;
నిఖిలంబు వెలయించు నీమూర్తి యెదుట
మినుమానికము గూడ మిణుఁగు రే యనుచు
నీదివ్యతత్త్వంబు నేఁటికిఁ జూపి
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౧౩. పాదాలకడఁ బుట్టి పసిపూవపిందె
తెలియకుండఁగఁ దన్ను దిగమ్రింగుచుండ
భావింపలేని యీ ప్రసవంపుబాల
కమ్మఁదావుల నెల్లకడలఁ బ్రాఁకించి
యింతమాత్రాననే యెదలోనఁ బొంగి
ముడుతవాటిన తనమొగ మింత చేయఁ
జింతలో నింతలోఁ జిఱునవ్వ లనుచు
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె!

రఘుపతి వేంకటరత్నంనాయుడుగారు

౧౪. ఏమూలనుండియో యెప్పుడో వచ్చి
చిగురుఁగొంగుల నున్న జీవధనంబుఁ
బొంచుండి యెవ్వఁడో పుణుకుచు నుండఁ
దెలియంగలేని యీ తీవతన్వంగి
వలపించు చిన్నెల వన్నెలఁ జూపి
సహకారమునఁ గోర్కె సాగించుచుండఁ
జింతలో నింతలోఁ జిఱునవ్వు లనుచు
నా ప్రేమరత్నమా నవ్వుచున్నావె !

౧౫. వాలుకాకణముల వరమణుల్ చేసి
వెలిఁగింపఁ జాలు నీ విమలతేజంబు
వారిశీకరముల వాహినుల్ చేసి
ప్రవహింపఁ జేయు నీ ప్రణయామృతంబు,
అల్పరేణువుల బ్రహ్మాండముల్ చేసి
యాడింపఁ జాలు నీయద్భుతశక్తి
నే నొక్కసారిగా నీకళాలీలఁ
దెలిసి కన్గొనఁగంటి దివ్యరత్నంబ !

౧౬. కరుణాపయోరాశి గర్భంబునుండి
యమృతకుంభంబుతో నవతరించితివా ?
కనకభూమీధర గర్భంబునుండి
యమృతవాహినులతో నవతరించితివా ?
గగన కల్లోలినీ గర్భంబునుండి
యమృతాంశు కళలతో నవతరించితివా ?
నా జ్ఞానమూర్తివై ననుఁ బ్రబోధించి
పరమార్థ మెఱిఁగింపు ప్రణయరత్నంబ !

## రత్నహారము

౧౭. కాలజీమూతాంధకారగర్భమున
నేమియుఁ దోఁపక యే మున్నవేళ
సన్నిధిఁ బెన్నిధిచాడ్పునఁ దోఁచి
కన్నుల వెన్నెలఁ గాయించినపుడె
కానవికన్నులఁ గళఁ గూర్చువెలుఁగు
నీలోపలి వెలుంగు నేఁ జూడఁగంటి
నే వెల్గునుండి నీ కీవెల్గు కలిగెఁ
జెప్పవే చెప్పవే జీవరత్నంబ?

౧౮. చిన్నిచెక్కులఁ బాలజిడ్డులు మెఱయు
చిన్నారిపసుఁబాప చిఱునవ్వువెలుఁగు,
బారలు సాఁచి పైఁబడుబిడ్డ నెత్తి
కౌఁగిలించెడితల్లి కన్నులవెలుఁగు,
ప్రథమదర్శనమునఁ బ్రణయంబు నించు
తరుణుల వలచూపుఁదరఁగల వెలుఁగు
నీవెల్గులోపల నే యెట్లు తోఁచెఁ
బలుకు మీచిత్రంబు భావరత్నంబ!

౧౯. సంజకెంజాయల సాన దీరితివో
చక్కనిచుక్కల జతలఁ జేరితివో
తొలుకారుమెఱుపుల తోఁట లేలితివో
వెలలేని వెన్నెలవెల్లిఁ దేలితివో
విజ్ఞానదీపికవెలుఁగులో నుండి
విశ్వంబు వెలయింప వెడలి వచ్చితివో
నిజముగా నీవెల్గు నీ కెట్లు గలిగెఁ
దెలుపవే తెలుపవే దివ్యరత్నంబ!

## రఘుపతి వేంకటరత్నంనాయుడుగారు

౨౦. తల్లిదండ్రులు లేక తనయులు లేక
యిష్టబంధులు లేక యిల్లాలు లేక
కుడువఁ గూడును గట్ట గుడ్డయు లేక
దిక్కేది విలపించు దీనమానవుల
యాఁకటిమంట వెన్నంటినకడుపు
లగ్గికొండలరీతి నదరుచు నుండ
నార్తులఁ దొలఁగించు నమృతంపుఁగళలఁ
బ్రసరింపవే నీవు ప్రణయరత్నంబ!

౨౧. కామాదివికృతులు కంచెలఁ గొట్ట
వాతాదిదోషముల్ వడిసుడుల్ వెట్టఁ
దనవార లైనను దరిఁ జేరరాని
ఘనరోగముల స్రుక్కి కడగండ్లఁ జిక్కి
కన్నవారల కెల్లఁ గడుపులు దఱుగ
దుస్సహబాధల దురపిల్లువారి
సదయుండవై చూచి సంజీవకళలఁ
జిలికించి ప్రోవవే సిద్ధరత్నంబ!

౨౨. నిత్యకళ్యాణంబు నిప్పచ్చరమున
నూషరక్షేత్రాన నుద్యానవనము
కమ్మనివిరిదమ్మి కలుషపంకమునఁ
జివికించుచింతలోఁ జిఱునవ్వుమొలక
యమృతకాసారంబు నమ్మరుభూమి
దుఃఖసాగరములో దుగ్ధఫేనంబు
సంతరింపఁగఁజాలు సౌవర్ణకళలు
కలవుగా నీలోనఁ గాంతిరత్నంబ!

౨౩. ఆర్తస్వరంబులో నానందగీత
మాలకింపఁగఁజాలు నమృతమూర్తులకుఁ
దీవ్రశాపంబులో దీవనపదము
పట్టి పాడఁగఁజాలు పరమశాంతులకు
మోహజాలంబులో ముక్తిమార్గంబు
తరిచి కన్గొనఁజాలు తత్త్వవేత్తలకు
నీదివ్యకళ కళానిలయమో యేమొ
సత్యంబుఁ దెలుపవే జ్ఞానరత్నంబ!

౨౪. అద్దించి రెవ్వరో యాకారలీలఁ
జిత్రించి రెవ్వరో చిత్రవర్ణముల
మెఱపించి రెవ్వరో మింటి కెక్కించి
మఱపించి రెవ్వరో మాయఁ జిక్కించి
యే నింద్రధనువునై యిన్నాళ్ళదాఁక
నెండవానల నంది నిఱుకుచుఁ దుదకు
నీనిత్యకళ్యాణ నిర్మలకళలఁ
దెలిసి కన్గొనఁగంటి దివ్యరత్నంబ!

౨౫. చక్కనిచుక్కల చకచకల్ సూచి
నిద్దంపుమొగ్గల నిగనిగల్ సూచి
తామరపై నీటి తళతళల్ సూచి
మింటిపై మిణుఁగురు మిలమిలల్ సూచి
నాడెంబు దెలియని నాశైశవమున
నవియెల్ల రత్నాలె యనుకొంటిఁ గాని
బొగ్గులలో మణుల్ పుట్టించు నిన్నుఁ
దెలియంగలే నైతి దివ్యరత్నంబ!

౨౬. ఎఱుఁగనితనములో నేడుపులోనె
పకపక నవ్వితిఁ బసుపుఁబొత్తిళ్ళ;
నానవ్వు లావేళ నాతల్లి ప్రేమఁ
దళుకొత్తుకన్నులఁ దళతళలాడె;
ఆ నవ్వు లాతళ్కు లానాఁటినుండి
యీనాఁటిదాఁక నే నీక్షింపనైతి
నేఁటి కాచిఱునవ్వు నీకంటు మెఱయ
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౨౭. ఆనాఁడు పసిపాప నై యున్ననాఁడు,
తూగుటుయ్యాలలోఁ దూగెడునాఁడు
జోలపాటలలోనఁ జొక్కెడునాఁడు
తెలివియు నిద్రయుఁ దెలియనినాఁడు
ఈవు నే నను భేద మెఱుఁగనినాఁడు
చూచి చూడనిరీతిఁ జూచితి నాఁడు;
నాయదృష్టంబున నాఁటికి నేఁడు
తెలిసి ని న్గనఁగంటి దివ్యరత్నంబ!

౨౮. నిడుదపెన్నెఱులలో నీలాలఁ జూచి
పక్వాధరములలోఁ బగడాలఁ జూచి
మొలకదంతములలో ముత్యాలఁ జూచి
రమ్యహాసములలో రతనాలఁ జూచి
రతనాలగను లన్న రమణులే యనుచు
యౌవనమదముచే నలరితిఁ గాని
నిత్యమోహనకళల్ నీసొమ్ము లనుచు
భావింపలే నైతిఁ బ్రణయరత్నంబ!

౨౯. తొలఁగిపోయినదాఁకఁ ద్రుళ్ళింపఁజాలు
సౌభాగ్య వైభవ సంపత్తిఁ జూచి
వయసు తీరినదాఁక వలపింపఁజాలు
కామినీమణుల సింగారంబుఁ జూచి,
కామాంధకారంబు గన్నులఁ గప్ప
నీవంకఁ గనలేక నే నున్నవేళ
నాదివ్వె వెలిఁగించి నావంకఁ జూచి
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౩౦. కలికివాల్చూపుల కలకల లేక
క్షణము యుగంబుగాఁ గడపిన నేను,
మిసిమిబంగారంపు మిలమిల లేక
గడియ కల్పంబుగాఁ గడపిన నేను,
ప్రాణంబునకుఁ బ్రాణమై యున్ననిన్ను
మఱచియుండినయట్లు మది నెంచనైతి;
ఈమందమతిఁ జూచి యిన్నాళ్ళదాఁక
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౩౧. కన్నులలో వెల్గు కనుఁగొనలేక
పవలింటిలో వెల్గు పరికింపలేక
పాడింటిగోడల పైసందులందుఁ
జీకటిగూఁటిలోఁ జిక్కిపోయితిని;
ఇంతింతకను లున్న యీగ్రుడ్డిగూబ
తిమిరరోగము మాన్పఁ దెలివిమం దిచ్చి
చీకటిపొరఁ దీసి చేతిలోఁ బెట్టి
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౩౨. గాజువారిన చిల్లిగవ్వలఁ జూచి
పనికిమాలిన గడ్డిపరకలఁ జూచి
గాలిఁదూలెడు పొల్లుకాయలఁ జూచి
పెటిలిపోయెడి కుండపెంకులఁ జూచి
పేరాస వోని నాపెద్దకాలమున
హేమరత్నము లంచు నెంచితిఁ; గాని
కోరుకుల్ పండించు గుణమణి నిన్ను
సాధింపలే నైతి జ్ఞానరత్నంబ!

౩౩. ననుఁ బ్రాణముగ నెంచు నాకన్నతల్లి
యడిగిన వెల్ల నా కందించుచుండఁ
దనివి తీరక యాస తల కెక్కి త్రిప్ప
దేశదేశంబులఁ దిరుగుచు నుండఁ
దిరిసి కూర్చినతేనెతెరఁ గొంచుఁబోవు
నెఱుకువానిని దేనెటీఁగలఁ జూపి
నాచూపుతోడనే ననుఁ బ్రబోధించి
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౩౪. చీకటు లడఁగించు చేదివ్వెతోనె
కనకసౌధంబులఁ గాల్చివైచితిని;
ఆమయంబు లడంచు నమృతంబుతోనె
తీయనిప్రాణముల్ తీసివైచితిని,
సత్యంబు బోధించు చదువులతోనె
మఱపించి జగ మెల్ల మాయఁజేసితిని
నాతప్పు మన్నించి ననుఁ గటాక్షించి
దర్శనం బిచ్చితే దైవరత్నంబ!

## రత్నహారము

౩౫. ఏన్నటఁ బెంచిన ప్రణయంపుఁదోఁటఁ
గ్రొన్నెత్తురులసోనఁ గురిసి ముంచితిని;
మౌళిఁ దాల్చుచునుండు మణికిరీటంబుఁ
బాదరక్షల మట్టి పగులఁగొట్టితిని;
కొఱవిదయ్యముఁబోని కోపంబుచేత
నిలువెల్ల నిప్పుగా నే నున్నవేళ
నీ శాంతకరముల నెమ్మోము నిమిరి
నా ప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౩౬. దోమనై గజరాజు దొరసి ముట్టితిని,
రిక్కనై రేరాజు రెక్కఁ బట్టితిని;
ఈఁగనై ఖగరాజు నెదిరి నిల్చితిని,
పురుగనై ఫణిరాజుఁ బోరఁ బిల్చితిని;
ఒడ లెఱుంగని గర్వముప్పొంగిపోవ
నెదిరి నన్నెఱుఁగక యే నున్నవేళ
నా పుస్తకంబులో నా పేరుఁ జూపి
నా ప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౩౭. ప్రకృతిరాజ్యంబునఁ బలుమాఱుఁ దిరిగి
స్వప్నరాజ్యంబుతో, సరిచూచి చూచి
సౌఖ్యవాహినులలో స్నానంబు లాడి
దుఃఖవాహినులతోఁ దులఁ దూఁచి తూఁచి
తలక్రిందు గావించి తల కంటుగించి
తెలిసియుఁ దెలియక తిరిగి వేసారి
యాకస్మికముగ నీ యానందకళల
వెలుఁగున మేల్కాంటి విమలరత్నంబ!

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA D.P.R.I. Acc. No.

౩౮. నిరుపేదలకుఁ బొట్టనిండుటఁ జూచి
నిధినాథు లాఁకట నీల్గుటఁ జూచి
కోరక సౌఖ్యముల్ కూడుటఁ జూచి
త్రోయక సంపదల్ తొలఁగుటఁ జూచి
చూచి చూడనిరీతి సుఖదుఃఖములకు
నీడ లాడురు గాని నీయున్నచోటుఁ
గోటి కొక్కఁడుఁ జేరుకొనజాలఁ డనుచు
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౩౯. నీపుస్తకంబులో నీయాకులోన
నీపాట నీపేరు నేఁ గానలేక,
నీచరిత్రంబులో నీకీర్తిలోన
నీమూర్తి నీవెల్గు నేఁ గానలేక,
సారస్వతం బెల్ల సాధించి చూచి
విశ్వకోశం బెల్ల వెదకి గాలించి
యింకేది గతి యంచు నెదఁ గుందుచుండ
దర్శనం బిచ్చితే దైవరత్నంబ!

౪౦. సుడిగాడ్పుటెండల సోలిపోకుండఁ
బక్షినై నినుఁ గూర్చి పాడుకోనిమ్ము!
మబ్బుపెందెరలలో మాటు గాకుండఁ
జుక్కనై నీసొంపుఁ జూచుకోనిమ్ము!
ఇసుకకొండలదండ నింకిపోకుండ
సెలయేటినై నిన్నుఁ జేరుకోనిమ్ము!
నీకొల్వుఁ గోరితి నిరతంబు, నిన్ను
సేవించుకోనిమ్ము జీవరత్నంబ!

౮౧. అమ్మలపొమలతో నమృతరసంబుఁ
బువ్వుఁదీవలకును బోసెడివేళఁ
గొదమతుమ్మెద నొవ్వఁ గుట్టినచేత
గున్నపొన్నకు బోదెఁ గూరుచువేళ
ముల్లునాటినపాదముల నల్లనరిగి
మల్లెతీవకు నీరు మలపించువేళఁ
బ్రణయంపుఁబూఁదోఁట బచ్చికబైట
నా ప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౮౨. పాపపుఁగొండలు బరు వంటిఁ గాని,
పైఁడికొండలకునై ప్రాఁకులాడితినె?
నిలుపుమీ నన్ను సన్నిధి నంటిఁ గాని,
పెన్నిధు లిమ్మని పెనఁగులాడితినె?
కలకురాళ్లను గూర్తఁ గన్నీరు గురియ
వెట్టినై నినుఁగూర్చి విలపించుచుండ
నేమూలనో దాఁగి యిన్నాళ్ళదాఁక
నా ప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౮౩. నీమాట లనుచుంటి నిన్నెంచుచుంటి
నీకలల్ గనుచుంటి నిను మెచ్చుచుంటి
నీపాట వినుచుంటి నీచెంత నుంటి
నీలీలఁ గనుచుంటి నీలోన నుంటి
నివియెల్ల నిట్లుండ నిన్నాళ్లదాఁక
నెన్నిమో జన్మంబు లెత్తితిఁ గాని
కన్నుండి నీమూర్తిఁ గననైతి ననుచు
నా ప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౮౪. కాంతులు గలచోటఁ గన్నులు మూసి
చీకటిబీటిలోఁ జిందులాడితిని;
ప్రణయంబు గలచోట భావంబు దాఁచి
యల్లరిమూఁకతో వాటలాడితిని;
వాకంటిదీపంబు నాజుంటి తేనెఁ
జెమ్మని యెపుడైనఁ దీండ్రింతు ననుచుఁ
బదిలంబు చేసిన పరమాప్తు నిన్నుఁ
దెలిసి నేఁటికిఁ గంటి దివ్యరత్నంబ!

౮౫. చిత్రంబు లెన్నియో చేసితిఁ గాని
నీమూర్తిఁ జిత్రింప నే నేరనైతి;
ఎన్నియో వన్నెల నెఱిఁగితిఁ గాని
నీవన్నె లద్దింప నే నేరనైతి;
పలుకుల కందని భావరత్నంబుఁ
గన్నులఁ జూపించు కళలచే మెఱయు
కవితనై నినుఁగూర్చి గానంబు చేయ
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౮౬. వాభక్తి పెల్లున వటియింతుఁ గాని
వటియించుమెప్పులు నా కేమి తెలియు?
నాప్రేమపొంగున నవ్వుదుఁ గాని
నవ్వించుతిప్పలు నా కేమి తెలియు?
కవిత యబ్బెను గానఁ గలసి నిన్ బాడి
నాట్యంబు సేయుచు నవ్వుచు నుందు
నెవ్వ రేమనుకొన్న నింకేమి నాకుఁ
దెలిసికొంటిని నిన్ను దివ్యరత్నంబ!

## రత్నహారము

౪౩. వర్ణంబు లెల్ల నీవన్నెలో నుండ
శబ్దంబు లెల్ల నీచదువులో నుండ
నర్థంబు లెల్ల నీయాత్మలో నుండ
భావంబు లెల్ల నీపదములో నుండఁ
గల్పన లెల్ల నీకాంతిలో నుండఁ
గవిత లన్నియును నీకళలలో నుండ
నేను పాడినపాట నీపాట గాక
వేఱె యెక్కడిపాట విబుధరత్నంబ!

౪౪. నీరెండలోనఁ బన్నీరు పొంగించి
వెన్నెలవెలుఁగులో వెన్న దీయించి
చుక్కలలోఁ దేనెచుక్క లొల్కించి
పలుకులలోననే భావముల్ చూపి
కవితచే లోకంబు కన్నుల మూయు
కవిని వీలీలాసుకవిని గావించి
పరిణయరాగమున నీపాట పాడించి
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౪౫. వీనామగానంబు నేఁ జేయువేళ
నగుఁగాక మలహరి యానందలహరి;
వీమంత్రము జపంబు నేఁ జేయువేళఁ
బ్రత్యేకబీజంబుఁ బ్రణవ మౌఁగాక;
నీగుణధ్యానంబు నేఁ జేయువేళ
ఘనకీర్తి యగుఁగాక కల్యాణమూర్తి;
గుడి నిల్పుకొను వేళఁ గుటిలచిత్తంబు
చెదరకుండినఁ జాలు జీవరత్నంబ!

౨౦ కృపణత్వమునఁ జేసి కృషి చేయలేక
పండువంటిపొలంబు పసిబీడు చేసి
పెఱవారిమళ్లలోఁ బేరాసఁజేసి
పక్షులఁ దోలుచుఁ బరిగెల నేఱి
యాఁకలి దీరక యాయాసపడుచుఁ
దప్పుదారులలోనె తడఁబడుచుండ
నాయదృష్టమున నిన్నాళ్ల కీవేళఁ
బ్రత్యక్ష మైతివే భాగ్యరత్నంబ!

౨౧. నీలంపుఁదెరవెన్క నిధు లున్న వనుచు
నేలకు నింగికి నిచ్చెనల్ గట్టి
యే వేళఁ దప్పక యెక్కుచు దిగుచు
నడియాసఁ దూలుచు నడలుచు నుండఁ
బ్రొద్దుపూసినమబ్బుప్రాకార నొత్తగించి
నిలిచినచోటఁ బెన్నిధులు చూపించి
వాంఛితంబులు నాకు వల దనిపించి
నాభాగ్యరత్నమా నవ్వుచున్నావె!

౨౨. నీవెల్గు నామది నిండుటే కాక
నిఖిలదిగంతముల్ నిండిపోయినది;
నీయూష్మి నాయెడి నింపుటే కాక
నిఖిలసంసారముల్ నింపివైచినది;
నీమూర్తి నాచెంత నిలుచుటే కాక
నిఖిలలోకంబుల నిలువరించినది;
నే నింతవాఁడనై నీయంతవానిఁ
దెలియు టబ్బురము గాదె దివ్యరత్నంబ!

౨౩. విశ్వంబు నేలు నీవిభుత సూచింప
దినమణియే కరదీపిక యయ్యెఁ;
భవదీయసేవావిభవము సూచింప
రాజరత్నంబె నీరాజనం బయ్యెఁ;
దిలకింపరాని జ్యోతిర్మూర్తి వీవు
లక్షింపరాని కళామూర్తి వీవు
నీదివ్యమూర్తి వర్ణింప నే నెంత?
దయఁజూడు దయఁజూడు దైవరత్నంబ!

౨౪. గాలివాన కొకింత కలఁగిపోకుండ
సుడిగుండములలోన సుడిసిపోకుండ
బలితంపుగొండలఁ బగిలిపోకుండ
మొత్తంపుఁదరఁగల మునిఁగిపోకుండఁ
దడఁబాటుతో దారి తప్పిపోకుండ
నడిసముద్రంబులో నాయోడఁ ద్రిప్పు
నావికరత్నంబు నక్షత్రి మగుచు
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౨౫. సత్యమే జయ మని చదివిన నేను
సాధింపలేనైతి జయకేతనంబు;
శాంతమే సుఖ మని చదివిన నేను
శోధింపలేనైతి సుఖనిధానంబు;
తెలియనితెలివితోఁ దిరిగెడి నాకుఁ
జదువులో మర్మంబు జగతిమర్మంబు
గరతలామలకంబుగాఁ దోఁచురీతిఁ
దెలిపి చూపితి గాదె దివ్యరత్నంబ!

౨౬. ప్రణయైకమూర్తి నాపజ్జను నిలువఁ
గష్టంబు లెల్ల సుఖంబులే యయ్యెఁ
గల్యాణమూర్తి నాకన్నుల నిలువ
దుఃఖంబు లెల్ల సంతోషంబు లయ్యె
నిర్మలమూర్తి నా నెమ్మది నిలువ
నానంద మెల్ల బ్రహ్మానంద మయ్యె
నజ్ఞాన మెడలించు నానందకళలఁ
దేలియాడెద నింక దివ్యరత్నంబ!

౨౭. లోకంబులను గుక్షిలో దాఁచి ప్రోచు
దివ్యమూర్తిని నిన్నుఁ దెలియంగలేక
తరుణియో పురుషుఁడో తలఁప నేమూర్తి
వీ వని వెట్టినై యే నెంచుచుండి
మధురప్రణయసుధామయ మాతృమూర్తి
మంగళవాత్సల్యమయ పితృమూర్తి
నీమూర్తిలోపలనే నాకుఁ జూపి
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౨౮. పసుపు రాచినయట్టి పసిఁడిరేకులను
బైఁడిగంటములతోఁ బద్యముల్ వ్రాసి
చదువులగని యైన సర్వజ్ఞమణికిఁ
గృతకృత్యతను గోరి కృతి నీయఁ గంటిఁ;
బ్రత్యక్షరమునందుఁ బ్రణయరసంబు
ప్రసరించెనో లేదో పరికింపుమంటి;
హృదయంబు గ్రహియించు నింగితజ్ఞునకు
విన్నపంబు లికేల విబుధరత్నంబ!

రత్నహారము

౨౯. నవనిధు లర్పింప నావల్లఁ గాక
నవరసంబులు నింప నాచేఁత గాక
నవరత్నములమూట నామాట గాక
నవరాత్రిదీక్షలో నాశక్తి కొలఁది
నేనుగూర్చినయట్టి యీపద్యరత్న
హారంబుఁ గాన్కగా నందింప నంది
నామాట లాలించి నాచేఁత లెంచి
నాప్రేమరత్నమా నవ్వుచున్నావె!

౩౦. ఒక్కొక్కవిధముగా నూహఁ గావించి
యున్నంతతెలివితో నోపినరీతి
నిత్యనిర్మల మైన నీమూర్తిలోన
నఱువదింటిని గంటి నానందకళల;
ఈలీల నీలీల లెన్నెన్ని గలవొ
కన్నులు చల్లగాఁ గనుఁగొనఁ గోరి
నినుఁ జేరి నామది నినుఁ జేర్చుకొంటి
నభిమతంబును దీర్పు మమృతరత్నంబ!

౩౧. నీవు గల్గినచోటు నిధు లున్నచోటు
నిర్మలం బగుచోటు నీవెల్గుచోటు
నిత్యనూతనవేల నీకళాలీల
నిత్యసత్యస్ఫూర్తి నీదివ్యమూర్తి
నిత్యపవిత్రంబు నీచరిత్రంబు
నిత్యకళ్యాణంబు నీపురాణంబు
సుగుణరత్నమ! నీకు శుభ మౌనుగాక!
విబుధరత్నమ! నీకు విజయ మౌఁగాక!

శ్రీ శ్రీ శ్రీ

# పంతులుగారు - నాయుడుగారు

దేశం దురాచారాలతో నిండి, అజ్ఞానాంధకారంలో నున్నపుడు పంతులుగారు, నాయుడుగారు— వీరిరువురు లోకానికి సుస్థిరమైన పునాదులు వేసిన నవ్యాంధ్ర ధీరోదాత్తులు. మన నాయకులందరు వారి ఆధ్యాత్మిక సంతతికి చెందిన వారలే. ఆంధ్రులకు ఒక్కరే 'పంతులు గారు', ఒక్కరే 'నాయడుగారు'— విప్లవ వీరులు, విశ్వాసధీరులు, అమరజీవులు, దివ్యజ్యోతులు. పతాకం పట్టినవా రొకరు. పాంచ జన్యం పూరించినవా రొకరు. ఒకరు కలం పట్టారు. ఒకరు వేదిక నెక్కారు.

సర్వతోముఖ సంస్కరణానికీ, ఆధ్యాత్మిక నవజీవనానికీ బీజాలు చల్లేరు. ఒకరు వ్యాసధాటిలో, ఒకరు ఉపన్యాసఝరిలో, తెలుగువారిని ఉఱ్ఱూతలూగించేరు, మేలు కొల్పేరు. బాహ్యప్రకృతిని బట్టి చూస్తే నాయడుగారు, పంతులుగారు అన్ని విషయాలలోను విరోధి గ్రహాలలాగ ఉండేవారు. అంతరంగిక దృష్టితో పరిశీలిస్తే ఇద్దరూ ఒక్క పీఠం దగ్గరే ఆరాధకులు— బ్రహ్మోపాసకులు.

పంతులుగారు సన్నని బలహీనులు.
నాయడుగారు అజానుబాహువు.
పంతులుగారు ఆంధ్రభాషాకోవిదులు.
నాయడుగారు ఆంగ్లభాషావేత్త.
పంతులుగారు వ్యాసరచనాగ్రేసరులు.
నాయడుగారు వక్తృత్వ విశారదులు.
పంతులుగారు నారికేళము.
నాయడుగారు రసాలము.

పంతులుగారు దీనబంధువు — అనాధులకు తండ్రి.
నాయడుగారు ప్రేమసింధువు — అగతికులకు తల్లి.
పంతులుగారు అంధకారములో ప్రళయభేరి.
నాయడుగారు బృందావనములో వేణువు.
పంతులుగారు మార్తాండ తేజము.
నాయుడుగారు దివ్యజ్యోత్స్న.
పంతులుగారు ఝంఝూమారుతము.
నాయడుగారు మలయవీచిక.
పంతులుగారు క్షత్రియపుంగవుడు — కర్మవీరుడు.
నాయడుగారు బ్రాహ్మణోత్తముడు — కారుణ్యమూర్తి.
పంతులుగారు పరిశుద్ధ ఆస్తికవిశ్వాసి.
నాయడుగారు కృపాభిక్షకొరకు నిరంతర ఆరాధకులు.

*

108

BcI

AbuA1013125

BC

## మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA101B125 |
| పుస్తకం పేరు | రఘుపతి వేంకటరత్నం జీవితసంగ్రహం ఉపదేశాలు కథలు |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | Yes |
| వెనుక అట్ట | Yes |
| మొత్తం పేజీలు | 113 |
| పెద్ద సైజు పేజీలు | No |
| ఖాళీ పేజీలు | C: I IV X |
| లేని పేజీలు | No |
| తయారు చేసినది | P. Nagamma |
| పేజీలు విడదీసినది | P. Sayamma |
| స్కాన్ చేసినది | [illegible] |
| పరీక్ష చేసినది | MADHUMATHI |
| పేజీలు పరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | Good |

108 BCI